UNIVERSAL LIBRARY
OU_206143
UNIVERSAL LIBRARY

OUP—881—5-8-74—15,000

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T 81 Accession No. T 671

Author A61S అన్నయకవి, తెనాలి

Title సుదక్షిణాపరిణయము. 1941

This book should be returned on or before the date last marked below.

PRINTED BY
V. VENKATESWARA SASTRULU
OF V. RAMASWAMY SASTRULU & SONS
AT THE 'VAVILLA' PRESS
MADRAS—1941.

# గ్రంథ పరిచయము

---

సుదక్షిణాపరిణయ మయిదాశ్వాసముల ప్రబంధము. తెనాలి అన్నయ్య దీనిని రచియించెను. ఇతఁడు తెనాలి రామకృష్ణ కవిసోదరుఁ డట. ఈ ప్రస్తావము తెనాలి రామభద్రకవి రచియించిన యిందుమతీపరిణయమునఁ† గలదు. అందు, కృతిపతి తన్నుద్దేశించి యీ క్రిందితీరున పలికెనని రామభద్రకవి పేర్కొనెను:

మ. నను శ్రీరామపదాంబుజాతయుగళీ నందద్ద్విరేఫాయమా
ననిజస్వాంతుఁ దెనాలివంశమణి సన్మానంబు మీఱంగ ర
మ్మని కారుణ్యసమగ్రతం బిలిచి భోజాధీశధీశాలి యి
ట్లనియెం బూర్వకృతిప్రసంగమున నత్యానందసంధాయి యై.

తే. రామభద్రకవీంద్ర నీరచనఁ దనరు, ధీనుతం బైన యిందుమతీ పరిణయ
మంకితంబుగ మాకు ని మ్మనఘమయిన, కృతినిఁగా...... తెరకీర్తి గలదె!

• ప్రౌఢి మీ పెదతాత పాండురంగాదిసత్కృతులు చేసెను రామకృష్ణసుకవి
యనుజుఁ డన్నప్ప మీపినతాత రచియించెఁ బరగ సుదక్షిణాపరిణయంబు
మీ తాత శ్రీగిరి చాతురీవిఖ్యాతి శ్రీశైలమాహాత్మ్యకృతి యొనర్చెఁ[ములను
గడిమి మీతండ్రి యిమ్మడిరామకృష్ణార్యుఁ డనఁ గీర్తిఁ గనె సంస్కృతాంధ్ర
వారలను మించె మీయన్న వీరరాఘ
వాఖ్యకవి సర్వకవితామహత్త్వమునను

---

† ఇది అముద్రితము; తంజావూరి వ్రాఁతపుస్తకముల లైబ్రరిలోన్నది.

నిన్ననాచానసంతానుఁ డెన్నఁదరమె
ప్రాజ్ఞహృదయాబ్జరవి రామభద్రసుకవి.

అన్నయకవి క్రీ. శ. ౧౫౫౦ ప్రాంతములవాఁడని చరిత్ర పరిశోధకుల యభిప్రాయము.

పులిజాల సోమమంత్రి యీప్రబంధమునకుఁ గృతిపతి. ఇతఁడు ఆరవీటి కోనేటి రామరాజునకు మంత్రియఁట.

ఈప్రబంధమున శ్రీరాముని *తాత యగు దిలీపుని చరిత్రము సుదక్షిణాదేవి వివాహపర్యంత మష్టాదశవర్ణనా ప్రచుర మగు ప్రబంధధోరణిని వర్ణితమయినది.
అన్నయకవి

"పలుకులకల్కి కప్పురపుఁ బల్కులు చల్లినరీతిఁ బండు వె
న్నెలతళుకుల్ విధుండు హావణించిన మించున శంబరారి చెం
గలువల తూపుఁ గోపుల ముఖాముఖిఁ జూపిన యేపునం
గృతుల్"

"పూర్వకవిపద్ధతి" "పల్కఁగనేర్పు" "సత్కవి"† యగుటయు, సుదక్షిణాపరిణయమును "సరససాహిత్యసౌహిత్యపరత" "పరిఢవించు"టయు‡ నిక్కము. అందును ఇతఁడు దీనిని పూర్వకవి—ప్రబంధకవి—పద్ధతిని పల్కఁగనేర్చుట మిక్కిలినిక్కము. ఇతని యన్నయగు రామకృష్ణకవి స్వతంత్రపద్ధతిని పలుకనేర్చినవాఁడు.

* ఈగ్రంథమున తాతయనియే కలదు. రఘువంశాదులక్రమమున తాతకుఁదాత యగును.

† చూ. ఆ. ౧, ప. ౧౫. ‡ చూ. ఆ. ౧, ప. ౧౭.

కవిత్వవిషయమున తమ్మునియం దన్న పోలికలు కానరాకున్నవి. కాని యితనికవిత్వము ప్రౌఢసుందరమయినదని చెప్పకతప్పదు.

ఇతని అచ్చతెనుఁగు కవిత్వమునకు మచ్చు:

"సీ. వెలిదమ్మిరేకుల వికవిక నగఁజాలుడాలు కన్నులయొప్పు గేలుకొనఁగఁ
జుట్టుగత్తియు నీటిపుట్టువుఁ జేదోయి నీరెండ రేయెండఁ దారసింపఁ
బచ్చరానిగ్గుతో మచ్చరానకు వచ్చు మచ్చ యయ్యెదచక్కిఁ బెచ్చు మీఱ
నుదిరిబంగరుచుట్టు నొఱపట్టు నునుబట్టు దుప్పటి వలెవాటు దొంగలింపఁ
బోసరించిన యొకబొల్లిపులుఁగు నెక్కి
పులియు గఱిమేనివేల్పుతోఁ గలయఁ జనుట
చూచి యచ్చోటెనికటంపుసొంపుఁబెంపు
మెచ్చె నారాచకొమరుండు నిచ్చలోన."                ఆ. ౫, ౭౦.

"సీ. రంగత్తరంగపరంపరాసంపాతకంపితాకాశదిగ్గగనతలముఁ
బాతాళబిలవాసి వాతాశనాధీశసంతాపకార్వాగ్నిసంభవంబుఁ
గ్రూరతరగ్రాహఘుమఘుమితకబంధఘోష సముత్శేషభీషణంబు
జలపానసంచార జలధరశ్రేణికాఖిల సముత్తాలకూలకులముఁ
బృథులడిండీరమండలీహిండనంబు, దీపితాంతఃప్రకాశితద్వీపకంబు
నైనమాయాంపయోరాశియధిపబలము, ముంచెవేల్పులుపీక్షించిసంచలింప."

ఆ. ౫, ౧౦౨.

ఇట్లును, ప్రౌఢిని దీని నింకనుమించియు, నితని సంస్కృత బాహుళ్యరచన ముండును.

ఇతని యుభయభాషా మిశ్రరచనము:

"ఉ. నా విని చిన్ననవ్వు వదనంబునఁ గొండొకపొల్పు నిల్పఁ బూఁ
దావులతావులై యమృతధారలమేరలు నై తనర్చువా

చావిభవంబు లెచ్చఁగ రసాతలనాయకుఁ బల్కు మేచక
గ్రీవవిరోధి బంగరువు కిన్నరమీఁటెననీటు చూపుచున్." ఆ. ౪, ౧౮.

మఱియు :

"ఉ. వాడినమోముతోడఁ గయిప్రాలినచూపులతోడ దీనతం
గూడినపల్కుతోడ నెఱిఁగూడనిగందపుఁబూఁతతోడఁ గీ
లూడిన యందెతోడ బిగియూడిన తాలిమితోడవచ్చె గ
గ్గాడియుఁ బోలెఁ గామగవి గాఁడిఁగలయ్య నృపాలువీటికిన్. ఆ.3.ప.4

ఇంద్రుని దీనస్వరూప మిందు కన్నులకు కట్టుచున్నది. ఇట్టి సుందరరచనము గలపట్టు లీప్రబంధమునఁ జాలఁగలవు.

కాగితములవెల మిక్కిలి పెరిగియున్న కాలమున నీప్రబంధమును శ్రీవావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్‌వారు వ్యయమును పరిగణింపక మేలుకాగితములమీఁద సుందరముగ ముద్రించి ప్రకటించుట అక్షరాస్య మగునాంధ్రలోకమున కత్యంతము హర్షదాయకము.

చిత్రభానువత్సరాది,
పామూరు.

గన్నవరపు సుబ్బరామయ్య

# విషయానుక్రమణిక

## ప్రథమాశ్వాసము


| విషయము | | పుట |
| --- | --- | --- |
| ఇష్టదేవతాస్తుతి | ... | 1 |
| కుకవినింద | ... | 3 |
| కృతిపతిప్రభువంశవర్ణనము | ... | 5 |
| కృతిపతివంశవర్ణనము | ... | 7 |
| షష్ఠ్యంతములు | ... | 12 |


## కథాప్రారంభము


| | | |
| --- | --- | --- |
| అయోధ్యాపురవర్ణనము | ... | 13 |
| ఋతువులు | ... | 15 |
| పుష్పలావికలు | ... | 16 |
| మందమారుతము | ... | ,, |
| చతురంగబలము | ... | ,, |
| స్త్రీలు | ... | 17 |
| బ్రాహ్మణులు | ... | ,, |
| క్షత్త్రియులు | ... | ,, |
| వైశ్యులు | ... | ,, |
| శూద్రులు | ... | 18 |
| శ్రీరాఘవచక్రవర్తి | ... | ,, |

| విషయము | | పుట |
|---|---|---|
| రాఘువునికడ కగస్త్యమహర్షి రాక | ... | 20 |
| అగస్త్యమహర్షి రాఘువునిఁ బ్రశంసించుట | ... | 21 |
| రాఘువుఁ డగస్త్యునిఁ దమతాతయగు దిలీపునిచరిత్రమును వినిపింపఁ గోరుట | ... | 22 |
| దిలీపమహారాజచరిత్రము: అంశుమంతునివృత్తాంతము | ... | 23 |
| అంశుమంతుని సంతానకాంక్ష | ... | 24 |
| అంశుమంతుఁడు భార్యాసహితుఁడయి తపము చేయఁబోవుట | | 26 |
| మేరుపర్వతవర్ణనము | ... | ,, |
| అంశుమంతుని తపశ్చర్య | ... | 28 |
| అంశుమంతుని తపము మాన్పుటకయి దేవతలు శివుని ప్రార్థించుట | | 29 |


## ద్వితీయాశ్వాసము


| | | |
|---|---|---|
| శివుఁడు పార్వతి కంశుమంతుని దాతృత్వమహిమ నెఱిఁగించుట | | 32 |
| శివపార్వతులు కపట విప్రదంపతుల వేషమున నంశుమంతునిఁ బరీక్షింపఁ జనుట | ... | 34 |
| అంశుమంతుని యతిథిపూజాతత్పరత | ... | 35 |
| అంశుమంతునొద్దకు కపటవిప్రదంపతులగు శివపార్వతులరాక | | 37 |
| కపటవిప్రదంపతులు తమవృత్తాంతము నంశుమంతున కెఱుకపఱచుట | | 38 |
| శివసాక్షాత్కారము | ... | 47 |
| అంశుమత్కృతశివస్తుతి | ... | 48 |
| శివుఁ డంశుమంతుని వదాన్యతకు మెచ్చి వరములొసఁగుట | ... | 50 |
| శివునివలన వరములు వడసి యంశుమంతుఁడు భార్యాసహితుఁడయి అయోధ్యకేతెంచుట | ... | 51 |
| భానుమతీగర్భవర్ణనము | ... | ,, |
| దిలీపునిజననము | ... | 53 |

| విషయము | | పుట |
|---|---|---|
| దిలీపునిబాల్యము | ... | 57 |
| దిలీపునియౌవనము | ... | 59 |
| అంశుమంతుఁడు దిలీపుని పట్టముఁ గట్టుకొన నొప్పించుట | ... | 60 |
| వసిష్ఠుఁడు దిలీపున కుపదేశించిన రాజనీతి | ... | 62 |
| పురాలంకరణక్రమము | ... | 66 |
| దిలీపునిపట్టాభిషేకము | ... | 67 |


## తృతీయాశ్వాసము


| | | |
|---|---|---|
| ఇంద్రుఁడు దిలీపునికడ కేతెంచుట | ... | 75 |
| ఇంద్రుఁడు రత్నచూడదనుజునిచేనయిన తన భంగపాటును దిలీపుని కెఱుకపఱచుట | ... | 77 |
| రత్నచూడదనుజునిపై దిలీపుని దండయాత్రా సన్నాహము | ... | 81 |
| మాతలి యేతెంచి జయంతునిచేనయిన రత్నచూడుని పరాజయమును నింద్రునకుఁ దెలుపుట | ... | 82 |
| రత్నచూడదనుజుని కథ | ... | 86 |
| గంధగజుఁడనువిద్యాధరుఁ డచ్చరలతోఁగూడి వనవిహారము చేయుట | | 87 |
| జలక్రీడావర్ణనము | ... | 92 |
| మధుపానవర్ణనము | ... | 95 |
| మధుపానమత్తుఁడగు గంధగజుని విశ్వామిత్రుఁడు శపించుట | | 98 |
| దిలీపుఁ డింద్రుని స్వర్గమునకుఁ బంపివేయుట | ... | 103 |
| బోయ యొకఁడు దిలీపుని దర్శింపవచ్చుట | ... | 104 |
| బోయపల్లియవర్ణనము | ... | 106 |
| రత్నమయసింహాముచేఁ దమపడు బాధలను బోయ దిలీపునకువిన్నవించుట | | 109 |
| దిలీపుని మృగయాసన్నాహము | ... | 111 |
| మృగయావిహారము | ... | 113 |

విషయము	పుట

## చతుర్థాశ్వాసము


రత్నమయ సింహాగమనము ... 121
రత్నమయసింహముఁ దఱుముకొని దిలీపుఁడు మంత్రినందనునితో
చాల దవ్వేఁగుట ... 122
దిలీపుని బాణహతిని సింహము హరిణియను నచ్చరయగుట ... 124
హరిణి తనవృత్తాంతమును దిలీపునకు వినిపించుట ... 125
నారదుఁ డింద్రున కెఱిఁగించిన రత్నచూడవధోపాయమును
హరిణి దిలీపునకుఁ జెప్పుట ... 129
సుదర్శనుఁడు శృంగారమాలికవలన వినిన సుదక్షిణావృత్తాంతమును
దిలీపున కెఱిఁగించుట ... 133
సురథునివృత్తాంతము ... 136
రత్నచూడుఁడు సురథునిరాజ్యమును ధ్వంసముచేయుట ... 137
సురథుఁడు శాండిల్యోపదేశమున నగ్నిదేవునిఁగూర్చి యాగముచేయుట 139
అగ్నిదేవుఁడు ప్రత్యక్షమయి సురథునకు సుదక్షిణయను పుత్త్రికనొసగుట 140
సుదక్షిణాసౌందర్యవర్ణనము ... 141
నారదుఁడు రత్నచూడునొద్దకుఁబోయి సురథుని వరవృత్తాంతమును
జెప్పుట ... 143
రత్నచూడుఁడు చంపకావతిపయి దండెత్తి పోవుట ... 145
శాండిల్యుఁ డుపదేశించిన దివ్యమంత్రజపప్రభావమున సురథుకడకు
విష్ణుదేవుఁడు వైనతేయునిఁ బంపుట ... 147
వైనతేయుఁడు సురథు నాతని నగరముతోఁగూడ నాకర్షించి
విష్ణుదేవుఁడుండు శైలమునకుఁ గొనిపోవుట ... 149
రత్నచూడుని గూఢచారుఁడు శృంగారమాలికను వెనుదవులుట 150
సూర్యాస్తమయవర్ణనము ... 151

| విషయము | | పుట |
|---|---|---|
| చంద్రోదయవర్ణనము | ... | 154 |
| దిలీపుని విరహము-చంద్రోపాలంభము | ... | 155 |

## పంచమాశ్వాసము

| | | |
|---|---|---|
| రత్నచూడునిమంత్రి విరహపరవశతనున్న దిలీపుని అతని మంత్రిని తన పుష్పకంబుపైనిడి కొనిపోవుట | ... | 161 |
| దిలీపుఁడు రత్నచూడునిమంత్రిని దునుమాడి యతనిపుష్పకమును గ్రహించుట | ... | 163 |
| సూర్యోదయవర్ణనము | ... | 166 |
| వనదేవత యేతెంచి సుదక్షిణ విరహబాధను దిలీపున కెఱుకపఱచుట | | 168 |
| వకుళవృక్షము మఱువుననుండి దిలీపుఁడు సుదక్షిణను గాంచుట | | 170 |
| దిలీపుఁ డమాత్యసహితుఁడయి సఖీసమేత యగు సుదక్షిణను డాయంజనుట | ... | 172 |
| శార్దూలదర్శనభీతలయి సుదక్షిణాదులు పాఱిపోవుట | ... | 173 |
| దిలీపుఁడు శేషశైలమును జేరుట | ... | 175 |
| దిలీపుఁడు శేషాచలపతిని సందర్శించి స్తోత్రము చేయుట | ... | 176 |
| దిలీపుఁడు శేషాచలపతి యనుగ్రహమునుబడసి పుష్పకముపైఁ దనసైన్యమును జేరఁబోవుట | ... | 178 |
| దిలీపుఁడు రత్నచూడదనుజునిపై దండెత్తి చని యతనిరాజధానిని ముట్టడించుట | ... | 179 |
| రత్నచూడ దనుజుఁడు ససైన్యుఁడయి యుద్ధమునకుఁ దరలుట | | 180 |
| దిలీప రత్నచూడ దనుజసైన్యముల సంకులసమరము | ... | 182 |
| భానుదేవవిక్రమధన్వులయుద్ధము | ... | 184 |
| రత్నచూడుని మాయాకల్పనము | ... | 186 |
| దిలీపుఁడు దనుజమాయను మాయించుట | ... | 187 |

| విషయము | | పుట |
|---|---|---|
| రత్నచూడుఁడు గరుడారూఢుఁడయి దిలీపుని మార్కొనుట | ... | 188 |
| దిలీపరత్నచూడదనుజుల ద్వంద్వయుద్ధము | ... | 189 |
| దిలీపుఁడు రత్నచూడ దనుజుని పాశుపతాస్త్రంబుచే బడబానలంబునఁ బడవేయించుట | ... | 190 |
| దిలీపుఁడు సకలపరివారముతో చంపకావతిఁ జేరుట | ... | 193 |
| పౌరాంగనలు దిలీపుని సందర్శించుట | ... | 193 |
| సుదక్షిణాదిలీపుల వివాహాలంకారవర్ణనము | ... | 195 |
| సుదక్షిణాదిలీపులవివాహము | ... | 198 |
| వివాహానంతరము సుదక్షిణాదిలీపు లయోధ్యానగరమున కేగుట | | 202 |
| సుదక్షిణాదిలీపుల ప్రథమసమాగమము | ... | 203 |

శ్రీ

# సుదక్షిణాపరిణయము

## పీఠిక

ఇష్టదేవతాస్తుతి

శ్రీలీలాహారినీలపీఠరుచిర
శ్రీవత్ససంపన్నవ
క్షోలాలిత్యుఁడు వేంకటేశుఁడు కృష్ణ
గోనేటిరామకుమా
పాలస్వామిసమస్తరాజ్యభరణో
పాయాధికుఁ హృద్యవి
ద్యాలోలుం బులిజాలరామవిభుసో
మామాత్యునిం బ్రోవుతన్. 1

సీ. ఆర్యసన్నుతమహాధైర్యనిర్జితపంచ
బాణుచే రక్షితబాణుచేత
భూభరణానల్పభుజగాధినాయకా
కల్పుచే సిద్ధసంకల్పుచేత
నరుణజటాన్యస్తహారిణాంకరేఖాక
లాపుచే నిగమసల్లాపుచేత
నార్ద్రశార్దూలచర్మాంబరాకలితక
టీరుచే భూతిపటీరుచేత

తే. భవునిచేఁ బూజితాంభోజభవునిచేత
హరిచే శ్రీగిరీంద్రవిహారిచేత
భద్రములు గాంచు బలబలభద్రమూర్తి
రామయామాత్యపులిజాలసోమవిభుఁడు. 2

ఉ. కోరినమోముఁదమ్మివిరిగూటము లే యన నేల? సమ్మదం
బీరికలెత్తఁ గూటముల నిచ్చి సుధాసమవాణి వాణిఁ బ్రే
మారభటిం గవంచుచతురాస్యుఁడు జాణలజాణ శౌర్యర
క్షోరిపుమూర్తి రామవిభుసోమనమంత్రిఁ జిరాయుఁ జేయుతన్.

సీ. ముంజేతిపంజరంబున నున్న వెలిచిల్కఁ
దొలుఁబల్కు చదివించుతలిరుఁబోఁడి
తెలిదమ్మిపూవుగద్దియచక్కి నునవిష
త్తులు గోల్వఁ గొలువుండుతోయజాక్షి
యోగీంద్రమానసాభోగవీథికల రా
యంచ తేజీ దువాళించుతరుణి
యుదుటుగుబ్బలమీఁదఁ గదియించి సరకట్లు
కిన్నరఁ బలికించుకిసలయోష్ఠి
తే. వాణి మదకీరకోకిలవాణి చరణ
పంకజానతగీర్వాణి పద్మపాణి
మహిమఁ బులిజాల రామయామాత్యసోమ
మంత్రి వాచాధురీణుఁగా మనుచుఁగాత. 4

తే హరుని నెమ్మేన నరపాలు యతులహృదయ
కమలవీథుల నరపాలుఁ గాంచి వెలయు
నన్నపూర్ణాసమాఖ్యాత యద్రిజాత
ప్రబలి వసియించు సోమయప్రభునియింట. 5

ఉ. తామరపూవుగద్దియ సదా కొలువుండి కరాబ్జవీథి లేఁ
దామరదోయిఁ బూని సిరి తామరతంపర చేసి భక్తులం
దామరలంగ రానియఁ దాలిచి ప్రోచును గాత రామ మా
రామయసోమమంత్రిగృహరాజమునన్ వసియించుచు గావుతన్.

ఉ. బొజ్జగలయ్య యుండ్రములభోగి మెఱుంగుఁబసిండిచాయబ
ల్గుజ్జు సమస్తయత్నములకుం దొలిపూజలు గాంచు మేటియా
ముజ్జగమేలు ప్రాంతవారముద్దులపట్టి గణాధినాథుఁ డు
ద్యజ్జయమిచ్చు రామసచివాగ్రణిసోమనమంత్రిమౌళికిన్. 7

క. కందాళభావనార్యుల
నందను శ్రీరంగగురుని నతబుధరక్షా
మందారంబు నుతింతును
మందారమరందబిందుమధురారభటిన్. 8

తే. కాళిదాసాదిసంస్కృతకవులఁ దలఁచి
యాంధ్రభాషావిశేషభాషాధిపతుల
నన్నపార్యాదులను బుద్ధి సన్నుతించి
పాలగుమి భీమగురుని సద్భక్తిఁ గొలుతు. 9

కుకవినింద

ఉ. స్వల్పకవిత్వతత్త్వవిభవాంధులు కొందఱు ధీరమండలా
కల్పసువర్ణరూపకవికావ్యరుచిస్థితిఁ గాంచియున్ వృథా
తెల్పుదు రాత్మవాక్ప్రతిభతీవ్రకరాంశుచయంబునుందటం
బొల్పుగ వేఁడిమిం జెనకఁ బూనుస్ఫులింగపరంపరాకృతిన్.

క. తప్పెఱుఁగఁ; డొప్పుఁ దెలియఁడు;
చొప్పెమియుఁ గానలేఁడు; సుకవులజాడల్

తప్పం దాల్పుచుం దాసుం
జెప్పుదు ననుఁ గవిత కుకవి; సి గ్గిలుఁగఁ డో కో! 11

వ. అని యిష్టదేవతాస్మరణంబును బురాతనాద్యతనసుకవిపూజా
చరణంబును విద్వజ్జనహర్షణంబునుం గుకవిధర్షణంబునుం
గావించి నవరసావిర్భావనిబంధబంధురంబుగా నొక్క ప్రబం
ధంబు రచియింప నుద్యోగించుసమయంబున మణికుట్టిమ
ప్రాసాద సౌధమహాహట్టబాదాలిపట్టణ శ్రీకిరీటం బగు
కొలువుకూటంబున. 12

మ. కవులుం గాణలు జాణ లార్యులు హితుల్ కాంతాసమూ
హంబు లుత్పవలీలం దనుఁ గొల్వ నిండుగొలువై సత్కా
వ్యగోష్ఠీవిశేషవినోదైకపరాయణత్వమును రాజ్యశ్రీవిహా
రంబుఁ బ్రాజ్యవివేకంబుఁ దనర్ప రామవిభునోమూమాత్యుఁ
డత్యున్నతిన్. 13

తే. నవ్యసుగుణాభిరామ తెనాలిరామ
పండితాగ్రణిసత్పుత్రు భవ్యమిత్రు
హరపదాంభోజసౌముఖ్యు నన్నపాఖ్యు
నన్నుఁ బిలిపించి యాదరోన్నతి వహించి. 14

చ. "పలుకులకల్కి కప్పురపుఁబల్కులు చల్లినరీతిఁ బండువె
న్నెలతళుకుల్ విధుండు హావణించినమించున శంబరారి చెం
గలువలతూపుఁగోపులముఖాముఖిఁ జూపినయేపునంగృతుల్
పలుకఁగ నేర్తు పూర్వకవిపద్ధతి రామయ యన్నసత్కవీ. 15

తే. సరససాహిత్యసౌహిత్యపరత నీవు
పరిఢవించుసుదక్షిణాపరిణయంబుఁ

గీర్తి విలసిల్ల మాకు నంకితము సేయు
తేట యగువాగ్విలాసంబు కోటిసేయ." 16

వ. అని బహూకరించి తాంబూలంబు జాంబూనదపాత్రచే నొసంగి మణిమయభూషాచీనిచీనాంబరంబు లర్పించిన నేను నమ్మంత్రిచంద్రుండు మదీయకవితాకుముద్వతీవల్లభుం డగుటకు సంతసిల్లి యేతదాచరణంబున కలంకరణంబుగాఁ గోనేటి రామకుమానాథువంశావతరణం బభివర్ణించెద నె ట్లనిన: 17

## కృతిపతిప్రభువంశవర్ణనము

తే. చంద్రవంశాబ్ధిపూర్ణిమాచంద్రుఁ డార
వీటిబుక్కయరామభూవిభునిసుతుఁడు
తిమ్మరాజేంద్రుఁ డన్వయదీపకుండు
గనియెఁ జినకొండభూపాలు ననఘుశీలు. 18

చ. కులనిధి యానృపాలకుఁడు కోనమదేవి వరించి కాంచెఁ జే
కొలఁది నరాతులం దునుముకోనేటితిమ్మనరేంద్రు, భూమిభృ
త్తిలకముఁ జిన్నతిమ్మవిభు, ధీరసుధానిధి యప్పరాజు, ని
ర్దళితవిరోధిభూవరకురంగుని రంగనృపావతంసమున్. 19

వ. అందగ్రజుండు: 20

సీ. తృప్తి గావించె ద్వైతేయవిధ్వంసికి
మేటిరామానుజకూటకోటి;
నర్పించెఁ గీర్తికాంతాగ్రహారములుగా
నగ్రహారములు ధరామరులకు;

నిశ్రేణిగా నిల్పె నిజభుజాఖడ్గంబు
        నమరేంద్రపురి కేఁగునరివరులకు;
బుధులఁ బెన్నిధులఁ దన్పుచు ధాత్రిఁ బాలించె
        ధర్మంబు నాల్గుపాదములఁ జనఁగ;
తే. భరతమాంధాతృనహుషనాభాగరఘుయ
యాతిరఘురామవిఖ్యాతి నతిశయిల్లె;
రాజమాత్రుండె యాదార్యరాజరాజు
దీప్తిదినరాజు కోనేటి తిమ్మరాజు! 21

తే. విజయఫల్గునుఁ డారాజు వెంగళాంబ
యందుఁ గాంచెను రిపువార్ధిమందరంబుఁ
గుండలీశ్వరమతిహారిఁ గొండశౌరి,
జన్యరఘురాము రామరాజన్యవరుని. 22

వ. అందగ్రజుండు: 23

మ. కరవాలాహతశత్రుసైన్యవిచలద్గంధాంధదుర్వారసిం
ధురకుంభస్థలితోరుమౌక్తికమణిస్తోమంబుచేతన్ సమి
ద్ధరణిన్ నిత్యయశోంకురంబుల ధరాధౌరేయబాహార్గళుం
(?)డరరే, కోనేటి తిమ్మభూవిభునికొండాధీశుఁ డత్యున్నతిన్.

వ. తదనుజుండు: 25

సీ. సంగ్రామజయయోగ్యసౌభాగ్యమహిమల
        రాముతో నలసుధాధాముతోడ,
సంపద్విలాసవాచావిశేషంబుల
        నింద్రుతో దర్వీకరేంద్రుతోడ,

శాశ్వతైశ్వర్యప్రజారంజనంబుల
భవునితో నంభోజభవునితోడ,
విశ్రుతసౌందర్యవిక్రమక్రమరేఖ
భద్రుతో నలబలభద్రుతోడ

తే. సాటి సేయంగఁ దగు నిరాఘాటకోటి
ధాటికాపాటితారి కోనేటి తిమ్మ
రాజకలశాబ్ధిపూర్ణిమారాజమూర్తి
రామభూపాలుఁ డఖిలాభిరామకీర్తి 26

తే. ఆనృపాలకుకృప ధవళాతపత్ర
చామరాందోళికాభటసామజాశ్వ
మహిమ విలసిల్లె సోమయామాత్యవర్యుఁ
డభినుతించెద నిపుడు తదన్వయంబు: 27

కృతిపతివంశవర్ణనము

ఆ. సకలజీవరాశిసంభవస్థానమై
వెలయుకడుపు కందవిత్తనంగ
నమరు నేమహాత్ముఁ డాకశ్యపప్రజా
నాథు నపరభువననాథుఁ దలఁతు. 28

ఉ. నిత్యయశోవిభూతి పావణించినతన్మునిగోత్రరత్నమై
సత్యవచోవిశేషగుణసంగతుఁ డొప్పులిజాల మల్లయా
మాత్యుఁడు రాజపూజ్యమహిమన్ విలసిల్లుచుసంభవించె నా
న్నత్యము గంగమాహృదయనారజనీరజబాంధవాకృతిన్.

సీ. నవయౌవనోద్దామవివిధకళాధామ
భామినీరతిరాజు రామరాజు,

శౌర్యనానాగుణస్థైర్యమహౌదార్య
నిత్యుండు వెన్నపామాత్యవర్యుఁ,
డంగీకృతాభంగసంగీతసాహిత్య
శృంగారమతిహారి సింగశౌరి,
యఖిలదేశాయాతయాచకావనసము
ద్యోతకీర్తివిభుండు పోచఘనుఁడు,
తే. సాంద్రరుచిహేళి యప్పాఖ్యసచివమౌళి,
దిగ్గజబలుండు నరహరిప్రెగ్గడయును
జననమందిరి యాపుణ్యజంపతులకు
సరవి నుదయించుసద్గుణైశ్వర్యలీల. 30

శా. ఆమంత్రీంద్రులయందుఁ బోచనసుధీహర్యక్షు మత్కుద్రవా
చామాధుర్యుఁడు గాంచెయాచమశరచ్చంద్రాననం బెండ్లియై
ప్రేమ న్నాగనమంత్రి మల్లనను వారిన్; వారిలో బంధురా
జీమందారము నాగశౌరి వరియించెన్ నాగమాంప్రేయసిన్.

క. కలిగిరి మువ్వురుతనయులు
విలసితవిఖ్యాతనీతివిద్యావినయుల్
కులనిధు లాజంపతులకు
నలమతి దుగ్గనయు, సింగనయుఁ, బోచనయున్. 32

తోదకము. నాగయ పోచజనప్రభుఁ డోలిన్
నాగమ యన్ లలనామణియందున్
రాగముతోఁ బిన రామనఁ గాంచెన్
రాగవతీరతిరాజసమానున్. 33

వ. తదగ్రజుండు: 34

తే. నాగవిభుసింగఁ డమలక్కనళినవదన
వేడ్క దైవాఱఁ దనకు దేవేరి గాఁగఁ
గనియె నిద్దఱుతనయుల వినయనిధులఁ
బోచమంత్రియు, మల్లప్రభుండు ననఁగ. 35

వ. తత్పూర్వసంభవుండు: 36

సుగంధి. నాగరాజు దుర్గమంత్రినాగహాయుఁ డబ్బమా
నాగయానఁ బెండ్లియై జనప్రసిద్ధవిక్రమో
ద్యోగి రామసైన్యనాథు, నున్నతప్రభావనా
భాగు వీరశౌరిఁ గాంచె భానుచంద్రతేజులన్. 37

ఉ. ఆపులిజాలదుర్గసచివాగ్రణివీరయమంత్రిచంద్రువా
చాపరిపాటికిం దెపలి చయ్యన భోగివిభుండు శయ్యయై
శ్రీపతి నాశ్రయించె; నయశీలవిధేయు లజేయుతోడ రా
రాపునఁ జక్రమే లెపువారక భజియించుట యుక్తమే కదా!

తే. అతఁడు కొండాంబయందుఁ దిమ్మయ్యఁ, గొండ
యాఖ్యుఁ, బినతిమ్మమంత్రీంద్రు, నప్పఘనుని,
వెంకటామాత్యుఁ, జిటియప్పవిభునిఁ, జిన్న
కొండపను గాంచె విక్రమోద్దండభుజుల. 39

శా. నిగ్గుల్ దేరెడుకీర్తిచంద్రికలు మున్నే నిండ దిగ్వీథిఁ బూ
మొగ్గల్ వోలె వికాస మొంద సుకృతంబుల్ తేట వాటింప స
మ్యగ్గంభీరత నీమహాన్వయమునం దైశ్వర్యధుర్యస్థితిన్
దుగ్గామాత్యునిరామరా జలరెఁ జేతోవిస్ఫురద్రాముఁడై.

క. అమ్మంత్రిచంద్రుఁ డీతలఁ
దిమ్మామాత్యునితనూజఁ దిమ్మాంబ మన

స్సమ్మదమున వరియించెను
గమ్మనివిలుకానితండ్రి కలిమిచెలి బలెన్. 41

చ. వినయము ప్రోఁక, యార్జితవివేకము నిల్కడ, వంశరక్షణం
బునకు నిదర్శనంబు, తగుబుద్ధులయూఁట, కీర్తిచంద్రికా
ఖని, బుధబాంధవాభిమతకల్పకవల్లిక, దుగ్గరాజురా
మనకులభామ తిమ్మమమహామహిమం గొనియాడ శక్యమే !

చ. భవవదనంబు లయ్యమరపాదపముల్ హరియాయుధమ్ములున్
భువి నరమూర్తులై పొలుచుపొల్పున వారికిఁ గల్గి రాప్తబాం
ధవనిధి సోమమంత్రియు, జనస్తుతుఁ డెల్లయశౌరి, సత్ప్రభా
కువలయమిత్రుఁ డబ్బనయుఁ, గోటిచమూపతి, దుగ్గనార్యుఁ
డున్. 43

స్రగ్ధర. శ్రీకాంతాకాంతపాదాశ్రితమతివిభవుల్ శేముషీ శేష
మూర్తుల్ - రాకాచంద్రోపమానప్రథితశుభయశుల్ రామ
మంత్రీంద్రుపుత్రుల్ - నాకద్రుప్రౌఢదానోన్నతుని బహు
కళానందితశ్రీవిలాసా - స్తోకప్రఖ్యాతుఁ గీర్తింతురు బుధ
జనముల్ దుగ్గయామాత్యవర్యున్. 44

క. ఆసరసమూర్తి శ్రీసతి
కేసమ యన వాసిఁ గాంచు కేసమయందున్
వాసన గలకీర్తుల బల
శాసనతనుజాతుఁ బోలుసర్వపఁ గాంచెన్. 45

వ. తదగ్రసంభవుండు: 46

మ. స్మరజిద్విక్రమధాముఁ డాయళియరామక్ష్మావరోత్తంసుచే
గురుసామ్రాజ్యధురంధరత్వఘనుఁ డాకోనేటిరామాధిప
స్థిరసైన్యాధిపుఁ డబ్బమంత్రి వరియించెన్ యజ్ఞమాంబన్

మనో - హరభాగోన్నతిఁ గంకిపాటిపుర వేదామాత్యపుత్రీ
మణిన్. 47

మ. స్తుతలీలం బులిజాలయబ్బయసుపుత్త్రుల్ ధాత్రి వర్ధిల్లి రు
ద్యతతేజుం డగుతిమ్మనార్యుఁడును, గొండాఖ్యుండు, జగ్గన్న
యుఁ - శ్రితచింతామణి చిన్నతిమ్మవిభుఁడుఁ, శేషాద్రి
యుఁ, లాలితా - కృతి కోనేటి ఘనుండు, మానసపుటీఖేల
ద్దయావైఖరిన్. 48

చ. సరసుఁడు నీతికోవిదుఁడు చక్కనివాఁడు గుణాధికుండు నే
ర్పరి యుచితజ్ఞుఁ డర్థిజనరక్షణదక్షుఁణపుణ్యమూర్తి శ్రీ
హరిపదభక్తుఁ డబ్బసచివాగ్రణితిమ్మనమంత్రిచంద్రుఁ డి
ద్ధర శుభ మొందుఁ గీర్తిలతతారకకోరకలీలఁ జాలఁగన్. 49

మ. పులిజా లెల్లయమంత్రి బాంధవజనంబుల్ మేరగాఁ గాంచె
వెం-గళమాకొండమల్ గిరమ్మ నతిరాగప్రౌఢి నుద్వా
హమై- తెలుఁగామాత్యునిఁ, బెద్దధీమణి, గుణాబ్ధిఁ రామ
మంత్రీంద్రు, సు-జ్జ్వలతేజోనిధి సోమరాజు నిజసంసారద్రు
కందంబులన్. 50

వ. వారిలోన: 51

మ. హరిశౌర్యం బులిజాలయెల్లయ తెలుంగాధీశుఁ బోల్తుం
బ్రభా- దరధీదానకళావిలాసజయవాగ్ధారానిరూఢిఁ దివా
కరుతోఁ గశ్యపమానితోఁ గచునితోఁ గానీనుతోఁ గొము
దీ-కరుతోఁ గాయజుతోఁ గపిధ్వజునితోఁ గద్రూతనూజా
తులోన్. 52

వ. తదనుజుండు: 53

చ. పలుకు శిలాక్షరంబు; సిరి ప్రాపులు చూపులు; కీర్తికాంతపై
వలపు నిజంబు; వాసియును వన్నెయునుం గలవాఁడు; తాల్మి
కిన్- నెలవు; పరోపకారగుణనిర్వహణంబున సాటి యెవ్వరీ
వలఁ బులిజాలయెల్లసచివప్రభుపెద్దనమంత్రిమౌళికిన్! 54

తే. సోమనిభకీర్తి పులిజాలసోమవిభుఁడు
చారుకీర్తి దరూరిమాచప్రధాను
తనయ వైకుంఠమ వరించి కనియె వాక్య
విభవజితచక్రధరశయ్య వేంకటయ్య. 55

షష్ఠ్యంతములు

క. ఏతాదృశశుభవంశ
ఖ్యాతునకున్ సదయహృదయకంజాతునకున్
జాతుర్యానంతునకున్
మాతాపితృభక్తియుక్తమతిమంతునకున్; 56

క. నీహారకిరణకుముదవ
నీహారసుధాఝరీవినిర్మలకీర్తి
వ్యూహునకు వితరణాంభో
వాహునకు రమాశకుంతవరవాహునకున్; 57

క. కుండలిపరివృఢకిటివే
దండకుభృత్కమఠభరితధరణీధరణో
ద్దండజయకలితబాహా
దండునకుఁ బ్రభావచక్రధరకాండునకున్; 53

క. పజ్జువ్విచెన్నకేశ్వర
హృజ్జలజాతునకు రూపహృజ్జాతునకున్

సజ్జనసంస్తుతవిమతో
ద్వ్యజ్జయశౌర్యునకు ధరణిధరధైర్యునకున్; 59

క. కోనేటిరామరాజద
యానూనప్రాప్తశౌర్యతైశ్వర్యునకున్
దానాంధసింధురాధిక
సేనాస్థైర్యునకు శేముషీధుర్యునకున్; 60

క. శ్రీమహిళాగేహునకున్
సామర్థ్యమనోజ్ఞసుగుణసన్నాహునకున్
ధీమహితరామయప్రభు
సోమామాత్యునకు ధర్మసుతసత్యునకున్; 61

వ. అభ్యుదయపరంపరాభివృద్ధిగా నాయొనర్పం బూనినయిమ్మహా
ప్రబంధంబునకుం గథాక్రమం బెట్టి దనిన: 62

## కథాప్రారంభము

### అయోధ్యాపురవర్ణనము

చ. కల దొకపట్టణంబు మిహికాకరమౌళినివాసహాసిపే
శలవిధుకాంతసౌధరుచిజాలధగద్ధగితాఖిలాశ మై
జలరుహమిత్రవంశనృపచంద్రయశోలతికాలవాలముం
బలెఁ బృథువజ్రసాలము నభం బొరయంగ నయోధ్యనా
మహిన్. 63

చ. కనకనికేతనాగ్రబలఘుస్మరరత్నమరీచివీచికల్
వనదపదంబునం బొలుచు వారిజబాంధవమండలంబు దా
ర్కొనుతుదభూములన్ మెలఁగుకొమ్మలక్రొవ్వెద లాశ్ర,

యించి పెల్చునఁ దఱియైనఁ బైఁ దొడరుసంతమసచ్ఛటలో
యనం బురిన్. 64

ఉ. బంగరురంగు దిక్పటలిఁ బర్వఁగఁ బర్వపురంబుకోట నిం
గిం గబళించి పోవ గమకించియు, నయ్యతలంబు నంతయుం
జంగున దాఁటఁ జూచియును, సంశయముం వహియించి
నిల్చుటల్- చెంగట నున్న రాహువును శేషునిఁ గాంచుటనో
తలంపఁగన్! 65

ఉ. కొమ్మలఁ బ్రొద్దు వ్రాల మిణుఁగుర్లు దివంబులఁ దత్పురీసమీ
పమ్మునఁ బర్వఁ గోట యనుపక్షివిభుండు వియత్ఫణీంద్రు వే
గమ్మున మ్రింగి తద్వికటగాఢఫణాభమణిప్రతానముం
గ్రమ్మఱ నొక్కటొక్కటియ క్రాసి వెలిన్నిగిడించెనోయనన్.

చ. భువనవిహారిణిం దనదుపుత్త్రిక నొందెడ కేఁగనీక భూ
ధవు లినవంశు లప్పురి సతంబుగ నిల్పుట కాగ్రహించి య
ర్ణవకులసార్వభౌముఁడు తరంగతురంగపరంపరోద్ధతిం
దివురుచు వచ్చి చుట్టమయి నిల్చినజాడ నగడ్త చెన్నగున్. 67

తే. వెల్లమానిసి, మాననివిసముపొంగు,
దాఁటువడినాఁడు, సంతతతాపమయుఁడుఁ,
దనకుఁ గట్టువడుండుట తగవు గాక
వనధి యీడౌనె యప్పురవప్రమునకు! 68

తే. పురము మేడలనుండి యంభోజముఖులు
కమ్మకస్తురి వేలుపుఁగొమ్మమూఁక
కర్పణము చేసి వారిచే నందికొండ్రు
ననుపుఁదావులహరిచందనద్రవంబు. 69

ఉ. ఉన్నతసౌధవీథికలనుండి పురాంగన లంతికాగతున్
బున్నమచందమామఁ బరిపోషితబాలచకోరచంచుసం
ఛిన్నమయూఖుః జేయఁ గని చేరి తదీయమృగంబు మేయు
వా, ల్గన్నులచెన్నుఁ గైకొనుటఁ గల్గినభీతి వతంసదూర్వలన్.

శా. రాకారాత్రులఁ జంద్రకాంతరచితప్రాసాదకూటంబు లు
ల్లోకప్రక్రియలం గరంగఁగఁ బ్రణాళుల్ నిండి యశ్రాం
తథా,రాకారంబున జాఱునీరు రతినాథాటోపసస్యావన
శ్రీకిం జంద్రుఁ డొనర్చుకాల్వలన వర్తించున్ బురీవీథులన్.

మ. కనకాద్రిప్రతిమోన్నతాకృతులు గాఁ గల్యాణసౌధంబు ల
వ్వనజాతాసనుఁ డిప్పురి న్నిలిపి యూర్ధ్వక్షోణిపై వ్రాలుత
ద్ఘనమార్గం బొకయింత యెత్తి వివిధస్తంభంబుల న్నిల్పె నాఁ
గనుపట్టున్ మణిపుంజమంజులపతాకాదండసంఘాతముల్.72

ఉ. కాంచనసౌధవీథిఁ బురకాంతలు నిల్చి వియత్తరంగిణీ
కాంచనపంకజమ్ముల నఖప్రతతిం జిదుమంగఁ బోయి తత్
ప్రాంచితచంచరీకవలయంబులు జుమ్మన నాట మాని యో
డించుకొనంగఁ బూనినవడిన్ మరలింతురు మోముఁదామరల్.

చ. అలరులతేనెకాలువలయంచులఁ బండినశాలిపఙ్క్తిక్రే
వల నలపట్టుజీనువలు వ్రాలిన హాలికబాలికాజనం
బులు ధవళేక్షుపర్వములఁ బుట్టినముత్తెము లుంచి పూవుఁదీ
వలయొడిసెళ్ళ రువ్వనఁగ వైతురు తత్పురబాహ్యవీథులన్.

## ఋతువులు

చ. అలరుల నవ్వువెన్నెల మదాళిఘనచ్ఛట తేనెమంచు మె
చ్చుల వలిగాలిసోఁకుడుల జొంపపుఁ బుప్పొడియొద్దఁ గీరరా

ట్కులముఖకాంతికింశుకపటుత్వముఁ గల్గుటఁ జేసి పొల్పు
వింతలుగ ఋతుప్రతానకము తత్పురకేళివనాంతవీథులన్.75

పుష్పలావికలు

ఉ. తావులపాటలంబులును దవ్వగుకల్వలు బొండుమల్లెలుం
గావలె నన్న హాసరుచికౌముది గన్గొనల న్నటింపఁ గె
మ్మోవులు పాటలల్ తిలకముల్ గలవున్నవి లేవటంచుజా
రావళి గేలి సేయుదు రుదంచితమార్గలు పుష్పలావికల్.

మందమారుతము

తే. కొదమతీవెల నాడించుకోడెకాఁడు
వలపుఁబుప్పొడి మైఁ బూసువన్నెకాఁడు
(సురతఘర్మాంబుముక్తాళి చూఱకాఁడు)
మెలఁగు నప్వీటఁ జల్లతెమ్మెరలతేఁడు. 77

చతురంగబలము

సీ. కుంభసంభవకళాగంభీరమూర్తులై
పర్వతోన్నతి డించు భద్రకరులు
నుద్దామభీమజవోద్వృత్తి విజయాను
కూల్యంబు సవరించుఘోటకములుఁ
జక్రవర్తిత్వనిర్వక్రవేగస్ఫూర్తి
దారుణక్రమరేఖఁ దగురథములుఁ
బ్రతిపక్షబలగర్వభంజకప్రౌఢి మైఁ
బదవిశేషముఁ గాంచి పొదలుభటులు

తే. దానధారావిహారదోర్దర్పగతుల
నతులితోదగ్రసామగ్రి యతిశయిల్ల
దంతలాలాటపత్త్రముక్తావిభూష
ణాత్తతరకీర్తులై వీట నలరుచుందు. 78

స్త్రీలు

చ. పలుకఁగ నేర్చుచిత్రములు, పాడఁగ నేర్చినపుష్పవల్లికల్,
మెలఁగఁగ నేర్చురత్నములు, మెల్లఁగనడ్వఁగ నేర్చుచంచలల్,
నిలుకడ నేర్చువెన్నెలలు, నెయ్యముఁ దియ్యము నేర్చుపైఁడి
కెం-దళుకు లనం జెలంగుదురు తామరసేక్షణలప్పురంబునన్.

బ్రాహ్మణులు

క. గురునకు గురువులు విద్యా
పరిణతి, నలబ్రహ్మకైన బ్రహ్మముఁ దెలుపన్
బరిఠవణ గలిగి వేదపుఁ
గరువు లనన్ విప్రవరులు గల రవ్వీటన్. 80

క్షత్త్రియులు

తే. బాహుదండంబు ధారుణీపద్మముఖికి
విజయలక్ష్మికి శాతాసి విడిదిఁ జేసి
యాజి సంప్రాప్తకీర్తి దిగంతములకుఁ
బనిచిరఁట యెన్నఁ నగునె తత్పార్థివులను! 81

వైశ్యులు

మ. వలె నన్నన్ వెల యిచ్చి కొండ్రు మురజిద్వక్షస్స్థలీరత్న
ముం-బులిజున్నేనియు నప్పఁ జూపుదురు, తప్పుల్ పట్టి బేహా

ర మే- వలన న్నేరఁ డటంచుఁ బల్కుదురు సర్వజ్ఞాప్తునిం, దత్పురిం- గలిమిం జేరెలమిం దలిర్చినవణిగ్వర్యుల్ యశోధుర్యులై. 82

శూద్రులు

క. ధరఁ గొండ్ర వేలు పండఁగఁ
బురుషాయుషమధ్యవిఘ్నముం బొరయక తా
మరతంపరలైనసిరులఁ
బరి నాలవజాతి ఖ్యాతిఁ బొలుపు వహించున్. 83

వ. అప్పురంబున కధీశ్వరుండు: 84

శ్రీరాఘవచక్రవర్తి

సీ. తనిపినాఁడే రాజు తమతండ్రి యలవోక
యాడినమాట సత్యంబుసేట;
చొనిపినాఁడే రాజు సుకుమారకౌమార
వీరవైఖరి దేవతారివరుల;
మనిపినాఁడే రాజు మార్తాండసంజాతు
పగఁ దీర్చి నమ్మంగఁ బ్రతిన చేసి;
యనిపినాఁడే రాజు కనదభంగతరంగ
మగుమహాంభోరాశి నంపములకు;
తే. నతఁడు సామాన్యుఁడే వళద్బాహుకటక
కటకగిరిరాజధారణోత్కటభుజాగ్ర
జయసముత్కంఠదశకంఠభయదకంఠ
విదళనోద్భాసి రాఘవోర్వీవిభుండు. 85

క. అసిధారావ్రతమున ని
వ్వసుధయుఁ గీర్తియును గెల్పువలఁతియుఁ దనకై

వసముగ సీత వరించిన
రసికుఁడు శ్రీరాముఁ డేకరాముఁడె చూడన్! 86

వ. ఆపరతత్త్వస్వరూపం బొక్కనాఁడు: 87

సీ. గంభీరవిద్రుమస్తంభసంభారంబు
జలజరాగప్రోతవలభికంబు
వైడూర్యకాంతిసంవలితగవాక్షంబు
మరకతమయతులాపరిచితంబుఁ
గాంతనిశాకాంతకాంతవేదియుతంబు
దీప్తవజ్రోపలదేహాళికముఁ
జారురత్నోదితద్వారశాఖాశోభి
గోమేధికాక్రాంతకుడ్యతలము

తే. ఖచితముక్తావళీచిత్రకనకపత్ర
గర్భితంబును నై రత్నగర్భవలన
మేరుగిరి గాంచుముద్దుకుమారుఁ డనఁగఁ
జూడఁజూడంగఁ దగు నొక్క మేడలోన; 88

క. కొలువుండెఁ గలశజలనిధి
వెలిచిలువమెఱుంగుగద్దె విష్ణుఁడు పోలెన్
ధళధళలు గుల్కు వజ్రపు
బెళుకుల విలసిల్లుసింహపీఠమునందున్. 89

సీ. శృంగసంగత మైనబంగారుగట్టుచం
దమున సౌమిత్రి వేత్రము ధరింపఁ,
జెంత జాబిల్లికిఁ జేయిచ్చెనో యన
భరతుండు ధవళాతపత్ర మూన,

వామనాకృతిఁ జూపువహిం నానతాంగుఁడై
లవణారి కార్యజాలంబుఁ దెలుప,
స్వాభీష్టఫలసిద్ధు లందుకై వడి వాలి
యనుజుండు కానుక లందుకొనఁగ,

తే. నడప మంసంబుపై వ్రేల నంగదుండు
మట్టముగఁ జీల్చి తెలనాకు మడిచి యొసఁగ
ననిలసూనుండు పైఁ జాచునడుగు లొత్తు
నుండువిభుకొల్వు కన్నులపండు వయ్యె. 90

రాఘవునికడ కగస్త్యమహర్షి రాక

తే. అంతఁ బణిహారి యొకరుండు హారలతలు
పృథులవక్షస్స్థలమునఁ బేరెములు గొనఁగ
వేగఁ బఱతెంచి జానకీవిభునిఁ గాంచి
"దేవ, ఘటసూతి వీఁడె యేతెంచె" ననుడు: 91

ఉ. దిగ్గన సింహపీఠి దిగి దేవవిరోధివిరోధి ధారుణీ
భుగ్గజభర్త రాఘవుఁ డపూర్వపువన్నెపసిండిదుప్పటిన్
బిగ్గనఁ జుట్టుకొంచుఁ దగుపెద్దలుఁ దమ్ములు వెంట రాఁగ స
మ్యగ్గతిమై నెదుర్కొనియె నంబుధిభీకరు నమ్మునీశ్వరున్. 92

వ. ఇవ్విధంబున నెదుర్కొని: 93

క. అచ్చ మగుభక్తి నర్ఘ్యం
బిచ్చియు నర్హార్చనంబు లిచ్చియు హృదయం
బిచ్చియు మునిఁ దోడ్కొని భూ
భృచ్చంద్రముఁ డేఁగి యుచితపీఠిక నునిచెన్. 94

తే. తాను మునినాథుననుమతి ధవళకిరణ
మండలస్థితకైటభమథనుఁ డనఁగఁ

దళుకువజ్రాలనిగనిగల్ దొలుకరింప
నొనరుసింగంపుగద్దియ నుండి యపుడు: 95

క. కుంభభవుఁ జూచి "వింధ్య
స్తంభముఁ గావింప నిగుడుతావకకీర్తి
స్తంభము త్రిభువనభవన
స్తంభము గా యిల్వలాగ్రజన్మధ్వంసీ 96

క. లవణాంబురాశి నంత
ర్నివసదళిం బోలఁ గేలి నెత్తామరఁ బే
లవముగ లవముగ నునిచితి
భువనాద్భుతమహిమ నోతపోధనచంద్రా." 97

క. అనవుడు సంతోషసుధా
వననిధిఁ దేలుచుఁ దపస్వివర్యుఁడు రాముం
గనుఁగొని దశనజ్యోత్స్నలు
గొనబగుచిఱునగవుఁ గూడుకొన ని ట్లనియెన్. 98

అగస్త్యమహర్షి రాఘవునిఁ బ్రశంసించుట

ఉ. "ఏ నొకవింత యే రఘుకులేశ్వర; యాదిమవిష్ణుమూర్తి వై
యీనిఖిలావనీతలము నేలెడునిన్ గనుఁగొంటి; నేఁడుగా
నానియమంబు నాజపము నాతపముల్ ఫలియించె భక్తస
న్మానధురంధరత్వమున నా జననాయక, యిట్లు పల్కుటల్! 99

ఆ. పూని పట్టి జలధిపొం గడంగించిన
మాతపంబు కొలఁదియే తలంప;
భ్రుకుటికన్న మున్న పొది వెళ్లి తుదకు న
ప్పనధిఁ దెచ్చు నీదువాలుఁదూపు. 100

క. ఆనీరధి సేతువుగా
వానరయూథములచేత వసుధేశ్వర, నీ
వానించుశైలములలో
నే నడఁచినవింధ్య మెంత; యిదియును వింతే! 101

సీ. కాలవీరుఁడు దైత్యగణముఁ ద్రుంపఁ గృపాణ
మూఁది యవ్వల వైచునో యనంగఁ,
బుడమిముద్దియ గట్టుపుట్టంబునం దెఱ
కఱుఁగా నమర్చినకమ్మి యనఁగ,
లంకాపురీలక్ష్మి శంకించి దాఁ దంష్ట్రి
దండ గొల్పినభుజాదండ మనఁగ,
నీవార్ధివిస్తార మింత యౌ నని నల్వ
కొల్చి తివ్వనికోలకోల యనఁగ,
తే. ధరణితనయాపరాభవోద్దామభీమ
జవనపవనసముద్ధూతజాతపలిత
సతతదశకంఠదిగ్జయస్తంభ మనఁగ
సేతు వానరించితివి నాఁడు భూతలేంద్ర! 102

తే. రత్నచూడామరారాతి రణధరిత్రిఁ
దునుముమీఁతాత యగుదిలీపుని నుతించి
రావణధ్వంసి వగు నిన్నుఁ బ్రణుతి సేయ
వలయు; నసురారు లెవ్వరికోలఁది వారు." 103

{ రాఘవుఁ డగస్త్యునిఁ దమతాతయగు దిలీపునిచరిత్రమును వినిపింపఁ గోరుట }

తే. అనుడు సమ్మోదహృదయుఁడై యవనివిభుఁడు
మౌ నిగంభీరవచనసామగ్రి కలరి

"రత్నచూడాఖ్య సంశుమద్రాజసూతి
గెలిచె నేరీతిఁ దత్కథఁ దెలుపవలయు." 104

వ. అని కృతాంజలియై ప్రార్థించిన మానిమండలేశ్వరుండు
నృపాఖండలునభిప్రాయంబు దిలీపకథాశ్రవణవిధేయం
బగుట యెఱింగి యిట్లని వక్కాణింపఁ దొడంగె: 105

దిలీపమహారాజచరిత్రము: అంశుమంతునివృత్తాంతము

సీ. తనకృపాణీవల్లి యనతారికోటీర
పద్మరాగచ్ఛాయఁ బల్లవింపఁ,
దనదానదేవతాతరువు సజ్జనబంధు
కవిమిళిందముల యేకటులఁ దీర్పఁ,
దనకీర్తిపాథోనిధానంబునకు హరి
త్కరిశిరంబులు సైకతములు గాఁగఁ,
దనరూపహరిణలాంఛనరేఖ శుద్ధాంత
దృక్చకోరంబులతృష్ణ మాన్ప,
తే. వినుతి వహియించె సప్తార్ణవీపరీత
సర్వసర్వంసహాచక్రసంభరిష్ణు
జిష్ణుబాహావిలాసరోచిష్ణుఁ డుష్ణ
కేతుసన్నిభుఁ డంశుమత్క్షితివిభుండు. 106

ఉ. శైలజ నిందుశేఖరుఁడు జహ్నుసుతన్ జలరాశిభర్త ల
క్ష్మీలలనావతంసమును శేషభుజంగశయానుఁడుం బలెన్
మాళవహేమధన్వనికుమారిక భానుమతిన్ వరించె భూ
పాలకిరీటరత్న మెలఁ బ్రాయము సౌఖ్యవిధేయమై తగన్.

క. జంపతు లయ్యిద్దఱును ద
లంపులు బహురతులగతుల లంపులఁ దనియన్

జొంపం బగుకోర్కి విన్నో
దింపుచు నుండంగఁ బెక్కుదినములు చనియెన్. 108

## అంశుమంతుని సంతానకాంక్ష.

తే. సిరుల సౌఖ్యంబు నొందియు ధరణినాథు
హృదయ మాత్మజుఁ డొదవమిఁ గొదవఁ దాల్చె
శర్వరీప్రాప్తి గలిగియుఁ జంద్రికావి
కాస మీక్షింప దొరకనికల్వవోలె. 109

క. సప్తహయవంశుఁ డొకనాఁ
డాప్తపరంపర వినంగ: "నాత్మజజనన
ప్రాప్తి కడుఁ దడసె నా; కీ
సప్తద్వీపేశతాభిసక్తి వృథ సుఁడీ! 110

సీ. అంబుజంబునకుఁ గా పగురవిచాయల
చాయఁ గుండలరుచుల్ చొకళింప,
శ్రీమందిరద్వారసీమతోరణరేఖ
నలరావిరేక నిగ్గులు దొలంక,
హరిణాంకువెనువెంట నక్షత్రాడుచంద్రికా
లవ మన లేనవ్వు లివలు గులుక,
దర్పణప్రతిబింబితరుణోత్పలశ్రీల
సాంజనేక్షణదీప్తు లలముకొనఁగ,

తే. ముద్దు దొలుకంగ నునుఁగళల్ ముంచితిరుగ
నుండుబాలకునెమ్మొగం బుబుసుపోక
చూచి సంతోషజలరాశివీచికలను
దేల లేదఁట; యిన్నియు నేల తనకు! 111

క. అన్వయసౌధ స్తంభము
వెన్వగ యుడిగించుమందు పెద్దవయసునం
గన్వేలుఁగు సుతుఁడు గలుగమి
మన్వాదులయప్పు దీర్పుమత యెట్లొదవున్! 112

క. వనమున కేఁగెద; రాజ్యా
వనము నడపుఁ; డన్వయంబు వర్ధిలమి యపా
వనము నరుజన్మ; మెలజ
వ్వనమున సుతవంతు లైనవార లె పుణ్యుల్." 113

తే. అనుచుఁ జింతాసమాక్రాంతుఁ డగుచుఁ బలుకు
నవనినాయకు నతివినయమునఁ జేరి
యప్పు డిట్లను నయదేవుఁ డనుప్రధాన
పుంగవుఁడు వాక్యరచనలు తొంగలింపః 114

క. ఏల విచారము ధరణీ
పాలక? బాలకుఁడు వంశపాలకుఁడు భుజా
భీలకరవాలహతరిపు
జాలకుఁ డుదయించుఁ; గొలువు చంద్రార్ధధరున్. 115

సీ. అపరంజిబలుగట్టు యతిమనంబులగుట్టు
విల్లుగా నిల్లుగా వెలయునతని,
వెడలిల్లుమైచాఁదు విషధిఁ బుట్టినచేఁదు
పూఁతగా మేఁతగాఁ బొదలునతనిఁ,
గమలజుతలపాలు గబ్బిబెబ్బులితోలు
కోరఁగాఁ జీరఁగాఁ గొఱలునతనిఁ,
గొండఁ బుట్టినకల్కి గొప్పముమ్మొనముల్కి
యాలుగా వాలుగా నలరునతని,

తే. నతనిఖిలమఖభుగినకనత్కిరీట
కోటికోటీవిటంక శృంగాటకాబ్జ
రాగనవరాగరసపరిభాగశోభి
చరణు, శేషాభరణు, దేవు శరణు చొరుము. 116

సీ. సిద్ధరసంబు పెంజెలమ యాదల మింటి
చెలమఁ దాల్చినయఘుచ్ఛేదకుండు;
త్రవ్వి పెట్టినపెన్నిధానంబు పెన్నిధా
నములవానికిఁ గూర్చుప్రమథభర్త;
ముంగొంగుపైఁడి యామునఁ బైఁడిమలరాచ
వారి విల్లుగఁ జేయువారణారి;
గీముముంగిటిచందమామ సన్నపుఁజంద
మామ మాళి ధరించుమదనహరుఁడు;

తే. కొలుచువారికిఁ గాదెలోఁ గొలుచు; భక్తి
సురభిమతులకు దొడ్డిలో సురభి సుమ్ము;
నమ్ము; సందేహ మేల యోనరవరేణ్య?
సుధరకన్యామనోనాథుఁ గొలువు మయ్య." 117

అంశుమంతుఁడు భార్యాసహితుఁడయి తపము చేయఁబోవుట

తే. అనుడు హర్షంబుఁ జెంది ధరాధినాథుఁ
డయ్యమాత్యుని రాజ్యంబునందు నిల్పి
భానుమతియునుఁ దానును మానివేష
ధారులై యేఁగి; రట పురస్థ్సలమునందు: 118

మేరుపర్వతవర్ణనము

ఉ. ఆనరభర్త గన్గొనియె నగ్రతటాంచలసంవసన్మరు
త్సానువు దంతిరాజమదతోయనిమగ్నదిగంతదంతభృ

త్సానువు దీప్తినిర్జితకృశానువు యామికతాకృ దేణభృ
ద్భానువు నైష్ఠికప్రకరదైవతధేనువు రత్నసానువున్. 119

క. ఆనందమగ్నమతిఁ బతి
భానుమతిం జూచి పలుకుఁ "బంకేజాక్షీ,
యీనగముఁ బొగడుమానవుఁ
డానగధరుఁడో హరుండో యమరగురుండో! 120

సీ. కాణాచియూరు గీర్వాణాధిపతులకుఁ,
జేదోడు చంద్రార్ధశేఖరునకు,
ధేనువునం బాలు దీయించునెఱజాణ,
గాటంపుఁగూటముల్ గలఘనుండు,
కులశేఖరం బలకులగోత్రపాళికి,
బండారమిల్లు రాతండమునకు,
నవలంబనంబు సూర్యస్యందనమునకుఁ
దిలకంబు జాంబవద్వీపమునకు,

తే. జనక మభినవబహుమానకనకమునకు,
యోగ్యనిలయంబు సకలసౌభాగ్యములకుఁ,
బోషకం బద్భుతైకవిశేషములకు,
నీనగంబున కేనగం బీడు వచ్చు! 121

మ. అలనాఁ డాపవమానపారణకులాధ్యక్షుండు పైఁ జుట్టుటన్
గలతర్లో; యటుకాక, శంకరుఁడు బింకం బొప్పఁగా వంచి ని
శ్చలముష్టిన్ ఘటియించువ్రేళ్లగుఱులో; జంబూఫలానీక ని
ర్గళదాగాఢరసౌఘముల్ దిరుగుమార్గంబుల్ సతీ, చూచితే!

క. సకలామరపురవరములుఁ
బికవాణీ, యీనగంబుపెడచెంపనె పా

యక యుండు; శంభుఁ డేగతిఁ
బెకలించెనో విల్లు సేయఁ బృథుభుజశక్తిన్. 123

క. అలమునితంబనితంబ
స్థలమున నొకకొంత మొగులు దగులున్నది యీ
కులగిరి విలు సేయుచు హరుఁ
డొలయించినబిరుదుజల్లి యో యని చూడన్! 124

చ. పొలుపగుతారకాప్రసవపుంజములన్ సిగఁ జుట్టి ధాతురే
ఖలఘుసృణం బలంది కటకంబుల మేఖలలన్ వహించి త
జ్జలధరనూత్నచిత్రపటసంగతి సానులతోడికూటముల్
గలిగి తనర్చు నగ్గిరి యొకానొక కాముకురేఖ చూపుచున్."

వ. అని తదీయరామణీయకంబు నిజపురంధ్రికిఁ జూపుచుఁ దెలు
పుచు నగ్గిరి యెక్కి యొక్కయెడ విస్రుమరసిద్ధరసప్రవాహా
నికటతటసంజాతకర్పూరకదళికావ్రాతంబునడుచక్కిం జుక్కల
తేనిమానికంబుల మెఱుంగుటఱంగుచెఱంగున మధురమధు
ప్రబోధితమాధవీప్రసూనమంజరీపుంజ మరందస్యందితుంది
లాయమానమందమందపవమానక్రీడలఁ గదలుపొదలనింపు
దళుకొత్త వికసించునలరుపుప్పొడి కుప్ప లయి రాలనొప్పుల
కుప్ప యగునుచితప్రదేశంబున వసియించి యించు
కంతయుఁ జలనంబు నొందక నియమనియమితచటులేం
ద్రియవాహం బగుమనోరథంబు నొందుకొఱకుఁ బదిల
పఱచి నిష్ఠాగరిష్ఠుండై; 126

## అంశుమంతుని తపశ్చర్య

క. ఎండల జడియఁడు నృపమా
ర్తాండుఁడు; బలువానలకును దలఁకఁడు భూభృ

న్మండలపతి; యివములచే
బెండుపడఁడు సుగుణజలధి పెంపు దలిర్పన్. 127

క. భానుమతి యిదియ పరమ
జ్ఞానవతియటంచు మునులు సన్నుతి సేయన్
దానుం బతిశుశ్రూషలు
పూని నడపుచుండెఁ బ్రమదమున నవ్వేళన్. 128

సీ. ఆఱుమోముల ముద్దు హావణించు క్రౌంచారి
కొడుకుమాటలవింతకొసరు మఱచి
తలయేటివెలిదమ్మిమొలకయో యని కరా
గ్రమునఁ జందురుఁ దార్చుకొమరు మఱచి
ప్రాణంబు ప్రాణంబులై సదా తనయొద్దఁ
గదలని ప్రమథపుంగవుల మఱచి
యూడిగంబుల కెల్ల నొదవి నల్గడలఁ బా
యకయుండుతపసిజోటికల మఱచి

తే. యెంతవేదురు గొనియెనో యిందుమౌళి
నాటు దేరనిసచ్చిదానందలహరి
దల మగుమహీశు డెందంపుఁదమ్మిగద్దె
కొలువుకూటంబులోపలఁ గొలువు సేయ! 129

## అంశుమంతునితపము మాన్పుటకయి దేవతలు శివుని ప్రార్థించుట

క. ఇటువలెఁ దపంబు సేయఁగ
నటునిటు నూఁటాడె జగము; లపు డింద్రాదుల్
నిటలాక్షుఁ గానఁ జని తమ
నిటలము లిల సోఁక మ్రొక్కి నిలిచి నిభృతులై: 130

గీ. "నిగమగంధర్వ, గంధర్వనిరుపమాన
గానవిద్యాకళాలోల, గణ్యశీల
శైలజాధీశ, సర్వేశ, జయనివేశ,
నీలకంఠ, భవవ్యాళనీలకంఠ! 131

క. దీను లగుమమ్ముఁ గరుణా
మానస, రక్షింపు; మంశుమద్రాజతపో
నూనాగ్నిశిఖల వేఁడిమి
నీనలఁకువ నొందవలెనె? యెఱుఁగరె మీరల్! 132

శా. తద్గాఢాశయధైర్యకంచుకము విధ్వస్తంబుగాఁ జేయ మా
దృగ్గంభీరగజేంద్రగామినులు రంభాదుల్ సుధీహృత్పుటీ
షిద్గోల్లాసవికారకారణతనూశృంగారిణుల్ చాల; రా
పద్గూఢాంఘ్రిమయూర,మమ్ముఁ గరుణంబాలింపవే యిత్తఱిన్.

ఆ. నలువయేలుపదమొ, నాకపదంబొ, యా
ధరణినాథుఁ డేలఁ దలఁచినాఁడు!
తడవు సేయవలదు; తన్మనోభీప్సితం
బిచ్చి జగముఁ బ్రోవు మిందుమౌళి!" 134

ఉ. నావుడు నవ్వుచుం బ్రమథనాథుఁడు: "దేవతలార, పొందు మీ
కీవెఱ పేల? యానృపతి కీరలు దెల్పిన వెల్ల నిష్టముల్
గావు; మహాఫలం బొకటి గైకొనఁ గోరెడు." నంచు వారలం
బోవఁగఁబంచి యీప్సితముభూపతికింగరుణించెశంభుఁడున్."

క. అని యిట్లు రామచంద్రున
కినకులకలశాబ్ధిహర్ష కృతిచంద్రునకున్
మునినాథుఁ డయ్యగస్త్యుఁడు
వినిపించె గభీరధీరవిశదప్రౌఢిన్. 136

శా. బంధూకప్రసవాధరారతిధవా, పాండిత్యపద్మోద్భవా,
గంధాంధప్రతిపక్షశిక్షకమతీ, కల్యాణధనోన్నతీ,
బంధుశ్రీపదవైభవోదితకలా, భాస్వద్దయాశీతలా,
సింధువ్రాతపరీతభూభరణలక్ష్మీలక్ష్మబాహార్గళా. 137

క. పశ్యల్లలాటజూటీ
శశ్యుదయసమానకీర్తిసంపద్వర్తీ,
కాశ్యపిరథరుచిపాత్రా,
కాశ్యపమునిగోత్ర, సుజనగణ్యచరిత్రా. 138

స్రగ్ధర. శ్రీ మత్కోనేటిరామక్షితిపతికరుణాసింధుసంభూత
రాజ్య- శ్రీమాధురైక్యకధుర్యా, శ్రితభరణకళాశేషభూషో
పమానా- రామోద్దామానుభావా, రసికనుతగుణారామ
రమ్యస్వభావా - సామర్థ్యైకల్పమూర్తీ, సతతనయవిశేష
ప్రథాసత్యకీర్తీ. 139

గద్యము. ఇది శ్రీమత్తెనాలిరామేశ్వరశాశ్వతకృపాకటాక్ష
లక్షితకవితాభిరామ రామయపండితకుమార సహజశైవా
చారసంపన్న ధీమదన్నయనామధేయప్రణీతం బైనసుదక్షిణా
పరిణయం బనుశృంగారకావ్యంబునందుఁ బ్రథమాశ్వాసము.

శ్రీ

# సుదక్షిణాపరిణయము

## ద్వితీయాశ్వాసము

శ్రీ భామాయుతలోచన
వైభవయుత, దానవవిజితవైరోచన, వి
ద్యాభవ, నిత్యస్తుత్య
ప్రాభవ, పులిజాలధామ రామయసోమా. 1

తే. అవధరింపు మగస్త్యసంయమివరుండు
పలుకుఁ గప్రంపుఁబలుకులు దొలఁక నిట్టు
"లవలికథ దెల్పు." మనురాఘవాధినాథుఁ
గాంచి రదనాంశుచంద్రికల్ గడలుకొనఁగ. 2

### శివుఁడు పార్వతి కంశుమంతుని దాతృత్వమహిమ నెఱిఁగించుట

క. ఈరీతి సురలఁ బొమ్మని
గౌరీపతి గౌరిఁ జూచి "కమలదళాక్షీ,
మేరునగకూటమున దు
ర్వారతపము సేయుచున్నవాఁ డచలుండై. 3

తే. అర్థిఁ జుమ్మని వేఁడినయంతమాత్రఁ
బ్రాణమేనియు నొసఁగు నోపద్మనయన,

యంశుమద్వంశసరసీరుహాంశుమంతుఁ;
డంశుమంతునిచరిత మే మనఁగ వచ్చు! 4

క. కలలోన నైన బొంకఁడు;
చలమున జముఁడైన నీఁడు శరణాగతు; న
య్యిలఁ జేనిసాటి కొండొక
యిల తేఁడా, వేల్పు తేఁడు నెన గాఁడు సుమీ! 5

తే. తపము సేయుచునున్నాఁడు ధవళనయన,
మనమునెత్తమ్మిగద్దియ మమ్ము నిలిపి,
యతనిఁ జూడంగవలయు ర”మ్మనిన “హేమ
గౌరి యాగౌరి పల్కు ముక్కంటితోడ:: 6

సీ. “పైశునస్వరసవశాభవ్యకర్ణముల్ కర్ణముల్,
మాననివాసంబు మానసంబుఁ,
బరధనోపార్జనత్వరములు కరములు,
భూరిరాగోద్వృత్తిపాంత చింత,
నిఖిలవంచనసముస్మేషంబు రోషంబుఁ,
బూర్ణదాంభికసత్యభూష భాష,
భీకంపితప్రాంతలోక మాలోకంబు,
సంగోపితార్థనిశ్చయము నయముఁ,

తే. బ్రబలు భూపాలురకు నిట్టిభావశుద్ధి,
యిట్టియౌదార్య, మిట్టిసూనృతము, నిట్టి
గుణముఁ గల్గుట యాకాశకుసుమలబ్ధి;
భక్తుఁ డని మెచ్చి యీరీతిఁ బల్కితేమొ.” 7

మ. అనుడుర్గా నవ్వుచు శంభుఁ డిట్లనియె:“నీయర్థంబు సామాన్య
భూ-వనితాధీశులయందు నిక్కము; నయవ్యాపారపారీణు

లై - యినచంద్రాన్వయదీపకుల్ మహీతలాధీశుల్ రమే
శాంశసం-జనితుల్ ధర్మదయావిధేయు లగు టాశ్చర్యంబె
బింబాధరా! 8

తే. సందియం బేని యోశరచ్చంద్రవదన,
యానృపాలకు నీక్షింతుగాని రమ్ము;
తడయ నింక నేల?" యని పురధ్వంసి యున్న
యునికిన జయాదిపద్మలోచనలు నగఁగ; 9

### శివపార్వతులు కపట విప్రదంపతుల వేషమున నంశుమంతునిఁ బరీక్షింపఁ జనుట

సీ. తల దాఁచుమిన్నేఱు వెలికి జాఱినజాడఁ
బెడతల నొదిఁగినపిల్లసిగయు,
వయసుగీమపు వెన్ను వంచెనా మునువంక
కొకయింత వీఁగినయొదుఁగువీఁపు,
గుణసమగ్రత చూపుగణన సురోవీథిఁ
జకచకద్యుతు లీనుజన్నిదములు,
జిగిసీరు చనఁ గాన నగుమోముఁదమ్మిమూ
లంబు నాఁ బ్రబలుగడ్డంబుసొంపు

తే. నలికతటి గంగమట్టియతిలకమునకు
నడ్డముగ భూతిపుండ్రంబు లలవడంగ
మడుఁగునీర్కావి కటిఁ బింజె మడిచి కట్టి
కపటవిప్రాకృతి ధరింప గౌరి నగుచు: 10

క. "బూ-మెలవేల్పవు గా, కీ
వే మని ధరియించి తయ్య, యీరూపము! ని

న్నే మనఁగ వచ్చు? నింకన్
సోమార్ధకిరీట, నన్నుఁ జూడు." మటంచున్. 11

మ. పసపుంబట్టయు నేసచెందిరముఁ గూర్పాసంబు నేత్రాంబుజా
ప్రసరత్కజ్జలమున్ శ్రవోనిచితలాక్షాపత్రముల్ వీటికా
రసలిప్తాధరపల్లవంబును హారిద్రాసూత్రసంవేల్లితో
ల్లసితగ్రీవయు వెండినున్గడియముల్ భాసిల్లఁగా నిల్చినన్. 12

చ. కనుఁగొని నవ్వుచున్ శివుఁడు గౌరికరంబు కరంబునం
బ్రియంబునఁ దెమలించి "క"మ్మనుచుఁబోయి నిజాగ్రధరిత్రిఁ
గాంచెఁ గాంచనమణిశృంగదంభమునఁ జాపముఁ దా నొన
రించునాఁడు పైనెనసినపాపతేఁడు తల లెత్తుట నేఁడును
దెల్పు మేరువున్. 13

వ. కాంచి నిగ్గుల నగ్గలించుమల్లెపూమొగ్గ శంభులింగంబుఁ
బ్రతిష్ఠించి కమ్మఁదేనియ జలకంబును, గడివోనిసురపొన్న
విరిమడుంగును, గుబుబింపపుష్పాదిగంధంబును, జంచ
త్కాంచనకేసరాభరణంబులును, జలువకలువవిరి రేకుల
పూజలు, నిజగరుత్పుటాగ్రజాగ్రత్ ప్రభాకరోపధూపం
బులు, రసాలకళికాదీపంబులు, ఫలరసోపహారంబులు నర్పించి,
త్రిపురహరణాదికంబు లగుకథల నాదివ్యోపవనంబులం
బాడు ప్రౌఢతుమ్మెదలం గని యదియ యారాజపురందరు
నాశ్రమం బని చేరంబోవునప్పు డప్పార్థివుండు: 14

### అంశుమంతుని యతిథిపూజాతత్పరత

శా. హృత్పంకేరుహమధ్యపీఠమున గౌరీశుం బురధ్వంసకున్
జిత్పారీణుఁ గృపాధురీణు నభవున్ శేషాహిరాట్కంకణుం
దాత్పర్యంబున నిల్పి యింద్రియములం దక్కొందుఁ బోనీక శ్రీ

మత్పంచాక్షరి యుచ్చరించుచు ధృతిన్ మధ్యాహ్న మా
నంతకున్. 15

తే. తపముఁ గావించి యాత్మముం దవులుచూపు
సడలి వెలిఁ జూడ నృపుఁ జేరి చంద్రవదన
భానుమతి "దెచ్చి యున్న యీఫలదళంబు
లారగింపంగఁ దగదొకో" యనుడు నతఁడు: 16

తే. "వినవె 'యభ్యాగత స్స్వయం విష్ణు' వనుచు
నిగమవేదులు పలుకంగ నీరజాక్షి;
యతిథిశిష్టాన్నభోక్త శతాశ్వమేధ
కర్త కెక్కుఁడు, సరిగాని; కాఁడు కీఱుదు. 17

క. వనజాక్షి, యేల మాటల
పని? పిచ్చుకకుంటుమీఁద భాగీరథి వ
చ్చినజాడ యతిథి వచ్చుట
జనిబంధనిబద్ధుఁ డైనజడశీలునకున్. 18

శా. రాఁ డభాగ్యతుఁ డొక్కఁడేనియుఁ; దదర్హాపూర్వభోక్తృ
త్వ మె-వ్వాఁ డైనం గొనగాదు; పుట్టుకొలఁదిన్ వర్తిల్లు
నీపూన్కి యే-నాఁడున్ సూర్యకులంబువారలకు; దానం
జేసి ధన్యాత్ము లై-నేఁడున్నాఁడుఁ బ్రసిద్ధులై కనిరి శ్రీనిత్యా
యురారోగ్యముల్. 19

తే. అంబుజానన, సగము ప్రొద్దయ్యెఁ; గడమ
సగము జరిగిన రేపైన సంభవించు
నతిథిసంపూజ; యందాఁక నారగింపఁ
దగదు; నీ వేమి యెఱుఁగవా ధర్మపథము?" 20

అంశుమంతునొద్దకు కపటవిప్రదంపతులగు శివపార్వతులరాక

క. అని పలుకుచుండ నప్పుడ
చనుదెంచెం గృతకవిప్రసత్తముఁ; డతనిం
గనుఁగొని నిధి గన్నయకిం
చనుఁడుం బలె నృపతి వితతసంభ్రముఁ డగుచున్. 21

క. "మనపాలిభాగ్యదేవత
చనుదెంచెను ర." మ్మటంచు సతియునుఁ దానుం
జని తత్పదపద్మములకు
వినతుండై యర్ఘ్య మొసఁగి వినయం బెనయన్. 22

క. పావనపీఠాసీనుం
గావించి, సపర్య లిచ్చి, కరములఁ బదరా
జీవము లంటుచు: "నెటువలె
వే వచ్చితి రిటకు నెండ వేండ్రము చూపన్?" 23

వ. అని యతనిదండ నున్నయప్పైదలిం గనుంగొని: 24

క. "ఈసాధ్వి యెట్లు నడచెనొ
మీసంగడిఁ గటికియెండ మిటమిట గాయన్
వేసవిమధ్యాహ్నంబునఁ
గేసరిగజగవయఘోరగిరిమార్గములన్. 25

క. ఊ రెయ్యది? పే రెయ్యది?
యీరూపున నొంటిఁ దిరుగ నేలా వలసెన్?
మీ రిద్దఱు నిట రాకకుఁ
గారణమును దెలియఁ బలుకు కారుణ్యనిధీ!" 26

వ. అనుచు నారాజదంపతు లయ్యాదిమదంపతుల నరుణకిరణ
పంతప్తఘర్మజలసేకంబులను సిద్ధరసవాహినీనికటతటసంజాత

నూతనకనకకదలీపల్లవవ్యజనవీజనంబులను బడలికఁ దీర్చినఁ గూర్చుండి యాకుహనామహీసురుం డాధరాఖండలున కిట్లనియె: 27

{ కపటవిప్రదంపతులు తమవృత్తాంతము నంశుమంతున కెఱుకపఱచుట }

క. "నా పేరు శంభుమిశ్రులు;
వాపారము విద్య లెల్ల; వనజాసనుఁడున్
నాపాటి గాఁడు; దిక్కుల
నోపికఁ జరయింతుఁ గాని యొకయూ రెఱుఁగన్. 28

క. పెనుఁగొండ నిలుతుఁ దఱచుగ
మన సెనసి ధనాఢ్యుఁ డొకఁడు మముఁ గూడుక రాఁ
జనవున సకలజనంబులుఁ
బని సేయఁగఁ గొదవలేనిబలగముతోడన్. 29

క. తామరతంపర సంపద;
యే మని వచియింతు? నట్టియిలు దీర్పంగా
సామర్థ్యము గలిగిన దీ
కోమలి; ధైర్యమున రాతికూఁతురు సుమ్మీ!" 30

వ. అని నిజకుటుంబినిం జూపి మున్నింటిలెస్సఁదనంబు పోక యుగ్గడింపం గలవాఁడై వెండియు నతిదీర్ఘంబుగ నిశ్వాసం బడరించి యి ట్లనియె: 31

క. "ఏ రెద్దు సాగి ముడిపడి
కోరం దగి కొడుకు లనఁగఁ గూఁతు లనంగాఁ
దోరం బగుసంసారము
సారము గాకున్నఁ గడు నసారము గాదే. 32

క. ఆరీతి నుండి కడపట
నీరీతుల నుండవలసె; నే మందు నికన్?
వారణకర్ణాకృతుల న
వారణఁ జలియించు; నమ్మ వచ్చునె సిరులన్! 33

వ. అవ్విధం బెఱింగించెద వినుము: 34

క. తనయుల నిద్దఱిఁ గాంచితిఁ
గనికర మిఁక నేల దైవఘటనకు మరులై
చనియె నొకరుండు; వెనుకన్
వెనుకయ్యయు గృహము విడిచి వీడిడి యయ్యెన్. 35

క. చుట్టములు మాట లాడరు;
బెట్టిడఁతురు వాడవారుఁ; బేర్కొన రితరుల్,
తిట్టుఁ గులసతియుఁ; గొడుకులు
ధట్టింతురు; లేమివంటిదైన్యము గలదే! 36

క. 'కలిమియు లేమియుఁ బూర్వా
కలితంబులు వీని కంత కళవళ మందన్
వల.' దని కాంతయు నేనుం
గలరీతులఁ బ్రొద్దు గడపఁగా నటమీఁదన్. 37

సీ. అంగసంగతపూర్వశృంగారకాంతిసా
మగ్రిపలాయనమంత్రవిద్య,
కాంతాకటాక్షవీక్షణశరవ్రాతంబుఁ
గడకు నొత్తెడుమూసకట్టుమందు,
చిత్తసంభవుని కెంజిగురుఁగటారిఁ బై
నాడంగ నీని వజ్రాంగిజోడు,

తారుణ్యభరమదోదయసమున్నతసత్త్వ
భద్రవేదండకపాకలంబు,
తే. మించుముఖపంకజమునకు మంచువాన,
యాత్మబోధప్రదీపంబు నార్పుగాలి,
యలఘుగౌరవకులశైలకులిశధార,
రోఁతలకు రోఁత ముదిమియుఁ బాఁతుకొనియె. 38

క. ఏపుణ్య మెంత చేసిన
బాపఁగ నోపదు పితృణభర; మాయప్పే
పాపంబు నరున కన్వయ
దీపకుఁ డగుసుతునికతనఁ దీర్పక యున్నన్. 39

క. ధాత్రిం "బున్నామ్నోనరక
కాత్త్రాయత" యనవె శ్రుతులు; గణ్యచరిత్రుం
బుత్త్రుం గనక నరుండు జ
గత్త్రితయము నేలె నేని గతి గనఁగలఁడే! 40

వ. అని యొక్కింతసేపు చింతించుచు నూరకుండి వెండియు
ని ట్లనియె: 41

క. కలదే యాసకుఁ గడపల!
వెలఁదుకయును నేనుఁ జాల వృద్ధుల మయ్యుం
దలఁచెదము సుతులఁ గనుఁగొన
వలవంతం గొంత వింతవారలు నవ్వన్. 42

క. అకలంకబుద్ధి నీకుఁ
సకలము నెఱిఁగింతు మద్విచారము వినుమా;
యొకనాఁడు రాజతాచల
నికటంబున నీనితంబినీమణితోడన్. 43

క. ఒకయెడ నిర్ఝరతటమున
వికచనవాంకురితపల్లవితపత్త్రితకో
రకితప్రసవితకురువక
వకుళాదికతరులనీడ వసియించుతఱిన్. 44

ఉ. వచ్చె వసంతకాలము రువారపుఁదేనెపసిండినీరునన్
బచ్చెన మాఁటి తేఁటినిసుపాజులఁ దీరుగ వ్రాసియున్నయా
పచ్చనివిల్లు వంచి సుమబాణుఁడు పాంథులధైర్యవర్మముల్
గ్రుచ్చి చనంగ మవ్వ మగుక్రొవ్వునఁ గ్రొవ్విరితూఁపు లే
యఁగన్. 45

శా. అవ్వేళం బికకీరజంపతులు ప్రేమాంభోధి నోలాడుచున్
మవ్వం బొప్పఁగఁ గూడిమాడి మరునిన్ మన్నింపఁగాఁ జూచి
యీ,పువ్వుంబోఁడియు నేమునుం: "గటకటా పోయెన్ వృ
థా ప్రాయ."మం,చువ్విళ్లూరుచు నుంటి మింతవడి యయ్యో,
చెప్ప సిగ్గయ్యెడున్. 46

ఉ. ఆమమకార మాసరసహాసవిలాసము లా ప్రియంబు లా
ప్రేమము నెచ్చరించి యలపిన్నటికన్నెఱికంబు నాఁటియా
కోమలికూటమిం దలఁచుకో నెల విచ్చి విరాలిఁ జేసె న
య్యామనివంటిచుట్ట మహహా, మఱి కల్గునె యెన్నిచా
యలన్! 47

వ. అంత దైవవశంబున: 48

సీ. మేరుశైలముమీఁదిమిహిరాంశుజాలంబు
వడువునఁ దగుపల్లజడలవాఁడు,
వదనేందుబింబసేవాకాంక్ష రెండయ్యుఁ
గుజమండలం బనుగ్రుడ్లవాఁడు,

గంగావృతాభ్రంబుగతి యోగబంధస
న్నాహబంధుర మైననడుమువాఁడు,
తమ్ముల వెనువెంటఁ దగిలి పాయనియంచ
దొర లనువజ్రపాదుకలవాఁడు,
తే. బూఁదు పాఱినవెలిబూదిపూఁతవాఁడు,
నవక మగుమోవితుద చిఱునవ్వువాఁడు,
(పయిని గప్పినపులికడవసమువాఁడు)
సిద్ధుఁ డొకరుండు వచ్చి యాసీనుఁ డగుచు. 49

క. ననుఁ జూచి: “బ్రాహ్మణోత్తమ,
వనజాక్షియు నీవుఁ గొంత వలవంత మదిం
బెనగొన్న రీతి నున్నా;
రనుమానము మాని తెల్పుఁ డది యెయ్యదియో!” 50

తే. అనుడు నే మని చెప్పుదు ననుచుఁ గొంత
దడవు సిగ్గునఁ జిడిముడి పడుచు నుండి
పేదతెవు లింక నంగడిఁ బెట్టుకున్నఁ
దీర దని మద్వ్యథం బెల్లఁ దెలుపుటయును. 51

వ. దయాళుండై యాసిద్ధప్రవరుం డిట్లనియె: 52

ఉ. “విప్రకులావతంస, వినవే యనుమానము మానిఁ పుత్త్రకుం
డప్రతిమప్రభావనిధి యన్వయదీపకుఁ డుద్భవిల్లు; న
వ్యప్రచురాంగకాంతిభరయౌవనలక్ష్మియు నిన్నుఁ జెందు;ని
త్యప్రమదంబు చేకుఱుమహౌషధ మొక్కటినీకు నిచ్చెదన్.

మ. తనయాకాంక్ష సుమేరుకందరమునం దాదృక్తపోనిష్ఠ నుం
డినధీరోత్తము నంశుమంతు నలివేణీయుక్తిమై సమ్మతిం
చునుపాయంబు ఘటించి తెమ్మతనియస్తోకాసృగంభోఝరం

బున గాలిజఠరంబుఁ దేల్చినఁ బ్రియంబుం జెంది యద్దే
వియున్. 54

క. ఇచ్చు నొకదివ్యమాలికఁ;
దెచ్చి యదియుఁ దల ధరింప ద్విజవర, నీకున్
వచ్చుం బ్రాయము; సంపద
హెచ్చుఁ; సుతుఁ డుద్భవించు; నిది నిజము సుమీ." 55

క. అనుడు "నిదె వత్తుఁ, దెత్తున్
జనపతి" నని వచ్చినాఁడ సమధిక తేజో
ధన, యాతఁ డున్నయెడ నా
కు నెఱుంగం బలుకు; మతనికొలఁదిఁ దెలియుదున్." 56

మ. అనుడున్స్మితనమందహాసవిభవం బాస్యేందుబింబంబునం
జినుకన్ వెన్నెలసోన యవ్విభుఁడు రాజీవాక్షి నీక్షించి "యో
జననాథాత్మజ, వింటివే యితనివాచాసారసారస్యమున్?
మననోముల్ ఫలియించు జీవితము బ్రహ్మప్రీతిగా నిచ్చినన్.

తే దేహ మేనాఁటికాణాచి? దీనిమీఁది
తీపి కొఱగాదు, గోడవలకాఁపురంబు;
బ్రహ్మసంస్థాపనముకంటెఁ బరమధర్మ
మెవ్వరికిఁ గల్గుఁ? గలిగెఁ బో నిహముఁ బరము. 58

మ. తపమిం కెన్నఁడు పూర్ణతం దగు; సుధాధామార్ధజూటుం
డునే- నెపముం బూనక యెన్నఁడే నొసఁగుఁ; బూనిక-
న్నందనుం డెప్పు డ-చ్చుపడం జేయుఁ గులాభివృద్ధి? నీకీ
నీసుద్దుల్ విసర్జించి యీ-విపులానిర్జరుకోర్కెఁ దీర్ప
వలయున్ విఖ్యాతి సంధిల్లఁగన్." 59

వ. అనినఁ బ్రమోదమేదుర ప్రసాదకందళితవదనారవిందయై యయ్యిందువదన రాజపురందరుం గనుంగొని: 60

క. "కులదీపకసుతవాంఛా
కలితం బగుతపము మాని కాపాలికదో
శ్చలదసిఁ ద్రెస్సినఁ గీర్తులు
గలుగవె! బ్రహ్మార్పణంబు గాదే యదియున్! 61

సీ. అమరేంద్రసంరక్షణార్థమై యొసఁగఁడే
యలయక కోలెమ్ము నాదధీచి!
ప్రాణంబు లీఁడె తప్పక భోగిసుతునకై
యూహించి జీమూతవాహనుండు!
నర్పింపఁడే కృత్రిమాండజన్నిగ్ధుఁడై
చెక్కి మాంసంబెల్ల శిబివిభుండు!
తనువుఁ ద్రిలోకముల్ ధారగాఁ జేయండె
బలి వామనుండైనబల్లిదునకు!

తే. నోపి సత్కీర్తికొఱకుఁ బరోపకార
పరుల కాదవింప రానిదుష్కరము గలదె!
తనువుపని యెంత? ధర యెంత? తనయుఁ డెంత?
విప్రవరుకోర్కి గావింపు విపులతేజ!" 62

క. అనుదేవివచనరచనకు
మనమున హర్షించి తేఁడు మహినిర్జరుఁ గ
న్గొని. "యేన యంశుమంతుఁడ."
ననుడు మహాద్భుతముఁ జెందునాకృతి నతఁడున్. 63

శా. "చూడం బోయెదుతీవ కాళ్ళఁదవిలెన్;సూరోత్తమా,సంగర
క్రీడారోపితచాపటంకరణమూకీభూతలోకత్రయా,

యీడా నీ కొక?రంశుమంతుఁడవె నీ; వీడే తె నాకోర్కి? నేఁ
డాడం బోయెడుపుణ్యతీర్థ మెదురై యబ్బెం బురోధారుణిన్.

క. "ఎక్కడ నెవ్వ రొసంగిరి
తక్కక యిటువంటికోర్కి? ధరణీసురుఁ డే
చక్క టెఱుంగును మిక్కిలి
కక్కూఱితికాఁ" డటంచు గర్హింపకుమీ! 65

సీ. తేజోగ్ని ధూమవిభ్రాజి వా లెడలించి
కేలుఁదామరకుఁ గంకాళ మొసఁగి,
యలగుణశ్రేణి యక్షహారవల్లిక మాన్చి
యస్థిమాలిక దెచ్చి యఱుతఁ బూన్చి,
తను వెత్తుయశ మనుఘనసార లేపంబు
పోఁ జేసి నెమ్మేన బూది యలఁది,
సైకతస్థితఫేనసదృశ మౌ వెలిపట్టు
కత దార్చి కటిఁ దోలుఁ గట్టఁ బనిచి,
తే. యినునిఁ గులకర్త శిరసావహించె ననఁగ
బరగుమకుటంబు డించి కర్పరము నించి,
జోగి నిను జోగిఁ జేసి యాశూలధరకు
నర్పణము చేసి తెఱచిరా జనఁగవలయు. 66

క. చెప్పితిఁ దెలియఁగ; నీమతి
యొప్పినక్రియ నాచరింపు; మొరులకుఁ గాఁ ద
మ్మొప్పించువారు గలరే!
యిప్పాట న్నిన్నుఁ గలఁప నేలా నాకున్? 67

చ. "జలధిపరీతభూభువనచక్ర మవక్రభుజాబలంబునన్
నిలిపి యశోధురంధరత నెమ్మి వహించినరాజసింహముల్

దలఁపక యిట్టికోర్కి వసుధామరుఁ డేమని వేఁడె!" నంచు నా
వెలితిగ నాడికొండ్రు; పదివేలును వచ్చెను; బోయి వచ్చెదన్.

చ. నృపవర, నిన్ను మీఁ దెలుఁగ నేరక వేఁడితిఁ; గాక,
చంచలా-చపలము లైన రాజ్యసుఖసంపదలన్ మది నమ్మి కీర్తి
యుం-గృపయు వివేకము న్నయముఁ గేవలధర్మపరత్వమున్
సదా-కపటమతిం దొఱంగుమహికాంతుల కేడ పరోప
కారముల్! 69

క. తడ వుండితి వని సిద్ధుఁడు
తోడిఁబడఁ గోపించెనేని దురితం బొదవున్
మృడునకు మ్రొక్కఁగఁ బోయిన
గుడి మీఁదం బడినయట్లు కువలయనాథా! 70

తే. సటలు నృపసింహమునకు నిజంబు; లింత
యాలసించినయపుడ మాయభిమతంబు
లెల్ల సమకూరెఁ; బోయెద; దయయ చాలు;
నిందుకొనియుండి ధర యేలు నృపవరేణ్య." 71

క. అనవుడు నెమ్మదిఁ గలఁగుచు
జననాయకుఁ: "డిట్లు పలుకఁ జను నే! యిత్తుం
దను వైనఁ, బ్రాణ మైనం;
గనలకుఁ; డయోగ్యగిఁ గొలువఁ గాఁ జను దెంతున్. 72

మ. గళహస్తంబు వివేకపాకమునకున్ గాఢాంగసత్త్వచ్ఛిదా
కలనాహేతు వవార్యధైర్యధనశిక్షానిర్నిరోధంబు చం
చలతామూలము దీపనానలశిఖాజాలంబుఁ జల్లార్పవే
ఫలపత్త్రాంబునియుక్తి మామకతపోభారంబుదారంబుగన్."

తే. అనుడు నొక్కింత నవ్వి ధరామరుండు:
"కువలయాధీశ, చాఁ జాలుకూటి వేద
తోడు దప్పినజాడ సిద్ధుండు చనినఁ
గానఁ గాచినవెన్నెల గాదె బ్రతుకు!" 74

మ. అనుడుం జింత యొకింత లేక మదిలో నానందముం జెందిది
గ్గన భూపాలుఁడు లేచి: "యోవిబుధముఖ్యా, యోగికోటీ
రమే-మని కోపించునో మిమ్ము; వేగమ పదం." డంచుం జనఁ
ముందటం - గనకాపారర్యశరాసనుం డపుడు సాక్షాత్కా
రముం బొందుచున్. 75

## శివసాక్షాత్కారము

సీ. తలవంకఁ గలవంక నెలవంక నీక్షించి
తెల్లనబ్జంబు గ్రుక్కిళ్లు మ్రింగఁ,
దనువెచ్చ కనువెచ్చ మనువెచ్చరిక వ్రేఁపు
పూఁత డాపటితలఁ బూఁత సేయఁ,
బసిఁబట్టు దెసపట్టు వసపట్టు వెలిగిబ్బఁ
ఢుటికి సామ్రాణిగ్రేళ్లుఱుకఁ జేయ,
లలిమించు వలిమించు కలిమించు జిగినవ్వ
గులుకు వెన్నెలలపై కొసరు గాఁగ

తే. వేల్పుగిడిబిళ్లు మొరయఁ గ్రొవ్విరులు గురియఁ
దపసు లెదిరింపఁ జదువు లొఁదలలు వంప
దెసలు తెలుపెక్క, జగములు తెలివి నిక్కఁ
గలికిమైవేల్పు దనమ్రోల నిలుచుటయును. 76

క. భుజములు మూఁడై భూభృ
ద్గజనాథుఁడు మ్రొక్కి మ్రొక్కి కమనీయనుతి

ప్రజములచేఁ దత్పదపం
కజములఁ బూజింపఁ బూనెఁ గాంతయుఁ దానున్. 77

## అంశుమత్కృతశివస్తుతి

దండకము. "జయజయ జగదేకరక్షాపరిక్షీణకారుణ్యవీక్షాపరి
ష్కారనిష్కారణస్నేహ వాత్సల్యకల్యాతికల్యాణదాన
ప్రథా మాధురీతీధురీణస్పృహాపాలితాశేషనిర్ధూతరోషాత్మ
సంచార నిస్తీర్ణసంసార హంసారవిందారి చంచన్నిజాలోక
లోక ప్రభో త్వం నభోవాయునీరక్షమాతీవ్రభానుక్షపా
నాథవైశ్వానరాత్మాదిభి ర్మూర్తిభేదై రసాద్యైస్సదాసం
ప్రమోద్యై రఘూద్యై స్సమస్తప్రపంచం విధత్సే భవత్సేవయా
నిర్జరానిర్జరధ్వంసకధ్వంసినో మానవామానవప్రాభవారీణకేళీ
ధురీణా భుజంగేశ్వరానశ్వరైశ్వర్యవిశ్వక్షమాభోగనిర్వా
హిభోగా మునీంద్రా వినిస్తంద్రసాధు ప్రబోధా స్తరంతి
స్ఫురంతీం దురంతాం భవక్లేశవారాశివింతా నిరంతోర్మికా
మాలికా మఖిలవినుతతేజోనిధే వేదవేదాంతవిద్యావధే
క్షీరవారాశిసూనుః ప్రసూనం రమానందన శ్చందన శ్చంద
నాద్రిప్రచారానిలాంకూరసంశోషణం భూషణం లేఖనాసం
గతాంగా స్తురంగా స్సమస్తక్రియాకేలివిద్యాసుధావారిధి
స్సారథి స్సారధీరక్షణాక్షీణలీలా ప్రవీణాధిబాణా నటత్తుంగ
భంగావళీకింకిణీసంకులార్ణోనిధిస్వర్ణకాంచీసమంచత్కురంగం
శతాంగం నిరాఘాటఘాటీపరిస్ఫోటి తోల్లోకలోకత్రయం
వీరదైతేయధామత్రయం లక్ష్యమక్ష్యంబుజోంతర్నిమగ్నా
గ్నికీలోల్లసత్ఫాల, బాలోడుపా మాద్యంతశూన్యాధిక

ప్రాభవం కిన్ను జానామి తే వైభవం మౌళిజూటాటవీమగ్న
గంగాపయశ్శీకరాకార వేగోత్పతత్తారకైర్దిగ్వధూశ్రేణికా
వేణికాభూషణీభూతహస్తాంగులీ రంగదుద్యన్నఖాగ్రప్రభా
కోరకై ర్న్యాపురస్థాపితోద్దీపితాంభోజరాగాంశుసంబంధ
పాణింధమానంద్యపాదద్వయీఘాత భుగ్నక్షమాగర్భ
నిర్భేదనిర్యత్ననిర్యత్ఫణాభృ త్ఫణారత్నదీప్తిప్రవాహైః
స్వలీలభ్రమీవిభ్ర మాదభ్రవేగార్భటీజర్ఝరీ భూతనిర్మాల్యనీ
లోత్పలాంచద్ధళవ్యూహ శంకాకరప్రస్ఫుటద్వారివాహైః
ర్నిశారంభగంభీరసంరంభశుంభన్మహాతాండవై స్త్వం పరి
క్రీడసే స్వానుకంపారసై స్సేవకాన్ ధన్యతాం ప్రాపయన్
తేజసా పద్మజాతాండకాండం సముద్దీపయన్ వర్తసే విశ్వ
నిర్మాణరక్షాపరీహారధారాత్రిరూపా విరూపాక్ష మాం రక్ష
రక్ష త్రయీమూలవేదీవిహారిన్ పురధ్వంసక త్వద్వినా
నిస్తులం వస్తు నాస్తి త్రిలోకాంతరే పర్వతాధీశకన్యాసమా
శ్లిష్టమూర్తే జగద్గీతపూర్తే నమస్తే నమస్తే." 78

వ. అని వెండియు: 79

క. "శరణాగతు ననుఁ బ్రోవుము
చరణానతభక్తలోకజనిసంహరణా,
తరుణార్కకోటిజైత్ర
స్ఫురణా, సంఘటితసకలభువనావరణా. 80

తరల. తనువు విప్రున కిత్తు నంటి సుధాకరార్ధకిరీట; య
య్యనఘమూర్తియె లేఁ డొకో!" యన నమ్మహేశుఁడు
పల్కు: "నీ-మనసుమర్మ మెఱుంగుకోరిక మాయ వన్నితి;

నిన్నుఁ బోలినవదాన్యవతంస మెవ్వల లేఁడు సర్వజగం
బులన్. 81

చ. సతి పతిచిత్తముం దెలిసి సత్యము నిత్యము ధర్మమర్మసం
గతి గతి సజ్జనోపకృతికల్పన కల్పనగంబు గా మనో
గతిఁ బ్రతివాసరంబుఁ గని గణ్యముఁ బుణ్యముఁ జెందు నీగు
ణోన్నతి నతిలోకధైర్యఘటనం దగు నీసతియందమంద మై.

శివుఁ డంశుమంతుని వదాన్యతకు మెచ్చి వరములొసఁగుట.

శా. లోభావేశము లేశముం జొరఁదు నీలో; నీకు నీడా ధరి
త్రీభర్తల్ పదివేవురైన? ధరణీదేవేంద్ర, యిత్తుం ద్వదీ
యాభీష్టంబు నెఱుంగఁ బల్కు."మన సాంద్రానందని స్తంద్రచి
త్తాభోగంబున వెండియుఁ వినతుఁడై యారాజకోటీరమున్:

క. "వర మిచ్చె దేని గౌరీ
వర, యిమ్ము కుమారు నొకని వైరిధరిత్రీ
వరుల జయింపఁ గులోన్నతి
భరియింప సమర్థుఁ డైనబాహుబలాఢ్యున్." 84

తే. అనుడు: "నాయంతబలవంతుఁ డగుతనూజుఁ
డుద్భవముఁ జెందు; నీదుమహోగ్రతపము
ఫలము సామాన్యమే! యిత్తు పాశుపతమ
హాస్త్రరాజంబుఁ బిదప నిమ్మాత్మజునకు". 85

వ. అని తత్ప్రభావం బానతిచ్చి సమంత్రకంబుగా ననుగ్ర
హించె; నయ్యవసరంబున: 86

శా. చేరన్ రమ్మని పెండ్లినాఁడు దనకున్ శీతాద్రి యేచంద్రికా
పారంబున్ గమకించుబన్న సరమున్ సంప్రీతిమై నిచ్చె నా

హారంబుల్ వలకేల నంది దరహాసాంకూరముల్ చిమ్ముచున్
గౌరీదేవి యొసంగె భానుమతికిన్ గల్యాణసంసిద్ధికిన్. 87

క. ఆరాజకులవతంసము
నీరీతిఁ గృతార్థుఁ జేసి యీశ్వరుఁ డరిగెన్
గౌరియుఁ బ్రముఖులు నిర్జర
వారంబులుఁ గొల్వ. నిజనివాసంబునకున్. 88

వ. అయ్యవసరంబున: 89

{ శివునివలన వరములు వడసి యంశుమంతుఁడు భార్యాసహితుఁడయి అయోధ్యకేతెంచుట }

మ. నయదేవుండు వసిష్ఠునాజ్ఞ రయసన్నాహాగ్రనానా మహా
హయధట్టంబు రథంబు నొక్కటి నయోధ్యాపట్టిణో త్తీర్ణుఁడై
ప్రియబుద్ధిం గొనితేర నెక్కి ధరణీబింబాధరాభర్త ని
త్యయశశ్శ్రీవిభుఁ డేఁగి యిచ్చె నిజబాహాపీఠి భూభామకున్.

భానుమతీగర్భవర్ణనము

క. నెలలు చనఁ గొన్ని యంతట
నెలపొడఁ పిడె వంగడంపునీరధి కనఁగా
నెలతాల్పువరసమున్నతి
నెల మసలెన్ భానుమతికి నిర్మలమతికిన్. 91

క. మున్నింటికటికిచీఁకటి
మన్నెమునకు వీడుకోలుమం దిది యనఁగా
నున్ననిచెక్కుల ధవళిమ
చెన్నొందెం గప్పురంబు చిలికినజాడన్. 92

క. జక్కవలముక్కుతుదలం
జిక్కిన యుత్పలదళంబుచిదరలఁగతిఁ జ

స్మృక్కల నలు పెక్కను వెలి
నిక్కెడుశృంగారరసమునిగ్గులొ యనఁగన్. 93

క. చూలు వహించినబేడిస
మీలో యన గర్భభరము మెలఁకువఁ జెలికిన్
దేలగిలఁ జొచ్చెఁ గన్నులు
నీలకనీనికలఁ గలికినిగ్గులు బెళుకన్. 94

క. తొలుచూలుతేఁటి వ్రాలుడు
నెలప్రాయపుఁదీఁగ యించు కించుక గదలెన్
జలజల రాలెడుపువ్వులు
బలెఁ జిట్టుము లుప్పతిల్లెఁ బంకజముఖికిన్. 95

క. మటుమాయపునెన్నడుమున్
బుటపుట గాఁ దొడఁగె రాచపొలఁతికి నౌరా
నిటలాక్షునిఁ బూజించుట
నిటువంటివి నడుములేము లేలా వచ్చున్? 96

తే. లేమి నెడఁబాయుటే కాదుపో మృగాక్షి
కౌను బలిబంధనస్ఫూర్తిఁ గాంచెఁ బూర్తి
వింత, గోరంత యైనయవ్విష్ణుపదము
మీఁదిపాదవుల బడి నాక్రమించుజాడ. 97

క. అడుగులకు మడుఁగు లొత్తుచు
నుడిగంబులు చేయఁ జెలువ లుస్సు రటంచున్
వడ దాఁకి యంచ నడచిన
వడువునఁ జెలి నడచు మేను వడవడ వడఁకన్. 98

తే. నిలుచు నొక్కొక్కవేళ యీనీలవేణి
యొప్పుగృహరత్నగేహాళు లూఁత గొనుచు

లలితపల్లవశాఖావలంబనమున
బాగుమీఱినపరువంపుఁదీఁగఁ బోలె. 99

సీ. సర్వసర్వంసహాచక్రంబు విక్రమ
క్రీడమై మూఁపునఁ గీలుకొల్ప,
నృపకోటికోటీరనిచితరత్నప్రభాం
కురదీపితాంఘ్రియై కొలువు నిలువ,
దేవేంద్రవిభవబందిగ్రాహిదైత్యేంద్ర
యోధయూథంబుల నుక్కడంప,
నాతతౌదార్యసంభూతనూతనకీర్తిఁ
బన్ని మింటికి వింతవన్నె యొసఁగ,
తే. వాహవారణవరరథారోహణముల
బిరుదు బీరంబు గరువంబుఁ బెంపు సొంపు
నిచ్చఁ గ్రొత్తలుగాఁ జేయ నీలవేణి
గాంచుఁ గనుమూసి రాజులు గనెడుకలలు. 100

దిలీపుని జననము

చ. నెల లట తొమ్మిదిం జనుడు నీరజలోచన తూర్పుదిక్కు క్రొ
న్నెల బలె, భూతలోదరి మణిం బలెఁ, బ్రాగ్గిరికోన
సూర్యునిం - బలె, విరిదండ తావి బలెఁ, బల్కు గభీరత
రార్థయోగముం - బలె, నలవేల్పుఁదీఁగె కుసుమంబు బలెక్
సుతుఁ గాంచె నొక్కరున్. 101

తే. కైటభారాతియెద నున్నకౌస్తుభంబు
పోల్కిఁ బురుటింటి కొకవింతపొల్పుఁ దెల్పు
ప్రియకుమారకుమోముజాబిల్లిఁ జూచి
పొదలె సుగుణాంబురాశి యాభూవిభుండు. 102

వ. అప్పుడు: 103

క. ఇలఁ దేఁడోసంగె ద్విజులకు
జలజాతమరందబిందు సందోహనిరా
కులజలవేణీగర్భిత
కలమేక్షురసాలవితతి గలగ్రామములన్. 104

ఉ. అంత నరుంధతీవిభుఁ డహర్పతిసన్నిభుఁ డేగుదెంచి భూ
కాంతునిఁ జూచి: "శంభువరగౌరవ మార, మరీచిమత్కులం
బింతట నిల్చెఁ; నీవు కృతకృత్యుఁడ వైతి." వటంచు నెమ్మదిన్
సంతస మంది చేసె నృపజాతునకుం దగుజాతకర్మముల్. 105

క. గగనసరస్వతి యప్పుడు:
"పొగ డొందు దిలీపుఁ డనఁగ భూతేశవర
ద్విగుణితతేజుం డితఁ." డని
జగ మెల్ల నెఱుంగఁ బల్కె జలధరఫణితిన్. 106

క. అవ్విబుధవరులు గురిసిరి
పువ్వులజడివాన తావి బుగులుకొనంగా
మవ్వంపుఁగమ్మదేనియ
తువ్వరతండమున కళులు తొకతొక లాడన్. 107

వ. ఆసమయంబున: 108

సీ. హంసీగరుత్కంపితాబ్జమధ్యంబున
వ్రాలుజక్కవరాచవలఁతి యనఁగ,
మందమరున్నటన్మంజువల్లులక్రేవఁ
జిగురుజొంపంబులోఁ జిలుక యనఁగ,
నడచుమాపటిసంజనడుచక్కిఁ గళలఁ దీం
డ్రించునూతనచంద్రరేఖ యనఁగ,

బహుళరత్నరోచులు పైఁ గ్రమ్ముకలశాబ్ధి
తెరలలోఁ బవడంపుఁదీవె యనఁగ,

తే. నరుణచేలావకుంఠితం బైనపల్ల
[illegible] వహింపంగ వేలుపుఁబూవుబోఁడు
లమరవల్లభునగరివా రరుగుదెంచి
రర్భకునిఁ జూడ రాజశుద్ధాంతమునకు. 109

ఉ. రాజకుమారుఁ జూచి సురరాజవధూమణి విద్రుమాంకుర
శ్రీజనకంబులై వెలయుచేతులవ్రేళ్లఁ దవిల్చె దానవి
ద్యాజిత మైనదివ్యమణి దప్పక యొప్పన సేయుజాడ ది
గ్రాజివిరాజితచ్ఛవిధురంధరతత్కలితోర్మికావళిన్. 110

ఉ. నీలపురావిరేక మణినిర్మిత మూపులిగోరు ముత్తెపుం
దాళి విడూరజాతములతాయెతు లుజ్జ్వలపుష్యరాగసం
కీలితకంకణంబులును గిల్కులపచ్చలనూపురంబు వ
జ్రాలు ఘటించుకాంచియు నొసంగిరి తక్కినవేల్పుటింతులున్.

వ. ఇవ్విధంబున: 112

క. కట్టంగ నిచ్చి సురపతి
పట్టమహాదేవి పల్కు భానుమతిని: "నీ
పట్టిం గనుఁగొంటిని; దొలు
పుట్టువుపుణ్యములు నేఁడె పో ఫలియించెన్. 113

ఉ. అంతతపంబు చేసి త్రిపురాంతకు నంతకవైరిఁ బార్వతీ
కాంతునిఁ గాంచుకాన్పు తగుకాన్పునకు న్నెలవయ్యె నీకు;
నీ-వంతుకు వాసికిన్ సవతు వత్తురె మెత్తురె నేఁడు గాక ము
న్నంతలు రాజు! లిం కినకులాధిపతుల్ సురలోకసంశ్రితుల్.

క. కన్నులు గలిగినఫల మిా
చిన్నం గనుఁగొంటిఁ; "గంటి చేయనిచెలిమిన్
మన్నింపు మింద్రు" నని యీా
యన్నం బోధింపుమిా, దయామయహృదయా! 115

చ. ప్రతినరపాలబాలికలు పాదసరోరుహసేవ సేయఁగా
సుతుఁడు శతాశ్వమేధములు శూరతమై నొనరించుచుండఁ
గాఁ- (బతి సకలోర్విభారమును బాహువున న్వహియించి
యుండఁగా-) క్షితిసయిదోడవై కలిమిచేడియతో మనుచుం
డు నెచ్చెలీ!" 116

క. అనవుడు వినయావనతం
బునుఁ గుచభరనతము నైనపూర్వాంగముతో
జనవల్లభవల్లభ: "యో
వనితాజనతామతల్లి, వల దీమాటల్. 117

ఉ మానియమంబు మాతపము మాయుపచారము నెంత? భక్త
ర- క్షానిరతుండు శంకరుఁ డకారణబాంధవుఁ డిచ్చెఁ గాక
మా- కీనిసువుఁ! దిగీశశరదిందుముఖీజనవంద్యమాన, యీా
సూనుఁడు మిాజయంతుఁడును జోడు సుమిా భవదీయ
రక్షకున్. 118

తే. "సురకిరీటాగ్రమణికాంతిచుంబితాంఘ్రి
పంకజుం డైనజంభారిపద్మనయన
యింటి కేతెంచె." ననుకీర్తి యిదియ మాకుఁ
జాలు; మావంటిపుణ్యు లీజగతిఁ గలరె!" 119

వ. అని సగౌరవంబును సప్రమోదంబును సగంభీరార్థంబునుం
గాఁ బలికి పురందరనితంబినీతిలకంబు నుచితపూజావిశేషం

బులం బరితోషంబు నొందఁ జేసి నాకంబునకుం బనిచెఁ; దదనంతరంబ: 120

తే. ప్రతిపదిందుండు నవనవోదితలఁ గళలఁ
దేజ మొందినయోజ నారాజసూతి
దాదు లొనరించునుపచారభేదగతుల
నతులనిస్తంద్రరుచిసాంద్రుఁ డగుచుఁ బొదలె. 121

దిలీపునిబాల్యము

మ. జలకంబుం దగఁ గూర్చి నెన్నుదుట రక్షాకాంక్షఁ బాదాం
గుళీ- స్థలమృత్స్నతిలకంబు దీర్చి రుచులం దట్టాడువజ్రం
పుటు-య్యాలపైఁ బొత్తుల నుంచి "యోకుధరకన్యాధీశ ది
వ్యాంశపే- శలమూర్తీ నిదురింపవే!" యను సుతుం జంద్రా
స్య జోకొట్టుచున్. 122

వ. అక్కుమారుండు క్రమక్రమంబున: 123

క. తవి దాడ నేర్చెఁ; జెవులకు
జవులుగఁ బలుకంగ నేర్చెఁ; జరణాభరణా
రవములు గలుగలుగల్లన
లివలివ నడు గిడఁగ నేర్చె లీలాగతులన్. 124

క. చక్కెరలో, నిండువెన్నెల
యుక్కెరలో, యమృతధారలో- యివి యనఁగాఁ
జొక్కించు; నెంచఁ దరమా
యక్కొమరునితొక్కుఁబల్కు లతిమధురంబుల్! 125

సీ. అర్జునచ్ఛవి యశం బలరఁ గర్ణాకృష్టి
దర్పించి తెచ్చు వేదండసమితిఁ,

దగఁ జైత్రమహిమ యుద్ధతకేసరావలం
బనలీలఁ గొనివచ్చుఁ గినిసి హరుల,
భువనాధికఖ్యాతి వివిధప్రవాళాగ్ర
ధృతి నీడ్చి యలయించు ద్విజకులంబు,
రాజతేజమున విభ్రాజిపఙ్క్తిఁ
దెరలించి కదలించు శరభచయము
తే. బోడికలఁ గూడి శైశవక్రీడఁ దగిలి
ధరణిధవనందనుండు కాంతారఘోర
శైలభీకరగహ్వరస్థలులు సొచ్చి
వాలుమగఁటిమి నాఖేటకేలి కేఁగి. 126

క. తిండాడువైరివీరులఁ
జెండాడుట యేమి దొడ్డు? చెండాడుగతిన్
గొండపయిఁ గొండ గూలఁగఁ
గొండికపాయమున నీటుకోల న్మీటున్. 127

సీ. కాకపక్షచ్ఛాయఁ గబళించునున్నచ్చ
సవరణ బర్హిపింఛంబు గాఁగ,
నరవిందహితుఁ బోలుకురువిందములతాళి
యభినవం బైనకౌస్తుభము గాఁగఁ,
గటి నున్న లేఁతచెంగావిదుప్పటము దు
ప్పటి మించుహాన్నాణిపట్టు గాఁగ,
నురమునఁ గీలించుమరకతమాణిక్య
హారవల్లరి వైజయంతి గాఁగ,
తే. భూమిభామినిపై నిండుఁబ్రేమ మనసు
నెనయఁ బాయక విహరించుననువు దలఁచి

యవతరించిన కృష్ణుఁడో యనఁగ బాల
కేలి వర్తించు నమ్మహీపాలసుతుఁడు. 128

వ. అంత: 129

## దిలీపునియౌవనము

క. పొదవినయొఱ చించుక పైఁ
బొదలినమరుచేతిహేతిపొగరో యనఁగా
మొదలిటికొండికప్రాయము
వదలిచి జవ్వనము రాచవానిం జేరెన్. 130

మ.తనుకల్పద్రుమకోరకోదయము కాంతావీక్షణజ్యోత్స్నమా
తననానావిధవిభ్రమద్విరదగంధప్రౌఢిహృద్యాభుజా
ధనురారోపితగంధితేతరవిచిత్రక్రూరనారాచ మ
య్యినవంశాధిపుఁ జెందె యౌవనభరం బెంతే విలాసం
బునన్. 131

సీ. తేఁటులో నీలంపుపేటులో యిరులక
న్నాటులో యనఁ గురుల్ మబ్బు గవిసె;
తమ్ములో మరునిక్రొత్తమ్ములో సిరులనె
త్తమ్ములో యనఁగ నేత్రములు దనరె;
వాటమో హేమకవాటమో జయలక్ష్మి
కూటమో యన మించె మేటియురము;
చిందమో లావణ్యకందమో మోహనా
నందమో యన గ్రీవ నాణె మయ్యెఁ;
తే. బలుకుకప్రంపుఁబలుకులు పలుకు లయ్యె;
పొలపువలగాజుతూపులు చూపు లయ్యె;

గంధగజరాజగమనంబు గమన మయ్యె;
సరసయౌవనమహిమ రాజన్యునకును. 132

వ. అంత నొక్కనాఁ డయ్యంశుమంతుండు: 133

అంశుమంతుఁడు దిలీపుని పట్టముఁ గట్టుకొన నొప్పించుట

శా. ఈరీతిన్ నవయౌవనోదయముచే నిం పొందుతత్పౌత్త్రునా
కారంబున్ నిజవార్ధకోద్ధతియుఁ జక్కం జూచుచున్ నిండు
గొ-ల్వై రప్పించి కుమారకుం బలుకు: "నన్నా నిన్నుఁ
గన్నాఁడ; నా-కేరాజుల్ సరి? యొక్కమాట వినుమీ;
యిట్టట్టు నాఁ బోకుమీ! 134

క. కడు ముదిసినాఁడ; నోపం
బుడమి భరింపంగ; రాజపుంగవులకు నీ
యొడ లోమఁ దగునె కలనం
బడుటయు యోగమున నచ్చు పడుటయుఁ దక్కన్. 135

క. కదలు రదనములు; పదములు
గుదివడు; జవసత్వ మింకుఁ; గొదవడుఁ జూపుల్;
వదనంబు స్రుక్కుఁ జిక్కున్;
ముదిమి సుమీ రోఁత యాస ముదియక యున్నన్. 136

శా. అర్ణోరాశిపరీతభూభువనచక్రాభోగమున్ విక్రమో
దీర్ణత్వద్భుజబాహుదండపదవిం దేజంబునన్ బూనుమా
కర్ణాకర్ణి నెఱింగి శత్రునృపతుల్ గాఢాంధకారచ్ఛటా
కీర్ణస్వర్ణకుభృద్గుహాంతరములన్ ఖిన్నాత్ములై డాఁగఁగన్."

తే. అనుఁడు గుండె దిగాలన నధిపసుతుఁడు
తండ్రిఁ బెడఁబాయఁ జాలనితలఁపుకలిమి

రిచ్చ వడి వేఁడియూర్పులు పెచ్చుపెరుగఁ
గొండవలె నుండెఁ గదలక కొంతతడవు. 138

వ. అక్కుమారుండు తండ్రిం గనుంగొని కృతాంజలియై: 139

క. "గిరి పూను మేటిభారము
కరి పూనం గలదె రాజకంఠీరవ! నీ
వరబాహుపరీతమహీ
భర మే భరియింపఁ గలనె పసిబాలుండన్! 140

ఉ. నీభుజకల్పభూరుహమునీడ వసించెదఁ జల్లనై; ధరి
త్రీభరణంబు నొల్ల; భవదీయపదాంబుజసేవయే మహా
ప్రాభవ మింద్రవైభవము భాగ్యసమృద్ధి యగణ్యపుణ్యశో
భాభృతి ముఖ్యసౌఖ్యములప్రాపు నగుఁ మఱే యున్న
వేటికిన్. 141

క. జనకుఁడు సుఖియై యుండఁగ
జనయిత్రియు జీవనంబు సకలము నరయఁగ
మనుచున్న పుత్రకుని యా
జననము సఫలంబు గాదె జననాథమణీ!" 142

క. అని విన్నవించుతనయుం
దనకౌఁగిటఁ జిక్క నొక్కి: "తనయా, వినయా
వనతాంగ, మీఱ నుచితమె
జనకునివాక్యక్రమంబు సత్పుత్రులకున్!" 143

వ. అనుటయు: 144

తే. తగిలి వెనువెంటఁ జనుదెంచుతగరునకు ని
జాగ్రమున నున్ననూతికి నలికినట్లు

తండ్రి నెడఁబాయఁ జాలమిఁ దగ్గురూప
దేశలఘుఘనభయమునఁ దెరలి యతఁడు. 145

క. ఎదు రాడక, కించిన్నత
వదనుం డగుటయు నృపాలవరుఁడు నిజాంత
స్సదనమున కరిగె నిత్యా
భ్యుదయం బగుపదవిఁ దనయు నునుచుమనీషన్. 146

వ. అంతం బ్రొద్దు చాల వాలుటయు నరుంధతీకాంతుండు మహీకాంతకుమారుకేలు గేలం గీలించి నిజనివాసంబునకుం జని సాయంసంధ్యాదికృత్యంబులు నిర్వర్తించి యొక్క వివిక్త స్థలంబున విధుకాంతశిలామంటపాభ్యంతరంబునం గూర్చుండి యక్కుమారసింహంబు నుచితపీఠాసీనుం గాఁ జేసి యిట్లనియె: 147

వసిష్ఠుఁడు దిలీపున కుపదేశించినరాజనీతి

క. "పరమర్మము లెఱుఁగుచు నిజ
కరణీయము లొరుల నెఱుఁగఁ గాఁ జేయక, మం
త్రరహస్యపరతఁ గార్యము
లరసినవిభుఁ డేలు సాగరావృతధరణిన్. 148

క. విరితేనియ యళి గ్రోలిన
వెరవునఁ బ్రజ నొవ్వకుండ విభవముకొఱకై
యరి గొంచుఁ, బోర నెదిరిన
యరి నొంచినరాచవారి కబ్బు శుభంబుల్. 149

క. కరభూభృద్గణములచే
వెరయుచుఁ గువలయము మిగులఁ బ్రియ మందఁగ స

త్పరిచయము గలిగి మిహికా
కరుగతి మండలము నేలఁ గాఁ దగుఁ బతికిన్. 150

క. కోపింపక ప్రజ వెఱవదు;
కోపంబే పూనె నేనిఁ గ్రూరత్వ మగున్;
గోపప్రసాదములఁ దగు
రూపున నెఱపంగ వలయు రూఢవివేకా! 151

క. దళములు గూర్చుచు సుమనః
ఫలదుండై మూలబలము భాసిల ద్విజమం
డలమునకు నీడయై భూ
తలపతి మనవలయుఁ గల్పతరువును బోలెన్. 152

ఆ. పూని సామభేదదానదండము లనఁ
దగునుపాయవితతిఁ దటి యెఱింగి
శత్రువరులయందు సమకూర్పఁ దగుఁ గాని
సాహసంబు సేయఁ జనదు పతికి. 153

క. కొండంత కార్యగతికిం
బెండుపడక ధైర్యమహిమ బీరము వెరపున్
దండితనంబునుఁ గలభూ
మండలపతి జయముఁ గాంచు మనువంశనిధీ! 154

క. జలజాసనలిఖితము బలె
ఫలకాలమునంద కానఁబడఁ జేయఁ దగున్
దలఁచినతలఁ పంతకమును
వెలివడకుండంగ మనుజవిభుఁ డోవత్సా! 155

క. 'శర' ణన్న వారిఁ గాచుట;
దురమున నెదిరించువారిఁ ద్రుంచుట; యివి పో

పరమపవిత్రగుణంబులు
కరుణయు బాహాబలంబు గణనకు నెక్కన్. 156

క. కౌండీనిమాట నిజ మని
దండింపఁగఁ దగదు రాజు ధరణీజనులన్
నిందుమదిఁ గల్లనిజములు
రెండును సమబుద్ధి నేర్పరింపక మొదలన్. 157

క. ధన మిచ్చిన నీనీ; కడుఁ
జన వీ ననుచితము క్రూరచరితుల; కవనీ
జనులు తదాచరణంబున
మన సెడసిన భద్రదంబె మనుజేంద్రునకున్! 158

క. కడు నమ్మినయాప్తులకుం
గడిభూము లొసంగి యవలిగడిరాజుల క
ట్టడఁ దెలిసి గూఢతరముగ
బడిబడి నుత్తరము లంపఁ బంపిడఁగఁ దగున్. 159

మ. ఉపధాసిద్ధుఁ ద్రివర్గశోభితు శుభోద్యోగిన్ నియోగిం
గృపా-విపులస్వాంతు నితాంతశాంతు స్వమనోవిశ్రాంతు న
శ్రాంతు జ్ఞా-నపరున్ దానగురున్ బ్రసిద్ధగుణసంతానున్
సమానున్ గళా-నిపుణున్ మంత్రిగఁ జేసి భూపతి గనున్
నిర్నిద్రసౌఖ్యోన్నతిన్. 160

చ. కవులు బుధాగ్రగణ్యులును గాణలుఁ బాఠకులున్ మహీ?
దివిజులు మంత్రులున్ హితులు ధీరులు శూరులు వైద్య
లంగనా-నివహముఁ గొల్వఁ గొల్వగుచు నిండినవేడ్క
గభీరుఁడై మహీ-ధవుఁ డురురత్నసౌధమునఁ దా వసి
యించుట యొప్పు నెప్పుడున్. 161

ఉ. బ్రాహ్మణదేవభూములఁ గృపం బరికింపుచు నుల్లసద్భుజా
జిహ్మగవిక్రమక్రమవిశేషమునన్ మహిఁ యేలె నేని యే?
బ్రహ్మము దేవతానగరపద్మముఖీజనగీతనిర్జిత
బ్రహ్మవధూశరీరరుచిభాసియశోవిభవంబు తేనికిన్. 162

ఉ. కోటలు మేటివప్రములుఁ గోటలుఁ గొండలు ధాన్యముల్
వడిన్-బోటరులైనవీరభటపుంగవులుం గజముల్ రథంబు
లున్-ఘోటకసంఘముల్ నిశితఘోరతరాయుధకేతుయంత్ర
సం-ఘాటముఁ గల్గ నాత్మకటకంబు మహీధవుఁ డేలఁగాఁ
దగున్. 163

క. శీతాంశుమౌళివరమున
నాతండ్రీ, జనన మొందినాఁడవు నీకున్
రీతులు నీతులుఁ గఱపఁగ
మాతరమా; వత్సలత్వమహిమ యిది సుమీ!" 164

చ. అనవుడు లేచి మ్రొక్కి వినయమ్ము భయమ్ముఁ బ్రియమ్ము
నెమ్మదిన్-బెనఁగొనఁ: "నోమునీంద్ర, కృపపెంపున మీ రిటు
లాడ నేల? నే-నన నొకవింత నయ్యా! భవదంఘ్రిరజోలవ
లబ్ధి నద్భుతం -బినకులసార్వభౌములు వహింతురు సర్వ
గుణోదయోన్నతిన్." 165

వ. అనినం బ్రమోదమేదురస్వాంతుండై మునివివస్వంతుండు:
"రేపు శుభముహూర్తంబు; పట్టాభిషేకశుభమహోదయం
బునఁ గృతార్థుండవయ్యెద." వని దీవించి యొక్కవివిక్త
స్థలంబునఁ గుశస్థండిలశయనంబున వసియించుటకు నాజ్ఞా
పించి పురశృంగారాది కర్తవ్యకల్పనానియోగంబునకు

నంశుమంతు నెచ్చరించి శుభదేవతా ప్రార్థనాధీనమానసుం
డై యుండె నయ్యవసరంబున: 166

## — పురాలంకరణక్రమము —

తే. 'నిలుచు సింహాసనంబున నేఁడు వాఁడి
తేజ మిగురింప నీరీతి రాజసూతి.'
యనుచు నెఱిఁగింప వచ్చెనో యనఁగఁ దూర్పు
ధరణిధరమునఁ గనుపట్టెఁ గిరణమాలి. 167

వ. అప్పుడు: 168

మహాస్రగ్ధర. కదళీస్తంభోరులక్ష్మిం గనకముకురరంగత్క
పోలల సుగంధా-భ్యుదితోద్యద్ధూపధూమాంబుదనిభ
చికురం బూర్ణకుంభస్తనశ్రీ -మదమత్తేభేంద్రయానల మధు
రకుసుమదామచ్ఛటాహస్త ధాత్రీ-త్రిదశేంద్రుం డాదరిం
చెల బ్రియమునఁ బురనారీమణి న్నిండుచూడ్కిన్. 169

మ. మృగనాభిద్రవగోముఖాకలనచే మించుల్ పిసాళింప నిం
పగుముక్తామణిరంగవల్లికలచే నంభోజరాగచ్ఛటా
స్థగితావారణతోరణాంకములచే సర్వంబు శాసించు వే
ల్పుగమిం గ్రొత్తగఁ గన్నతల్లికరణిం బొల్పొందె వీ డెంత
యున్. 170

సీ. ఎట నాలకించిన హిమశైలకన్యకా
కమనీయకల్యాణగానరవము;
లేచక్కి వినిన లీలాచలన్నర్తకీ
చరణభూషణఝుళఝుళవిరావ;
మేవంకఁ జెవి దార్చెనా విప్రసందోహ
మోదకరాసాద వేదనాద;

మెచ్చోటఁ దెలిసిన హృద్యమాద్యద్వాద్య
గంభీరనిర్ఘోషకలకలంబు,
తే. లెచట నిలిచిన గాయకప్రచురవిచల
దబలవీణాసముత్కర్షహర్షవేగ
కారిసముచితనిక్వాణగౌరవములు
సరసశృంగారరమఁ బొల్పుపురవరమున. 171

దిలీపునిపట్టాభిషేకము

వ. అంత నయ్యంశుమంతుండు సమయోచితకృత్యంబు లాచ
రించి యంతఃపురంబున కరిగి భానుమతియుం దాను దిలీపకు
మారునకు శుభస్నానపూర్వకంబుగా నలంకరణంబు నాచరిం
పించి పశుపతిదత్తం బగుపాశుపతంబు సమంత్రకంబుగా
నుపదేశించి గంధవహాదిశుభనిమిత్తంబులకుం బ్రమోదంబు
నొందుచు రజనీదిఙ్ముఖంబులు ప్రతిపదిందు నమందం బగు
పొడుపుగుబ్బలి నిడుచందంబునం బుండరీక చర్మాస్తరణ
విస్తృతంబగుభద్రపీఠంబున నాసీనుం జేసి; 172

క. పట్టము గట్టిరి యానృపు
పట్టికి నెన్నుదుట భువనభరణశ్రీకిఁ
నెట్టన బ్రహ్మ యొసంగిన
పట్ట సుమీ యనుచు జగము ప్రణుతింపంగన్. 173

క. స్థండిలపూజితమును రుచి
దండితశశిమండలంబు ధారాళసుధా
కాండము నగుశంఖము ముని
మండలవిభుఁ డెత్తి యిచ్చె మనుజేంద్రునకున్. 174

తే. అంశుమంతుండు నమ్మునియనుమతిం బ్రి
యాసమేతంబు గాఁ దగునేస వెట్టి
జలజజలధార కోటీరవలభి జాఱ
హర్షసంపద నభిషేక మాచరించి. 175

తే. శిఖరనిర్గతగంగాంబుసిక్తతుహిన
కుధరమో యనఁ బొల్చునక్కొడుకుఁ జూచి
తాము నారీతిఁ బొల్చుచందమున హర్ష
తోయధారలఁ దొప్పఁగఁ దోఁగి రపుడు. 176

క. కులగురు వైనవసిష్ఠుఁడు
జల మాన్నృపుకేల నండి: "జలనిధివేలా
వలయితమహి నేలుము నీ
వలఘుమతీ!" యనుచుఁ జేసె నభిషేకంబున్. 177

క. రా జొకరుఁడు రాజునకుఁ
రాజితముగఁ దాల్చెఁ బాండురచ్ఛత్రంబుఁ
'రా జితఁడె కాక రే నిఁక
రాజనె?' యని కొల్వ వచ్చురాజో యనఁగన్. 178

క. అనితరబందీకృతరిపు
జనపాలవిశాలకీర్తి చంద్రిక లనఁగా
మనుజేశ్వరు లిద్దఱు నృప
తనయునకుం జామరములు దాల్చిరి ప్రీతిన్. 179

క. మేదురవిప్రజనాశీ
ర్వాదంబులఁ బుణ్యగానవాదముల మహా
వాదిత్రనాదముల జయ
నాదంబులఁ దగియె జగము నాదమయంబై. 180

వ. మఱియుం బ్రసిద్ధులును వయోవృద్ధులు నగురాజు లారాజ
నందనున కభిషేక మాచరించి; రంత నయ్యంశుమంతుండు
పౌరజానపదప్రధానసామంతసమూహంబులం జూచి యి
ట్లనియె: 181

క. "ఇతఁ డధిపతి మీ కిందఱ;
కితనిఁ ననుఁగాఁ దలంచి యీతనియాజ్ఞన్
మితిమీఱఁ దగ దొకప్పుడు;
నితఁ డేకపురంబు వోలె నేలు ధరిత్రిన్." 182

క. అని యానతిచ్చి తనయుం
గనుఁగొని "రవివంశజలధికౌస్తుభమణి వై
మనుమనుజనాథుకై వడి
మను." మని దీవించి భానుమతియుం దానున్. 183

క. గోత్రగురునాథుననుమతి
ధాత్రీశుఁడు పురము వెడలి తప మొనరింపన్
గోత్రవనభూమి కేఁగెన్;
మిత్రాన్వయనృపుల కిదియ మేర తలంపన్. 184

క. ఈలీల భూమిభారముఁ
దాలిచి నరపాలసుతుఁడు ధరణీజనులన్
లాలించి కొలువు నాఁటికిఁ
జాలించె విభూషణములు ఝళఝళ లెసగన్. 185

ఉ. సింగపుగద్దె డిగ్గి మణిచిత్రకిరీటతటీవిలోలహ
స్తాంగుళిపల్లవంబుగ నిజాగ్రమునం గనుపట్టురాచవా
రిం గనుసన్నఁ బోఁ బనిచి ప్రీతి నమాత్యునిచేయి యూఁదిపా
దాంగదరావముల్ బెరయ నంతిపురంబున కేఁగి యచ్చటన్.

ఆ. భవనదేవతాసపర్యాదికము లైన
యుచితవిధు లొనర్చెఁ బ్రచురహర్ష
పూర్ణహృదయుఁ డతఁడు నిర్నిద్రతేజోవి
లాసజృంభణైకభాసి యగుచు. 187

క. చన్నవిసి పిదుకు మొదవులు;
చెన్నలరుం బుడమిఁబైరు; చిల్లరనేతల్
సున్న; నెల మూఁడువానలుఁ
బన్ని కురియు; జగతి కతఁడు పతి యగుట నృపా. 188

తే. జరఠరాజేంద్రభుజదండసంగమంబు
మాని భూకాంత యారాకుమారుమూఁపు
రూపుగాఁ జెందె సాయంసరోజవసతిఁ
దెగడి కల్వకు నేతెంచుతేఁటి వోలె. 189

వ. అయ్యవసరంబున: 190

క. ఏనుఁగుల హరులఁ దేరుల
మానవతీమణుల మణుల మానవనాథుల్
కానుకలు దెచ్చి కాంతురు
భానుమతీపుత్త్రు గుణవిభాసిచరిత్రున్. 191

శా. ధాటీసంభ్రమలీలమైఁ గొనియె నాధాత్రీశుఁ డుద్యద్గతిన్
లాటీకుంతలమార్గకుంకుమరజోలావణ్యసంపత్తిఁ గ
ర్నాటీసంతతవీటికారసపరిన్యస్తాధరారుణ్యమున్
భోటీసింధురసైకపాటలదృగంభోజప్రభాజాలమున్. 192

ఉ. వేడుక దానకేళిఁ బదివేలవిధమ్ముల నుబ్బి యాడుఁ బై
నూడదు పోఁచపొందు నెదు రొడ్డినవాహిని వెన్నుఁ దాఁచు, ము
న్నాడువివాద మైనఁ దగ యత్నము ముష్టినె సంఘు

టించుఁ బో-బాడబమూర్తి యాధరణిపాలునిఖడ్గము సార్థ
కాకృతిన్. 193

చ. గురుతరశక్తి దివ్యులకుఁ గోణపకోటికి యుద్ధ మైనచో
బిరుదము బీరముల్ బెరయఁ బిల్వని పేరఁట మేఁగి యచ్చటన్
సురరిపులన్ వధించి నృపసూర్యుఁడు గైకొను నాకభామినీ
తరళదృగంత కాంతిసముదంచితశోభనదీపసంహతిన్. 194

క. ధర్మయశస్సంపాదన
కర్మఠుఁ డవ్విభుఁడు యాచకస్నిగ్ధుఁ డటే!
ధర్మస్పృహుఁ డఁట, మార్గణ
శర్మస్పృహుఁ డగుట కేల సందేహింపన్? 195

ఉ. కర్బురకంధరప్రతిమగాఢపరాక్రముఁ డవ్విభుం డనిన్
దోర్బలసంపదంకురము దున్నిన లక్షలు కోటు లర్బుద
న్యర్బుదఖర్వసంఖ్యలు మహాధనరాసులు దెచ్చి యిత్తు రా
బర్బరచోళగౌళకురుబాహ్లికసింధుముఖక్షమాధిపుల్. 196

ఉ. హాళి నృపాలమౌళికర మాసురసేనలఁ గన్నచో ధను
ర్జ్యాలతికావలంబమున సాగి శ్రవోంత మొకింత చేరునాఁ
డే లలితాజిమందిర జయేందిర: "మామక కర్ణకుండల
శ్రీలు ధ్రువంబు లయ్యె." నని చింతయు వంతయు మాను
మానుగన్. 197

సీ. 'చీకిలించినకంటిసెగ చీల్చుకొని యెడ
వెడలెనో!' యని కేలఁ దడవు మృడుఁడు;
'మూల డాఁగినయౌర్వకీలి యెంతయునల్లు
కొనె నొకో!' యని వెఱఁగొనుఁ బయోధి;

'కఠినదంష్ట్రాటంకగరళాగ్ని వెలుపలఁ
బ్రబ్బెనో!' యని చూచుఁ బాఁపఱేఁడు,
'విలయార్థసంభృతోజ్జ్వలనిజప్రభలు పై
కొదవెనో!' యని చింత నొందు నినుఁడు,
తే. నాదిలీపకుమారకుఁ డవనిభార
భరణపరిణతుఁ డై దిశాధరణిపతుల
యతులభవనాటవుల నేర్చునసమతేజ
మఖిలజగ దేకమండలం బాక్రమింప. 198

క. ప్రియమున సుదర్శనుం డను
భయవిరహితబాహుశౌర్యపారీణుఁడు ధీ
నయశాలి రాచవానికి
జయమునకు నయంబు వోలె సచివుం డయ్యెన్." 199

క. అని యిట్లు రామచంద్రున
కినకులకలశాబ్ధిహర్షకృతిచంద్రునకుఁ
మునినాథుఁ డయ్యగస్త్యుఁడు
వినిపించె గభీరధీరవిశదప్రౌఢిన్. 200

శా. శ్రీవత్సాంకసమానభోగ, నృపలక్ష్మీలక్ష్మనాభాగ, వి
ద్యావైదుష్యసరోజగేహ, ధనదానాంచత్పయోవాహ, బా
హావిశ్రాంతధరావిశేష, గుణరమ్యప్రాభవోన్మేష, తే
జోవిభ్రాజితరూప, సంగరజయాస్తోకప్రతాపార్జునా. 201

క. శ్రీపులిజాలశుభాన్వయ
దీపక, బుధకల్పభూజ, దినకరతేజా,
శ్రీపతిశిలీముఖాంఘ్రి
స్థాపితనిజహృదయ, సుజనసంఘాతదయా. 202

మత్తకోకిల. కుంఠితప్రతిపక్ష, నీతినిగుంభ, సంభృతశౌర్య వై
కుంఠ మాహృదయేశ, నిర్జితకోప, ధన్యచరిత్ర, శ్రీ
కంఠకంఠహాలాహలోద్భవకాంతిజిన్నవకీర్తి, సో
త్కంఠమానస, మానసోద్భవకమ్రదేహవిరాజితా! 203

గద్యము. ఇది శ్రీమత్తెనాలిరామేశ్వరశాశ్వతకృపాకటాక్ష
లక్షితకవితాభిరామ రామయపండితకుమార సహజశైవా
చారసంపన్న ధీమదన్నయనామధేయప్రణీతంబైనసుదక్షిణా
పరిణయం బనుశృంగారకావ్యంబునందు ద్వితీయాశ్వాసము.

---

శ్రీ

# సుదక్షిణాపరిణయము

## తృతీయాశ్వాసము

శ్రీమహితవిహితవైభవ
ధామ, సుధీగణ్యపుణ్యదాక్షిణ్యగుణా
రామ రణరంగజయరఘు
రామా, ఫులిజాలధామ, రామయసోమా. 1

తే. అవధరింపు మగస్త్యసంయమివరుండు
పలుకుఁగ్రంపువలి మీఱఁ బలుకు నిట్లు
"లవలికథ దెల్పు." మనురాఘువాధినాథుఁ
గాంచి రదనాంశుచంద్రికల్ కడలుకొనఁగ. 2

వ. ఇవ్విధంబున సకలదిగంతమహీకాంతపరంపరావిజయసంపాదితసమస్తసంపత్సముదాయ నాయకత్వాధరీకృతనిలింపనాయకుండై సుధావిధాధవళమూర్తికీర్తిదాంపత్యవైభవోల్లాసియై చతుస్సముద్రముద్రిత వసుంధరాధౌరంధర్యంబున శౌర్యంబవార్యంబుగాఁ బరిపాలించుచు నొక్కనాఁడా నృపాలుండు కామినీకరకలితచామీకరదండచమరవాలవాతూలకించిదానర్తితకుంతలుండగుచుం గంఠీరవాసనాసీనుండై కొలువుండునయ్యవసరంబున. 3

### ఇంద్రుఁడు దిలీపునికడ కేతెంచుట

ఉ. వాడినమోముతోడఁ గయివ్రాలినచూపులతోడ దీనతం
గూడినపల్కుతోడ నెఱిఁ గూడనిగందపుఁబూఁతతోడఁ గీ
లూడినయందెతోడ బిగియూడిన తాలిమితోడ వచ్చెఁ గ
గ్గాడియుఁ బోలెఁ గామగవి గాఁడిఁగలయ్య నృపాలువీటికిన్.

క. వచ్చి పురగోపురస్థలి
చొచ్చుటయును జనులు చూచి: "సురనాథుఁ డయో,
వెచ్చనియూర్పులతోఁ గడు
నొచ్చి యరుగుదెంచె నిర్ధనుండో యనఁగన్. 5

ఉ. అక్కట, నూతనక్షతనవాస్రభరంబులు కన్నుదమ్ములన్
గ్రుక్కెడు తేటనీటిసెలకుర్ణవరకుంకుమరాగ యోగము
న్నెక్కొనఁ జేయ నంఘ్రిపయి నించినచూపులు దేల మిక్కిలిం
జిక్కినమేను ధాతుఝరసిక్తసురాద్రికి నూద్రిగ్నై తగన్. 6

సీ. ఐరావతగజంబు నారోహణము చేయ
నొల్లనిమాంద్యంబు పెల్లు మీఱ,
నుచ్చైశ్శ్రవస్సైంధవోత్తమారూఢుఁ డై
విహృతి సల్పనిమనోవేగ మడరఁ,
జారుచామీకరస్యందనాధ్యాసియై
పరగనిచిత్తవిభ్రమ మెలర్ప,
నాలోలమణిమయాందోళికాసీనుఁ డై
తిరుగనివక్రవైఖరి యొసంగ,
తే. నసమసంగ్రామపరిభూతుఁ డైనజాడ
ధరణిఁ గా లూఁత గొననితత్తఱముతోడ

నిఖిలనిర్జరపదలక్ష్మి నిలుచునీడ
యేఁగుదెంచెఁ ద్రిలోకంబు లేలుప్రోడ." 7

క. అని యొకనిఁ బంపఁ బదువురు
చని భానుమతీకుమారు జగదుపకారుఁ
గని విన్నవింప నతఁడుఁ
విని యచ్చెరు వంది లేచి వేగ మెలర్పన్. 8

ఉ. మంజులరత్ననూపురసమగ్రఝళంఝళ లుల్లసిల్ల సా
యంజలజాతవైరి నపరాద్రి యెదుర్కొనుకైవడిఁ బ్రభా
పుంజవిముక్తదేహు సుకపుంగవు ద్వారకవాటపీఠి దాఁ
కం జని యాదరోదయముకల్మి నెదుర్కొని మ్రొక్కఁ
బోయినన్. 9

శా. దాతృక్ష్మారుహశాఖలం దొరయుదోర్దండంబులం జాఁచి వి
ఖ్యాతిశ్రీనిధి నంశుమత్తనయు బిగ్గం గౌఁగిటం జేర్చె సం
జాతప్రీతి బలారి వైరిదనుజాసంఖ్యాకశస్త్రక్షతో
ద్ఘాతాసృగ్జలధార తద్విపులవక్షఃపీఠిఁ బెల్లంటఁగన్. 10

చ. పతియు మహేంద్రుకేలు నిజపల్లవకోమలపాణిపద్మసం
గతిఁ దెమలించి మ్రోల 'సముఖా' యని కట్టికవారు మ్రోయ
సం-భృతబహురత్ననూత్నరుచిపింజరితం బగుకొల్వుమేడ క
ద్భుతము దలిర్పఁ దోడుకొని పోయి సమున్నతపీఠి నిల్పుచున్

తే. అతసియనుమతిఁ దాను భద్రాసనమున
నధివసించి యథావిధి నర్ఘ్యపాద్య
పూజ లొనరించి పల్కు: "నోభువనవంద్య,
యీవిధంబున మీరాక కెద్ది కతము? 12

ఉ. విన్నఁదనం బిదేమి! నెఱి వీడినచిత్త మిదేమి! వేయిగ్రా
ల్గన్నులవాఁ డిదేమి! శరఘాతలనెత్తు రిదేమి! వెంబడిం
గిన్నరసిద్ధకింపురుషఖేచరవీరులు రా రిదేమి! మీ
యున్నవిధం బిదేమి! నిఖిలోన్నతశాసన, పాకశాసనా." 13

{ ఇంద్రుఁడు రత్నచూడదనుజునిచేనయిన తన భంగపాటును దిలీపుని కెఱుకపఱచుట }

చ. అనవుడు జంభవైరి హృదయంబునఁ గల్గినచింత వంత పె
ల్చన వెలికిఁ వెలార్చుక్రియ సాంద్రము దీర్ఘము నైన
యూర్పుగా-డ్పు నిగుడఁ జేసి "యోనృపతిపుంగవ, యే మని
పల్కు-వాఁడ? నేఁ-డని మొన రత్నచూడదనుజాగ్రణిపైఁ జని
మోసపోయితిన్. 14

వ. అవ్విధంబు వినుము: 15

ఉ. క్రొవ్విన వాఁడు మంథగిరికూటము పాళెము గాఁగ నుండి
లే-జవ్వను లైనయచ్చరల సాధ్యలతాంగుల యక్షకన్యలన్
నెవ్వడిఁ జూఱఁగోఁ దలఁచి నిర్జరధామముఁజుట్టు ముట్టి నన్
జివ్వకుఁ బిల్వ నంపె నిజసేవకు నొక్క-రు; నేను నల్క-తోన్;

మ. నగరక్షోభము దైత్యవాహినులసన్నాహంబు నీక్షించి యీ
డగరంపుంబగఱన్ జయింతు నని శుండాలంబులున్ మేటితే
రుగముల్ వాహనసంహతుల్ దివిజవీరుల్ సేన లై సేవ లై
ప్రగుణప్రక్రియఁ గొల్వ వెల్వడి రథప్రౌఢిన్ విజృంభించినన్.

క. వీక్షించి విఱిగిచనుక్రియ
రక్షోవల్లభుఁడు పఱచె రణభూమికి ద
వ్వాక్షేపించుచు నిర్జర
పక్షంబులు వెంట నంటఁ బౌజులుఁ దానున్. 18

ఉ. "నిక్కము, వైరి వీఁగె." నని నెమ్మది నేమఱి పోవ నంతలో
గ్రక్కున నల్కమై మరలి గంధగజంబులఁ గూల్చి తేరులం
జెక్కలు వాపి వాహములఁ జించి బదాతుల నొంచి మించె నే
దిక్కులఁ బిక్కటిల్లుభుజతేజ మెలర్ప సురారి ధీరుఁడై. 19

శా. భేరీభాంకృతు లుల్లసిల్ల దివిషద్బృందం బమందప్రతా
పారూఢస్థితి మై నెదిర్చిన రణం బన్యోన్యశస్త్రాస్త్రధా
రారశ్మిస్థగితాంబరం బరుణనీరస్వైరసంసిక్తది
గ్వారం బాయుధఘట్టనప్రభవభాస్వద్వహ్నిమై పర్వఁగన్.

సీ. దానదీక్షాధురంధరతాన్వితము లయ్యు
విబుధమార్గణకోటిసొబగు దూల్చి,
యచలితశ్రుతిసమీపచరంబు లయ్యును
విబుధధర్మప్రౌఢి వీడఁ దట్టి,
యసమాననిత్యశైత్యాసక్తిఁ దగిలియు
విబుధహృద్వీథికి వేఁడి చూపి,
సంతతసన్మార్గసంచరిష్ణువు లయ్యు
విబుధగుణశ్రేణి విరియఁజేసి,

తే. విబుధవాహిని సంగ్రామవిహృతిఁ గలఁచి
గార వెట్టె సురాహితోదారఘోర
రూపభుజలగ్నభీషణాటోపచాప
దండనిర్ముక్తకాండవేదండకులము. 21

ఉ. 'ఇత్తఱిఁ గాక బాహుబల మెన్నటి? కిస్సిరో!' యంచు నేను గ్రొ
న్నెత్తురుగంట్లతోడ రథినీవరులం బురికొల్పుకొంచుఁ బే
ఱెత్తనితాల్మి కల్మి రథ మెక్కి సురారి నెదిర్చి మద్భుజో
దాత్తధనుర్విముక్తశరధారలఁ జీరితిఁ దచ్ఛరీరమున్. 22

ఉ. వాఁడు మహోగ్రరేఖ నెఱవాఁడి లయానలకీలలీల బల్
వేఁడిమి చల్లుభల్ల మతివేగముతో నరిఁబోసి యేసె నన్
గాఁడ సురస్తటాగ్రమున గైరికనిర్ఝరధారతీరునన్
నేఁడును బోనివేదన జనింపఁగ నెత్తురు నిండ జాఱఁగన్.

క. కినుక పొరింబొరి వెలయఁగఁ
గనుదమ్ములఁ గెంపు నింపు గడలుకొనఁగఁ ద
ద్ధనువునఁ దనువున హనువునఁ
జొనిపితి మెఱుఁగంపవాన సురలు నుతింపన్. 24

ఉ. అంతటఁ బోక వీఁక నమరాహితుచేతిశరాసనంబు నిం
తింతలు చేసినం గినిసి యించుక నవ్వి కరప్రయుక్తచా
పాంతరముక్తభీషణతరాశుగధారల ముంచె నన్ను వి
క్రాంతి దలిర్ప మేరుగిరిఁ గప్పుఘనాఘనలీలఁ గ్రాలుచున్.25

క. సురవిమతనిశితబాణాం
తరితశరీరుండ నైననుఁ గానక ని
ర్జరతతి: "నిర్జరపతి, యెం
దరిగితి; వెతేఁగింపు" మనియె హాహాధ్వనులన్. 26

శా. ఆలో నవ్విబుధారి మీఱి తనతేరస్మద్రథాగ్రక్షితిం
గ్రాలన్ సారథి దోలినన్ రథము చెక్కుల్ సేసి విల్ద్రుంచి వా
హాలిం గూలిచి సూతు నొంచి నను డాయన్ వచ్చినం
జెచ్చెరన్-గీలల్ గ్రమ్మఁగఁ ద్రిప్పి వైచితి సురల్ గేడింప
నివ్వజ్రమున్. 27

వ. ఇదియును ప్రళయకాలపవమానప్రేరితపవనసఖశిఖాసఖంబు
లగుక్రొమ్మించులు నంచలమ్ముల ముంచుకొన నఖండబ్రహ్మాండ
భాండోదరాసాదంబు లగునాదంబులు విలయకాలతాండవ

ప్రచండచండీశకర ప్రహతఢక్కాఢాత్కారధిక్కరణకేలీ
కరాళంబు లై నిగుడ నిగిడి నిశ్శంకం గొంకక జంకించుతద్దాన
వాధీశ్వరుహుంకరణంబునం బొంకంబు సెడి వడిఁ దిరిగి
తిరిగినం బెరిఁగినభయంబున నాకంబునకుం బోవఁ జేవ లేక
నీకడకుం జనుదెంచితి.” నని వెండియు: 28

సీ. “పావకప్రముఖదిక్పాలకు లే మైరో ?
గంధర్వముఖ్యు లెక్కడ నడఁగిరో !
చారణాధీశు లేతీరున డాఁగిరో !
గుహ్యకస్వాము లేకొదవ గనిరో !
సిద్ధవరేణ్యు లేచిడిముడిఁ జెందిరో !
కిన్నరవర్యు లేక్రియ నలఁగిరో !
యక్షాధినాథు లేయలజడిపా లైరో !
సాధ్యప్రవీరు లెచ్చట నొదిఁగిరో !
తే. యేవిధంబున నున్నాఁడొ యిభవిభుండు !
జడిసి యేమయ్యెనొకొ యుచ్చైశ్శ్రవంబు !
స్యందనముఁ దాను మాతలి యెం దరిగెనొ !
తాఁకు తలఁపక వచ్చితి ధరణినాథ ! 29

ఉ. ఇంతకు మున్నె చూఱ గొనఁడే యమరావతి రత్నచూడుఁ!
డెం-తెంతలు పుట్టునో యకట, యంతిపురంబున ! నింక నేల
వి-క్రాంతిఁ దొఱంగి సంగరధురావిధురాకృతి వచ్చుపందకుం
గాంతలతోడిచింత మహికాంతశిఖామణి ” యంచుఁ బల్కి
నన్. 30

—◉ రత్నచూడదనుజునిపై దిలీపుని దండయాత్రా సన్నాహము. ◉—

ఉ. భానుమతీకుమారకుఁడు పల్కె మహేంద్రునిఁ జూచి దేవ,
యెవ్వానికి గెల్పు నోటమియు వచ్చు నొకానొకవేళ; దీనికై
దీనత యింత యేటికి? మదీయభుజాగ్రధనుర్విముక్తనా
నానిశితాస్త్రపాతముల నాకుల నే నవలీలఁ గాచెదన్. 31

వ. అని సమరసముత్సాహదోహలం బగుసంరంభంబున విజృంభించి కుంభినీధరగభీర వేదిప్రధానపరజనసామంతజనంబు నిరీక్షించి సహస్రాక్షునగరరక్షాదీక్షకు నాయితంబగుం డనుటయు నప్పుడు. 32

మ. హరిసంఘానయనాకులాశ్వికము నానానేకపారోహణో
త్తరళాధోరణయూధకంబు రథజాతవ్యగ్రసంపాతివీ
రరథిశ్రేష్ఠము సంగరోత్సవపరిభ్రామ్యన్మహాయోధ మై
పురి ఘూర్ణిల్లె విధూదయోన్ముఖసుధాంభోరాశిసంరంభమై.

సీ. శబ్దాంతరంబు లేశంబైన వినరాక
శేషాహికనుచూపు చెవుడు పడఁగఁ,
గులమహీధరగుహాస్థలవసత్పూర్వవై
రులు సకుటుంబులై కలఁగఁ బడఁగ,
జంతుపూరితసారసభవాండఘటి జంతు
ఫలఫలాకృతి నదె పగిలె ననఁగఁ,
బెనుబీఁట లెత్తి కాననసరిత్పంక్తితోఁ
గూర్మంబుపైఁ బృథ్వి గొండ్లికొనఁగ,
తే. సకలజగదేకభీక రాశ్చర్యధుర్య
మగుసముద్ధతి మ్రోసెఁ బ్రయాణభేరి

యవనినాథుహజారంబునందు వజ్రి
డెందమున వంత యొకకొంత డిందుపడఁగ. 34

{ మాతలి యేతెంచి జయంతుని చేనయిన రత్నచూడుని పరాజయమును నింద్రునకుఁ దెలుపుట. }

మ. 'అదె నైరావతకుంభి; యల్లదె మహేంద్రాశ్వంబు; నానా
ప్రభా-స్పదమై మాతలి దెచ్చుతే రదె; నభస్సంచారిసేనా
రవం-బదె;' యంచుం దల లెత్తి చూడఁ బురివా రవ్వేళ
నేతెంచెఁ దత్త్రిదశాధీశ్వరు సర్వసంపదలు ధాత్రీనాథుమోసా
లకున్. 35

మ. కని దౌవారికు లొండొరుం గడచి వేగం బేఁగి భూపాలనం
దను నీక్షించి యెఱుంగఁ బల్కుటయు నానావస్తుజాతంబు
దాఁ-దనియ న్వారికి నిచ్చి మాతలిసమేతం బై నయమ్మూఁకఁ
దో-డ్కొని రాఁ బంచి యుదంచితోత్సుకతమై గోత్రారిఁ
గన్పించినన్. 36

వ. జంభారియు దృగంభోజంబుల నుజ్జృంభించునంభోభరంబు
ఱెప్పల నప్పళించుచు మాతలిం దప్పక చూచుటయు
నతండు సాష్టాంగంబు గాఁ బ్రణామం బాచరించి కరంబులు
శిరంబునం గీలించి యి ట్లనియె. 37

సీ "దేవ, మీ రిట యేఁగుదెంచినపిమ్మట
నమరారి సమరాధికాగ్రహమున
నవధిధరాధరప్రాంతసంక్రాంతిదు
ర్దాంతనిరంతరధ్వాంతఘటల
యనువున దైత్యవాహినులు స్వర్గపురంబు
కోట డగ్గఱి నిరాఘాటలీలఁ

దమకించి నడచప్పరములు బల్ ప్రద్దప
రులుఁ బిరంగులు నిచ్చెనలును మొదలు

తే. వలయుసాధనములతోడఁ గలయ బెరసి
దిక్కు లగలంగ నార్పుచుఁ దెగువ చూపఁ
జండసంరంభగంభీరసమరరేఖ
లగ్గ వట్టించెఁ బరివారు బెగ్గిలంగ. 38

వ. అంతఁ జెంత వీక్షించి నగరరక్షకు లపరిక్షితంబు లగువర్పం బుల సర్పంబులుం బోలె రోఁజుచుఁ బోఁజులు గట్టి యాళువరి కట్టం గిట్టి తొట్టినకోపంబునఁ జాపంబులు వంచి యచంలనకాంచనపుంఖరింఖత్ ప్రభాభాసితంబై నభంబు విద్యోతనకరోపలాలితం బగునీలసరోరుహాంబుజంబు వహింప మెఱుంగులు కడలచెఱంగులం గ్రమ్మ నమ్ములు గుప్పించి నొప్పించియు సమగ్రాగ్రవిపాటితవియత్తలంబు లగుకొత్తలంబుల నెక్కి నిక్కి కనకశిఖరిశిఖరోపరిభాగసంగంబు లగుసింగంబుల భంగి సంగంబు లభంగసంగరోత్సాహంబునం బొంగ వసుల నిసుల నీక పొడిచియు, నహితహృదయవంచనంబుల నుదంచనంబు లగుదంచనంబుల బెండ్లువలెం దేల గుండ్లు నిగుడించియుఁ, గాలు గేలు చెక్కు ముక్కు కన్ను వెన్ను ప్రక్క పిక్క తొడ మెడ వ్రేళ్లు జోళ్లు నలియ రాళ్లు డులిపియుఁ, గ్రొవ్వున రువ్వనుమ్రోఁత నభోవలయంబు నుబ్బూఁత లూఁప నాఁప రానికడిమి చెల్ల నొడిసెళ్ల వ్రేసియుం బరాక్రమించి యాక్రమించిన నిజసైన్యంబులు దైన్యంబునొంది యొక్కింత దిరిగినం బెరిగినవీరోద్రేకంబున నద్దానవసింహంబు సింహనాదవిదళిత రోదోంతరాళంబుగం

గరాళంబగుతేజి నుత్తేజితసాహసంబున నెక్కి వెంబడిం
గట్టాయితంబై హయఘట్టంబు నడవం గడవరానితమకంబున
వెఱవకువెఱవకుం డనుచు నేసినయమ్ముకైవడి వడి మీఱి
కోటకవాటమ్ములు పెటాలునం దాఁకిన సముద్రంపుఁదెరల
తెఱంగున మరలం బురికొని దనుజసైన్యంబులు నభోలక్ష్మీ
చరణనూపురస్థాపితపురందరనీలకందళంబుల చందంబునం
గ్రందుగాఁ బ్రాకారంబు ప్రాఁకినం 'గోట పోయెఁ బోయె,'
నను నెలుంగులు నింగిముట్టె, నట్టియెడ. 39

ఉ. రెక్కలతోడి మేరుగిరిరేఖ మెఱుంగులు గ్రమ్ముజాళువా
పక్కరతేజి నెక్కి యిరుపక్కియలన్ హయకోటి గొల్వఁగా
గ్రక్కునఁ గోట వెల్వడి యఖండితకీర్తి జయంతుఁ డుక్కు
నన్-రక్కసిమూఁకలం గదిసి రౌద్రమ యాకృతి దాల్చె
నాకృతిన్. 40

ఉ. సింగిణివిల్లు వంచి మణిచిత్రితకాంచనపుంఖదీధితుల్-నింగిఁ
జెలంగ 'రిం' గనువినిర్భరరావము లుల్లసిల్ల నే-సెం గుటి
లాసురప్రతతిచెక్కులు ముక్కులు డొక్క లక్కుల-గ్రాంగ
ములు న్నలంగఁ బ్రళయార్కమహోమహితాస్త్రసంహతిన్.

వ. అప్పుడు: 42

క. తిరిగినతనసైన్యంబులఁ
బురికొల్పుచు దైత్యవిభుఁడు భూరిరయమునన్
సురవల్లభ, నీతనయుని
హరి కడ్డము వచ్చి నిల్చె హరిదోశ్శక్తిన్. 43

క. కరకీలితమణికంకణ
కిరణస్ఫురణాఢగద్గగితభీషణతో

పుర మొకటి మనజయంతుని
యురమునఁ గీలించెఁ గవచ ముచ్చి చనంగన్. . 44

ఉ. వెన్నున నంటు తత్ప్రహతివేదన లే దనఁ దాళి దాళి సు
మ్మిన్ని శితాస్త్రధార విజయేందిర కంచు సురల్ నుతింప విం
ట న్నిగిడించి యొక్కవికటప్రదరం బెదఱొమ్ము గాఁడ నే
సె న్నెఱవీఁక మూఁక వెఱఁ జెందఁబురందర దైత్యనాథునిన్.

క. అదియు నెద చించి వెడలినఁ
ద్రిదశారి యొకింత సోలి తెలివి గనునెడన్
గదిసినసేనలఁ గొన్నిటిఁ
జిదిమె జయంతుండు పసిఁడిశింజిని మ్రోయన్. 46

ఉ. అంత నొకింత దేఱె యమరారి బలారి, భవత్కుమారు దు
ర్దాంతపరాక్రమక్రమధురంధరకీర్తివిహారుఁ జేరి యిం
తింతలు గాఁగ విల్ దునియ నేసిన రేసినచిత్తవృత్తిఁ జా
పాంతరశోభితుం డగుచు నాజయశాలి సురారి మెచ్చఁగన్.

క. అరిఁ గూర్చి మారుతాస్త్రం
బరిఁ గూర్చి యుదగ్రరేఖ నడరించిన నా
శర మసురు నసురసేనా
పరివృతముగఁ దృణలవంబుపగిదిం దూల్చెన్. 48

వ. ఇవ్విధంబున రివ్వునం గ్రొవ్వడంగి పఱచునవ్వేడంగు నిజ
మందిరం బగు మందరంబునకుం జనకకనకగర్భునింగూర్చి తపం
బాచరించి త్రిలోకంబుల కసాధ్యుండ నయ్యెద నని సాధ్య
గంధర్వబంధురం బగుజలధరాశ్రయంబునకుం దపం బాచ
రింపం జనియె నని మన వేగులవారివలన వింటి; నటకుమున్న
జయంతుండు చారణకీర్తనంబులును వారణగామినీనర్త

నంబులునుం గిన్నరగానంబులునుం బన్నగీఫణామణికల్పిత
నీరాజనవితానంబులును గానిపింప నాకంబుఁ బ్రవేశించి
చెదరి కూడినవన్ను మాణిభద్రునిం గర్ణికాకేతునిం బిలిచి:
'యరదంబు నైరావతంబు నశ్వరాజంబును నిటకుం గొనిపొ'
మ్మని పనిచినం బనివింటి నిది తద్వృత్తాంతంబు." 49

ఉ. నా విని సంతసిల్లి నరనాథుఁడు వజ్రి మొగంబు చూచి: "విం
టే విబుధేంద్ర, నీకొడుకు లేవయుఁ జేవయుఁ; లోకభీకరుం
డౌ విబుధారిఁ బోఁ దఱిమి నాకము లోకముఁ గాచె; నింక నే
లా వెడచింత?" లంచు నిజహారము మాతలి కిచ్చి
మెచ్చుచున్. 50

తే. "నూత్నహాలాహలం బైన రత్నచూడుఁ
డెవ్వఁ? డష్మేటితలిదండ్రు లెవ్వ? రెఱుఁగు
దేని నెఱిఁగింపు." మనుడు మహేంద్రసూతుఁ
"డధిప, వివరింతు." ననుచు ని ట్లనియెఁ బతికి. 51

## రత్నచూడదనుజుని కథ

క. "భూపాలకులనభోమణి,
తాపసమణి నారదుండు దైత్యునిజనన
వ్యాపార మెఱింగించె ద
యాపరుఁ డొకనాఁడు నాకు; నది యెఱిఁగింతున్. 52

క. ...రవిద్యున్మాలిక
...రుజంపతులకుఁ దనూజుఁ డసమానయశో
ఖని యొకఁడు గంధగజుఁ డనఁ
జనువిద్యాధరుఁడు గలఁడు జగతీనాథా. 53

శా. ఆవిద్యాధరసార్వభౌముఁ డొకనాఁ డంగం బనంగోదిత
శ్రీవిద్యోతితనూత్న యౌవనమునం జెల్వొంబు రెట్టింప గ
ర్వావేశంబునఁ గామినీజనసహాయప్రీతుఁడై మేచక
గ్రీవక్షోణిధరాధరంబునకు నేఁగెం గోర్కు లుప్పొంగఁగన్.

### గంధగజుఁడనువిద్యాధరుఁడచ్చరలతోఁగూడి వనవిహారము చేయుట

సీ. యూథికోభయపార్శ్వయుతమిళిందచ్ఛాయ
ముత్తెపుఁబాపటల్ హత్తుకురులు,
స్మరజగద్విజయశాసనపట్టముల పేర
ముంగురుల్ పొదవుఫాలాంగణంబు,
లవనిజోద్ఘాటితైందవఖండలీల శ్రీ
ఖండరజోగర్భగండతతులు,
వివిధసరిజ్జాలవృతమహీస్థలిలీలఁ
గాంచికాంచితమహాకటితలములు,
తే. ప్రాజ్యయౌవనవిభవసామ్రాజ్యరేఖ
రేఖ హెచ్చంగఁ జేయ నాలేఖలోక
కోకవక్షోజ లక్షణకుతుకలబ్ధి
మెత్తఁ జేసిరి ఖేచరుచిత్తవృత్తి. 55

సీ. గళుల రాయంచలకలకలంబులలీల
నందియరవరవల్ గ్రందుకొనఁగఁ,
గటి సైకతాగ్రసంఘటితఫేనచ్ఛాయ
హీరమేఖలలపెం పినుమడింప,
కొండల నిర్జించుకుచములకీర్తులో
యన హారగుచ్ఛముల్ గునిసియాడ,

శ్రవణాంగణమునఁ దారకలు గొల్వుండె నా
మౌక్తికతాటంకమహిమ బెళుకఁ,
తే. బలుకు పలుకున నమృతంబు దొలుకరింప
మేనుఁదీగలఁ దళుకొత్త మెఱుఁగు మొత్త,
మరిగి రచ్చరపూఁబోఁడు లతనివెంట
నలికనేత్రధరాధరప్రాంతమునకు. 56

ఉ. జేవురు ఫాలనేత్రశిఖచెల్వము నిల్వఁగఁ జేయ, వేల్పుపూఁ
దీవలు చుట్టుకల్పజగతీరుహముల్ ఫణిభూషితోరుబా
హావిసరంబు గా, వననవాంబుదరేఖ గళంబుకప్పుగా
నావసుధాధరంబు హరునాకృతి నాకృతిఁ దెల్పె నెంతయున్.

వ. అంత నతండు తత్ప్రాంతంబున: 58

క. వన మొకటి గాంచె సతియా
వనముగతిం బ్రసవలబ్ధిచరభోగశ్రీ
జనకము, నామనిముంగిటి
కనకమునై యుండఁ దత్ప్రఘాణక్షోణిన్. 59

గీ. కళలతోడ మృగాంకుండు జలధరోద
రముఁ బ్రవేశించుమర్యాద రాజముఖులుఁ
దాను గంధగజుండు తద్వనము సొచ్చెఁ
గరిణు లిరుగడఁ గలగంధగజముఁ బోలె. 60

చ. నెలఁతలచెక్కులం దనదునెమ్మొయినీడ యతిప్రకాశమై
యలమఁగ విశ్వరూపధరుఁడై హృదయప్రభవుండు దర్పణం
బులయరదంబు నెక్కి దివిఁ బోవువిధంబున నేఁగి ఖేచరుం
డలరులు గోయఁ జొచ్చెఁ దనయార్జవచేష్టలఁగోయుకైవడిన్.

సీ. ఉత్తమాంగజబుద్ధి నుపద యిచ్చినలీలఁ
గచభరంబులఁ బరాగంబు చిలికి,
యమృతాంశుభేదంబు లని పూజ చేసె నాఁ
జెక్కులఁ గేసరశ్రేణి చల్లి,
యవనిభృత్పదవికి నభిషేక మొనరించె
ననఁ దేనియల్ చన్నుమొనలఁ జినికి,
క్రొత్త యేతెంచిన గ్రుచ్చి యెత్తినజాడఁ
దనువులఁ బుష్పగంధముల నలమి,
తే. విటపసంగతి విలసిల్లువిబుధలతలు
విటపసంగతి విలసిల్లువేల్పుఁజెలుల
కప్పు డొనరించె సత్కార; మదియ తగవు
బ్రదుకు సఫలంబు సేయు నేర్పరుల కెల్ల. 62

ఉ. పుష్పాడి చల్లుతీవల కపూర్వగతిం గరమూలదీధితుల్
కప్ప మొసంగుచుఱ్ఱ వలపు కానుక సేయుచు నున్నపూవుబ
ల్పుప్పొడి నూర్పుసంపదలు గూర్చుచు నేర్పున సంచరించి రా
కప్పురగంధు; లెందుఁ దగుఁగా యితరేతరబంధుకృత్యముల్!

క. మృదునఖముఖముల నొకచెలి
చిదిమె నశోకంపుఁజివురు చిత్తజరాగో
న్మదుఁ డగుఖేచరుతాలిమి
చెదర సమస్తంబుఁ బట్టి చిదిమినజాడన్. 64

ఉ. పువ్వులు గోసె నొక్కవిరిఁబోఁడి పదంబుల నూఁది నిక్కి పో
దవ్వుల మావితీవ యఱుతం జెలువందఁగఁ గేలు సాఁచి లేఁ
దువ్వరకమ్మదేనియలఁ దోఁగి ఝురార్ద్రిధరాధరాకృతిం
గ్రొవ్వినగుబ్బ లభ్రచరుకోరిక లీరిక లెత్తఁ జేయఁగన్. 65

చ. అల రొకతైనఁ గాన "కకటా, నికటావనిజాతరీతి నీ
వలరఁగ నేర వైతి." వని యల్క నశోకము నొక్కకామినీ
తిలకము తాఁచిన న్ననిచె దిగ్గన యొగ్గన; కట్లకాదె ని
చ్చలు మధుప్రసక్తులు కుజన్ములు వాసి యెఱుంగ నేర్తురే!

చ. "కలవొకొ పువ్వు!" లంచు నొకగంధగజేంద్రసమానయాన
వె- న్నెల నెలయించుమించు హావణించుకనుంగవఁ జూచి
నంతనే- తిలక ముదారకోరకతతిం బరువంబు వహించె; విం
తయు-గ్మలికనుచూపు రంజకము గాదొకొ పల్లవకోటి
కెప్పుడున్! 67

క. వెక్కసమై యొకతుమ్మెద
పుక్కిటిమధు వింత యుమియఁ బూమొగ్గల సొం
పెక్కం గేసరభూరుహ
మక్కాంతలగోటిచెనకు నాసించు క్రియన్. 68

చ. "వనతరువాటికిన్ నవనవప్రభవత్ప్రసవోదయంబు పెం
పున విలసిల్లెఁ జూడు మివి పుట్టినప్రొద్దున నీవు పుట్టవే!"
యని మొగ మెత్తి యల్క నొకయంగన చూచినఁ జంపకం
బు పూ-చె నిమిషమాత్రఁ గొమ్మలకుఁ జిక్కనమక్కువ లె
క్క కెక్కఁగన్. 69

క. "పా లగు నా కిది:" యని యొక
లీలావతి కేలఁ గౌఁగిలించినమాత్రన్
జాలంగ ననిచెఁ గురవక
సాలము మారునకు వజ్రసాలం బగుచున్. 70

ఉ. కప్పినవేడ్క నొక్కగజగామిని సంపెఁగమోక క్రిందటం
బుప్పొడి పైపయిం గురియఁ బొల్చె సరోజమధూళికాప్ర

రై- యప్పరమేశపాటలజటాటవి ధార గ జాఱు నేటఁ జే
రొప్పు వహించుపాండురమయూఖకళాముకుళాభిరామ
తన్. 71

చ. వనరుహసోదరం బయినభామినిముద్దుమొగంబుతావి మూ
ర్కొనఁ జనుజంటముయ్యెడుగుఁ గోకపయోధర యోర్తు
కేలఁ జో- పిన నదియంత సరోజ మని బిట్టు పెనంగె నొకిం
త తాళు మం- చనుభవలోలబుద్ధి వినయంబునఁ జేతుల
వ్రాలుకైవడిన్. 72

ఉ. అన్నవపుష్పబంధురరసాంబువుల న్మెఱుఁ గెక్కి నిర్ఝరో
త్పన్నమదోదయార్ద్రసురదంతిపకుంభములన్ హసించున
య్యన్నులచన్నుగుబ్బ లొక యందము దాల్చె ఘర్మవారి
చే; నున్నతిమీఁద నున్నతియ యొందు మొనల్ పనిసేయు
వారికిన్. 73

వ. అయ్యవసరంబున: 74

సీ. "గాఢాగ్నిఁ గ్రాఁగినకనకంపువాలుకో
త్కర మని పుష్పాడిఁ గదియ వెఱచి,
సంతప్తమదనాస్త్రసమితిఁ జుంయన ముంచు
నంబులో యని తేనియలకు నులికి,
వాసనాహరణసంవళితభానవభాను
సమితియో యని కేసరముల కెడసి,
దారుణచైత్రప్రతాపపావకకీల
లో యని రేకుల నూఁత గొనక,
తే. విరహవిహ్వలమతు లైనవిటులజాడ
నలులు కపురంపుటనఁటిపాదుల నమర్చు

చలువజాబిల్లి బాలనీడలకు నేఁగు
చున్న వి; ప్రౌఢ దినయౌవనోదయంబు" 75

క. అని తనిసి సంఘటించిరి
వనకేలితలంపు పెంపు వనజాక్షులు జీ
వనకేలియందు నెందుఱ
జనులకు నొక క్రొత్తక్రొత్తచవిఁ బుట్టించున్. 76

వ. అయ్యవసరంబున: 77

మ. నవవల్లీపరిరంభసంభ్రమకలానైపుణ్యుఁ డుత్ఫుల్లకై
రవకల్హారసరోజసౌరభభరారక్తాంతరంగుండు భో
గివధూసీత్కృతిపూర్వచుంబితుఁడు భృంగీగానలోలుండు
బంధువుఁడో నాఁగఁ బటీరశైలపవమానుం డంత వీతెం
చినన్. 78

జలక్రీడావర్ణనము

క. ఎదురెదురుగఁ జని కాంచిరి
మదవతు లరవిందగళదమందమరందో
న్మదరవదళివలయఘనా
స్పదమై జలరాశి దొరయుసరసిఁ సరసన్. 79

ఉ. అప్పుడు ఖేచరుండు తనయంగమునం బృథుఘర్మబిందువుల్
చిప్పిల నప్పడంతు లిరుచెంతలఁ బల్లవతాళవృంతముల్
ద్రిప్పుచుఁ గొల్చి రా సరసదేహము దాల్చినపువ్వువిల్తుబల్
చొప్పు దలిర్పఁ దత్సరసిఁ జొచ్చెఁ దనుశ్రమ ముజ్జగింపఁ
గన్. 80

ఉ. అంబుజబంధుబంధురకరాహతి వాడినవేల్పుఁగొమ్మమొ
త్తంబు సరోసరోజగృహ తప్పక కన్గొని తెల్లపట్టుపు
ట్టంబుల నుల్లభంబులఁ దటాలున నిల్పెనొకో యనంగ హం
సంబులు నిల్చియాడె నొకచా లయి లీల దలిర్ప నద్దివిన్. 81

మ. "అదిగో! జక్కవ" యంచు నొక్కచెలి పాయం బైనచన్గు
బ్బ చేఁ- బొదువం జూపిన నాలతాంగి నగుచున్ బూఁదేనె
ముంగోరునన్- గదియం బోయి నభశ్చరాధిపునిదృక్కంజ
మ్మునం జిమ్మె; మం-చిది యీశంఖ మటంచుఁ గౌఁగిట ఘ
టించెం దద్గళాభోగమున్. 82

మ. కలశీజృంభణపశ్యతోహరములై కన్పట్టు వేఱొక్కయు
గ్మలిపాలిండ్లఁ దటానఁ దాఁకి విరిసెన్ గాఢంబు లయ్యు
న్మహో-ర్ములు; కాఠిన్యముఁ జూపుచుం బ్రబలతారుణ్యోత్థ
లౌభూమిభృ-త్కులసత్త్వాఢ్యులమీఁదఁ బోవుజడమూ
ర్తుల్ గెల్పు వాటింతురే! 83

మ. "వనితారత్నములార, యోల!" యనుచున్ వామాక్షి
యొక్కర్తె యం-గన లెల్లం దనుఁ బట్ట లేక తిరుగన్ గా
ఢత్వరాయుక్తి నీఁ-దె నలిన్యాకరవారి నెవ్వరి కసందేహా
క్షమం గర్కశ - స్తనకుంభప్లవయుక్తి యందులకుఁ గాదా
ధాత నిర్మించుటల్! 84

తే. రమణి యొక్కతె నిజలోచనములసహచ
రంబు లని జంటమీనశాబంబు లరుగ
నీఁదెఁ గమలాకరంబులో "నింతమఱపె
మీనుపిల్లల." కని మెచ్చ మానవతులు. 85

ఉ. కన్నులఁ బొల్చుకజ్జలవికారముఁ, జెక్కులపత్త్రవల్లులుం,
జన్నులఁ గమ్మఁబూఁతయుఁ, గచంబులపుష్పాదికప్పుఁ దార్చి
య-య్యన్నుల కొక్కవింతయగునందముఁ దెచ్చె సరోవ
గాహ మ-చ్ఛన్ననిసర్గకాంత మగుచక్కఁదనం బెఱిఁగించు
కైవడిన్. 86

చ. తల నొకలేఁతచందురునిఁ దాలుచు నీశ్వరమూర్తిభేదమై
యలరియు నెంతవింత, జలజాకరవారి యవారితోత్సవా
కలితసహస్రనేత్రపురకంజముఖీనిటలచ్ఛలమ్మునన్
నెల లోకకోటి దాలిచె గణింపఁగ రానిసిరిం జెలంగుచున్.

చౌపదలు. చిన్నది యొక్కతె చెందొవక్రోవిన్
దిన్నఁగఁ జిమ్మెను దేనియతావిన్
మన్నన సేయుచు మారునిఠీవిన్
బన్నినఖచరునిపవడపుమోవిన్,
వెనుచన నేరనివెలఁదుకఁ దిట్టెన్
దనచనుతాఁకులఁ దరఁగలఁ గిట్టెన్
పోనపోన దవ్వులఁ బులినము మెట్టెన్
జనిచని యొకచెలి జక్కవఁ బట్టెన్.
వికలభయోదయవిహ్వలలీలం
దొకతొక లాడుచుఁ దూరుపునేలం
జకితము లగుతొలుసామిగుఱాలన్
వికవిక నవ్వెడు వేఱొకబాలన్. 89

చ. "కలువలయందుఁ గైరవనికాయదళంబులయందుఁ బద్మినీ
కులములయందుఁ దీరవనకుంజములం దొకయింత యింత
సొం-పెలమిఁ జరించుఁ దేఁటి ఖచరేంద్రుఁడ, చూచితె!"

యన్న నొక్కతొ-య్యలిఁ "గనుఁగొంటి ధూర్తచరితా"
యని ప్రేసెఁ గరాంబుజంబునన్. 90

తే. రత్నఖని నుండువిధుఁడు తారకలఁ గూడి
దరికి నేతెంచుజాడ విద్యాధరుండు
మగువలును దాను జలకేలి మాని వెడలెఁ
గూలకనకాలవాలనికుంజమునకు. 91

ఉ. క్రొవ్విరితేనెయేటిదరి గుజ్జరసాలముక్రిందఁ దావి లేఁ
దువ్వరగాడ్పు చల్లునెడఁ దోయరుహాక్షులుఁ దాను ఖేచరుం
దవ్వలరాచవేల్పు దొరయన్ దనువల్లిఁ జతుర్విధంబులన్
మువ్వపువన్నె పూనె మధుమాసమనోజ్ఞమహీరుహాకృతిన్.

తే. అంత నతిమత్తుఁ డైనవిద్యాధరేంద్రు
భావిదురితంబు చూడ నోపనివిధమునఁ
జరమశైలంబుమఱుఁగున కరిగె సూర్యుఁ
డింద్రదిక్కాంత నెలమొగం బెత్తె ననఁగ. 93

క. ఈనెటి సరసాలంకృత
లై నీరజవదన లతనియంతికభూమిన్
సూనాసవంబు తుమ్మెద
లానం గని: "మఱచినార మౌరా!" యనుచున్. 94

## మధుపానవర్ణనము

తే. రత్నతండులవిన్యస్తసూత్నశాత
కుంభకుంభాంతరాళైకసంభృతంబు
వకుళముకుళాతివాసనావాసితంబు
సీధు వానంగఁ జుట్టు నాసీన లగుచు: 95

క. కలువచెలిరాలగిన్నెల
బలదైత్యవిభేదిరత్నపాత్రంబుల, బ
చ్చలకుడుకల, ముత్తెపుఁగో
రలఁ ద్రాగిరి సుర సుపర్వరమణులు వేడ్కన్. 96

వ. అప్పుడు: 97

ఉ. దైత్యగురూపదిష్ట మగుతత్త్వము మూర్తివహించులీల నౌ
ద్ధత్యవిలాసహేతు వగుతన్మదిరాసవపానకేళియం
దత్యనురాగముం బెనిచె నభ్రచరుండు; సతీజనైకసాం
గత్య మగణ్యపుణ్యలతికాహతికారణదాత్ర మౌఁ గదా! 98

ఉ. తా నొకకొంత గ్రోలి మఱి తక్కినశీధురసంబు భర్తకుఁ
గానుక చేసె నొక్కగజగామిని; తియ్యఁదనంబు మెచ్చి వాఁ
డానలినాయతాక్షిరుచిరాధర మే యుపదంశకంబుగా
నూనినవేడ్కఁ గ్రోలె రుచికుబ్బుచుడెందము కందళింపఁగన్.

సీ. ధవళకాంతిజ్యోత్స్నఁ దాండవం బాడించు
కన్నులఁ జెంగావివన్నె కూర్చి,
విరిమొగ్గపరువంబుఁ బరిభవింపఁగఁ జాలు
దరహాసములఁ దీఁగతనము గొలిపి,
గంధాంధసింధురఘటలపై వడిఁ జూపు
నడపుల కెక్కుడు జడత పెనిచి,
యమృతప్రవాహవాహనములై తిలకించు
పలుకుల కొకతడఁబాటు దెచ్చి,
తే. చలమరియుఁ బోలెఁ దొల్లింటిచెలువమునకు
విరతి గల్పించి కల్పించె వింతసిరుల

రాగహేతుక మగుమదిరారసంబు
నాకలోకవధూజనానీకమునకు. 100

మ. ననకుం బాసినవింతతూపు రతికాంతాజానికిౕ, మేనికిం
గనకాతీతవినూతనాభరణ; మాగాఢాంగజాతాహవం
బునకుం గారణభూత; మాధిరుజలం బోఁదోలుదివ్యౌషధం
బను నాసీధురసానుభూతి ఖచరుం బోషించె సంపన్నమై.

ఆ. 'ఆకసంపుఁజిప్ప నబ్జమండల మను
కప్పురంపులప్పఁ గలిపియున్న
వింతమధు' వటంచు వెన్నెలఁ గని బయ
లానఁ జొచ్చె నోర్తు మేను మఱచి. 102

ఉ. జేవురునీటఁ దోఁచుక్రియఁ జెందొవవన్నియఁ గూర్చులీలఁ
గెం-పై విలసిల్లునాత్మ వదనాంబుజముౕ మధుపాత్రఁ
గాంచి:"తా-రావిటమండలం బదె సరాగగతిం బొడచూపెఁ
బట్టుదుం;-బోవఁగనీ;" నటంచు నొకముద్దియ కేలఁ గలంచె
మత్తయై. 103

సీ. "తతతతామరసాక్షి, తలపంతమాడకు;
వివివివీణాకంఠ వీణ దెమ్ము;
పపపపాటలగంధి, పాటపాడు మొకింత;
కుకుకుకుందస్మిత, కురులు ముడువు;
ససససారసహస్త, సరిదాసవా నీవు;
నననననాతుక, నాలినవ్వు లేల?
వవవవారిజముఖి, వలదు వాదులు చాలుఁ
గొకొకొకోమలి యేల కోపవేగ?"

తే. మనుచుఁ దపుదప్పు లాడుచు నన్నుఁ గనిరి
మదననిర్ముక్తదుత్తూరమార్గణాగ్ర
హతుల నలసిరో యన ఖేచరాబ్జముఖులు;
భర్తఁ దేల్చిరి మైరేయపానకేలి. 104

శా. లజ్జాశూన్యనితంబబింబరశనాలంకారఘంటాధ్వనుల్
హృజ్జాతేక్షుధనుర్గుణారభటితో, నేకాంత మాడంగ యో
షిజ్జాలంబు నటింప నట్టు వగుచున్ శిక్షించు విద్యాధరుం
డజ్జన్ సజ్జితహస్తతాళకలనావ్యాపారపారీణతన్. 105

వ. ఇవ్విధంబున మదనుండునుం బోలెఁ దనువు మఱచి, తోలు
పాయంబునుం బోలెఁ గురులు విడి, సాయంతనతపనుండునుం
బోలె నంబరం బెడలి, కేసరియునుం బోలెఁ గెంపుఁజూపు
దప్పక, బాలుండునుం బోలెఁ దొట్రుపడుచు విద్యాధరా
ఖండలుండు వెండియు; 106

### మధుపానమత్తుఁడగుగంధగజుని విశ్వామిత్రుఁడు శపించుట

ఉ. పాడుచు నాడుచుం దగిలి పట్టుచుఁ దిట్టుచు నిర్భరాసవ
క్రీడ సురాంగనల్ పొదువ వ్రీడ యొకింతయు లేక పెన్రొ
దం-గూడఁగ నవ్వుఖేచరుని క్రొవ్వు తదంతికసీమఁ దీవ్రపుం
జాడ వసించుతత్కౌశికసంభవుఁ డించుక చూచి యుగ్రుఁడై.

ఉ. కెంజడ యూఁచివైచి వలకేలఁ బోరింబోరి నక్షమాలికన్
భంజలి గాఁగఁ ద్రిప్పుచు 'గనంగన' మంచు మొగంబు రాఁజ
బ-ద్ధాంజలులై దిశాధిపతు "లయ్య, ప్రసీద" యటంచుఁ
బల్క బ-ల్కుంజి పెకల్చి కృత్తిపటముం దిటముం దెరలించి
చింపుచున్. 108

ఆ. అప్పుడు కఱచి కటము లదరంగఁ గన్నుల
నిప్పు లడరఁ జెమట చిప్పిలంగఁ
దుండ మెత్తి వచ్చుశుండాలవల్లభుం
డనఁగ దండహస్తుఁ డగుచుఁ గదిసి. 109

ఉ. మ్రొక్కఁగ సన్నుతింపఁగ సముజ్జ్వలభక్తి నెదుర్కొనంగ
మం-పెక్కినచొక్కునన్ మఱచి యింతులుఁ దాను దిగంబర
త్వమున్-వెక్కస మైనగర్వమును వీఁడిచందముఁ బూను
ఖేచరున్- మిక్కిలి కిన్కఁ జూచి యశనిప్రతిమానకఠోర
భాషలన్: 110

సీ. "ఎఱుఁగవా యోరి, మున్నే బ్రహ్మసృష్టికిఁ
బ్రతిసృష్టి గావించి ప్రణుతి గనుట?
తెలియవా యోరి, యాదేవేంద్రపదపరి
చ్యుతుఁ ద్రిశంకుని యథాస్థితి నిలుపుట?
తలఁపవా యోరి, నేఁ దద్వసిష్ఠమునీంద్రు
మునుఁ బుత్త్రశోకాబ్ధి ముంచు టెల్ల?
నూహింపవా యోరి, నే హుటాహుటి హరి
శ్చంద్రు నవ్విధి నలజడి పఱచుట?
తే. "యెప్పు డేమని కినియునో యితఁ." డటంచు
నిదురయునుఁ గూడు నెఱుఁగరు నిర్జరేంద్రు;
లహహా, నన్నుఁ దలంచి మదాశ్రమమున
కెట్లు వచ్చితి కష్టాత్మ, యివ్విధమున? 111

ఉ. వత్తువు గాక, యేమి తగవా? నగువారి నెఱుంగ కాసవో
న్మత్తుఁడవై సదా దురితమార్గనిరర్గళసంచరిష్ణు లౌ

నిత్తరళాయతేక్షణలయెంగిలికిం జెలు యొగ్గి ఖేచరేం
ద్రోత్తమవృత్తముం జెఱుచు టొప్పనె? తప్పనె యింక
దుష్కృతుల్? 112

క. అటు గాక యిన్నగంబున
నిటలాక్షుఁడు గౌరిఁ గూడి నిచ్చలు నానా
కటకంబుల బహుమణిఘృణి
కటకంబులఁ గ్రీడ సల్పుఁ గాంతలు గొలువన్. 113

క. కొంతయు వెఱపక వేలుపు
జంతలతో సీధుపరవశస్వాంతుఁడ వై
యింతలు సేసితి మత్పద
కాంతారము; నింతకంటెఁ గలుషము గలదే! 114

ఉ. ఖేచరవృత్తముం దొఱఁగి కిల్బిషభీషణవృత్తిఁ జెంది; తీ
నీచతరక్రియాఫలము నిన్నునణంపక యేల మాను దు
ష్టాచరణానుకూలచరితా; దురితాయతి రాక్షసుండ వై
పో; చతురాస్యుఁడున్ వెఱచు బొంకుగఁ జేయ మదీయ
వాక్యమున్." 115

క. అని పిడుగువంటిశాపము
మునిపతి యిచ్చుటయు ఖచరముఖ్యుఁడు భీతిం
దనువు వడఁకంగఁ దత్పద
వనజంబుల వ్రాలి దీనవదనుం డగుచున్: 116

క. "నేరము గలిగినచోటనె
కారుణ్యము గాక, నేర్పు గలరొడ నేలా?
మీ రలుగునంతవాఁడనె?
దారుణదంభోళిహాతికిఁ దరు వోకయెదురా! 117

క. కాంతాధరసీధురసా
క్రాంతిం గలవొక్క పెక్కుగతులం బొదలి యిం
తింతలు సేసె; నొకించుక
శాంతిం గనుఁగొనఁగ రాదె చకితుఁడ నైతిన్! 118

ఆ. నీపదంబులాన నీయాశ్రమం బని
యెఱుఁగ నింత రైన; నెఱిఁగి యెఱిఁగి
కుంజరారి యున్నగుహ ప్రవేశించునె
సత్వహీన మైనజంబుకంబు! 119

క. శాపంబుఁ గ్రమ్మఱింపుము;
పాపం బణఁగింపు; బోధపరత యొసఁగు; హృ
త్తాపంబు డింపు; మానస
కోపం బుడిగింపు మానికుంజర!" యనుచున్. 120

వ. పునఃపునఃప్రణామంబు లాచరించుచుఁ బుడమిం బొరలుచుం
దెరలుచు నాక్రందించు సంక్రందనసభాగాయకుం బాయక
కృపాకటాక్షంబుల నీక్షించి యాశ్రితాంబుజమిత్రుం డగు
విశ్వామిత్రుం డి ట్లనియె: 121

చ. "వలదు తలంక; నాపలుకు వారిధు లింకిన, ధాత బొంకినన్,
గులగిరు లూఁగినన్, గగనగోళము వీఁగినఁ, దప్పు; దైన నీ
యిల నొకకొన్నినాళ్ల కొకయింతికతంబునఁ బూర్వతేజమే
కలిగెడు నీకుఁ బొ;"మ్మనుచుఁ గౌశికుఁ డేఁగిన నాక్షణంబునన్.

క. చూడం జూడఁగ ఖేచర
చూడామణి యపుడు గాక్షసుం డయ్యెఁ గటా!
పాడైననియతియత్నము
పీడం ద్రోయంగ వశమె వేధకు నైనన్! 123

సీ. శ్రీసమాకృతి పాఱఁ జెరిగెడుచేటల
గతి విశాలం బయ్యెఁ గర్ణయుగము;
వరహాలోల్లాసంబు ప్రక్కలు వాపెడు
కరణి గండలితెంపు గనియె నాస;
యజ్ఞవైభవమారణాగ్నికుండంబుల
గతి నుదగ్రం బయ్యెఁ గన్నుదోయి;
లేటితాలుపుఁ గౌఁగిలించుభానవబింబ
మన ముఖమండలం బరుణ మయ్యె;
తే. నేమి చెప్పంగ! నమ్మునిస్వామిభీమ
శాపహాతిఁ దొంటిచందంబు సడలి వింత
భీషణత్వంబు దాల్చె నశేషలోక
చిత్రముగ ఖేచరోత్తంసుగాత్రయష్టి. 124

క. ఇటువలె రాక్షసుఁ డై య
చ్చట నుండక కదలి ఖచరసత్తముఁ డేఁగెం
గుటిలబహుదనుజసేనా
పటలము భజియింప మంథపర్వతమునకున్. 125

వ. చని యచ్చట ముచ్చట పిచ్చలింప నిలింపసంపత్సాధనోపాయ
చింతానిరంతరోత్సాహదోహలి యై దీప్రవప్రప్రాకారరేఖా
శ్లాఘనీయంబును జందనమందారాదితరుబృంద మంజుమంజరీ
నిష్యందమరందకందళీ తేందిందిరానందన నందనవనోపమా
నోపవనకలితంబునుం గా మాయావతి యనుపురంబు నిర్మించి
జగంబులు తనపంపు సేయం బెంపునం బొంపిరివోవుచు
రత్నచూడాభిధానుం డై కొంతకాలంబు వసియించి భుజ

బలోత్సేకంబున నాకంబు స్వవశంబు సేయుదు ననుతలంపున
నీరీతిం జనుదెంచి యిట్లయ్యె." నని వివరించిన; 126

ఉ. మాతలిఁ జూచి భూవిభుఁడు; "మానసమానసపద్మరాగ మై
భూతలచిత్ర మాకథనముల్ వివరించితి; వింక దానవుం
డాతతసంభ్రమస్ఫురణ నాకముపైఁ జనుదెంచె నేని ది
గ్వ్యాప్త మెఱుంగఁగాఁ దునిమివైచెద నీ వెఱఁగించు
మాత్రలోన్." 127

దిలీపుఁ డింద్రుని స్వర్గమునకుఁ బంపివేయుట

క. అని వజ్రధరునిఁ గనుఁగొని
"తనయునివిజయంబుఁ బగరదైన్యముఁ దెలియన్
వినఁ గలిగె; విబుధనగరికిఁ
జనుఁ డుత్సవ మెసఁగ." ననుడు జంభహరుండున్: 128

ఉ. "భానుమతీకుమార,పటుబాహుబలాఢ్యుఁడు రత్నచూడుఁ;
డెవ్వానికి వానికిన్ సమరవైఖరులం దల చూప రాదు ము
న్నే; నలినాసనుం డిక నభీష్టవరంబుల నిచ్చె నేనిఁ బై
పై నెఱి మించుకేసరికిఁ బక్కెర వేయుట గాదె మేదినిన్.129

తే. ఎప్పు డేవేళ దనుజేంద్రుఁ డేఁగుదెంచి
యలమునో నాకనగరంబుఁ దెలియరాదు!
మఱవ కరయు." మటంచు నమ్మనుజవిభుని
వీడుకొని వేడ్కతో నేఁగె విబుధపురికి. 130

వ. ఇవ్విధంబున: 131

క. అమరావతీపురంబున
కమరాధిపు ననిచి రాజహర్యక్షము స

ప్రమదోదయమతి యగుచుం
గ్రమమున మహి నేలుచుండఁగా నచ్చటికిన్. 132

బోయ యొకఁడు దిలీపుని దర్శింపవచ్చుట

సీ. కఠినపావకకృశకాచమేచక మైన
తెగమేను పాపాగ్నిపొగ యనంగఁ,
బాటలశ్మశ్రునిర్భరముఖాలోకముల్
పెర జాఱుతేనెతుంపురు లనంగఁ,
గఱకుజుంజురుమీసఁ గప్పారువదనంబు
ధాతుశృంగాగ్రకంధర మనంగ,
నడుమ దిండుగఁ జుట్టునల్లదట్టీ విష
వల్లికి నిడునాలవాల మనఁగఁ,
తే. జండచాపంబు గరదిగ్ధసాయకంబుఁ
బూని కోఱలు గలనీలభుజగ మనఁగఁ
బొగరు ప్రాయంపునలుగురుముగురుభటులు
వెంటరా వచ్చె నొకబోయ వేఁటకాఁడు. 133

ఉ. వాలికజంటవాళ్లయెగవాళ్లు సమాంసలదీర్ఘజంఘలా
నీలతనుచ్ఛదం బలఁతి నెత్తురుబొట్టు నురంబుసంకు లేఁ
దాలియుఁ బీలిదండయును దంతపుఁజేకడియంబు సందిటన్
మూలికయుంగరంబులును ముష్కరభావముఁ జూపు చూపు
లున్. 134

వ. చూచి పురంబువారు నగుచుం బెగడుచు నబ్బురపడుచు
నుండ నడువానకాలంపు టేఱునుం బోలె నొడ్డ నొరసి
కొనుచు, రణశూరుండునుం బోలె నెదురు వచ్చువారికిం
దలంగ నెఱుంగక, బడిదప్పుకురంగంబును బోలె బెదరి

చూచుచు, హంసచంద్రిక యనుహజారంబు చేరం జని
దౌవారికులం గనుంగొని: 135

క. "సామికి నెఱిఁగింపుఁడు; మా
భూమి కడుందవ్వు; తన్నుఁ బొడగనునాసం
గామించి వచ్చినాఁడను;
ధూమకుఁ డనువాఁడ; బోయదొర నై యుందున్." 136

వ. అని కోదండంబు పెఱకేల నూఁది మయి నూఁతగొని నిలిచి మెకంబు క్రొత్తనెత్తురు కప్పునం దుప్పు నాటినవాలమ్ము సభాస్తంభంబునం దీటుచు నుండం గని పణిహారులు దిలీపభూపాలునకు విన్నవించి సమ్ముఖమ్మునం బెట్టిన; 137

ఉ. గ్రక్కున నానృపాలకు ముఖాముఖిఁ గన్గొని కంపితాంగుఁ
డై-ద్రిక్క మెకంబుకై వడి మదిన్ వెఱఁ జెంది తటాన మర్లి
నల్-దిక్కులుఁ జూచిచూచి గడిదేరి యొకించుక డాయ వచ్చి
లోఁ గ్రుక్కెడుగద్గదంపుఁబలుకుల్ వెఱవారి నగంగఁ జేయఁ
గన్. 138

ఉ. అంజక హృద్గతం బగుమహామృగమారణకారణస్పృహా
పుంజము వెల్వరించె ననఁ బ్రోవుపడన్ గురిగింజపేరు ల
క్కుంజహితాన్వయాగ్రణికి గ్రక్కున సాగిలి మ్రొక్కి లేచి
వాఁ-డంజలి మౌళిఁ జేర్చి వినయంబు భయంబుఁ బ్రియంబు
మీఱఁగన్. 139

వ. హరివరాహశార్దూలభల్లూకపాకంబుల సమ్ముఖంబునం బెట్టి
యి ట్లనియె: 140

## బోయపల్లియవర్ణనము

సీ. "వలిగట్టు రాపట్టి వయ్యాళి తేజికిఁ
లంబువు ట్టిది సుమీ లలితమూర్తి;
కలిమేని వేల్పు టేకలముపంగడమునఁ
బొడమిన దిది సుమీ భూపవర్య;
చేఁతికుత్తుకసామి చిదిమినబెబ్బులి
జాతి సుమీ యిది జయవిశాల;
ముమ్మాఱు ధరచుట్టి క్రమ్మఱ వచ్చుబో
ల్లెలుఁగువి త్తిది సుమీ యినకులేంద్ర;
తే. యడవిలోఁ గల్లు మెకములయందు నెందు
వెదకి మేలేర్చి తెచ్చితి; వేఁటపాలము,
గవులు నీరంబు లిట్టుల్లఁ గండువలును
నే నెఱుంగనియవి లేవుపో నరేంద్ర! 141

చ. కడఁక దలిర్పఁ గస్తురిమెకమ్ములఁ జిల్లులు వోవ నేసి మై
వడిసిన నెత్తుటం దడియు వాసనబూములమంటి పెక్కువం
దడయక గోడ దీర్చి మదదంతిరదమ్ముల వాసపోసి పై
నిడు వెలిజల్లిక ప్పునిచి నిల్తుము గీములు గట్టి కానలోన్.142

ఉ. మందులకల్మి మంత్రముల మావనభూములపాడుమూఁక నా
నం దెరలించి నిల్పుచు ఫణాపటలంబుల నూడ్చి తెచ్చి దీ
ప్తిం దిలకించురత్నముల దివ్వియ లెత్తుదు రిండ్లముంగిటం
గ్రందుగ వేఁటజాతరలఁ గాననవీథిఁ గిరాతబాలికల్. 143

తే. సింగములు వాఁడిగోళ్లఁ జించివైచు
మత్తకరిరాజశిరములముత్తియములు

నిప్పుపువ్వులు గంపెఁడే నేఱె తెత్తు
రోపికలు మీఱె బోయతల్ మాపురముల. 144

క. ముట్టింతురు జవ్వాదియుఁ
దట్టుపునుఁగు భద్రకరిమదముఁ గూర్చి కడం
జుట్టంగ గబ్బు క్రొత్తగఁ
బుట్టిననిసువులనివాసముల భిల్లసతుల్. 145

తే. పిడుకుతఱె నిచ్చ లచ్చటఁ జెదరి యేఱు
లగుచుఁ బ్రవహించుపాలలోఁ దెగువ నీఁది
వత్తు రిరుప్రొద్దు గోపాలవర్యు; లిట్టి
యాలమందలు మాకు వేయాఱు గలవు. 146

క. పొనపొన ముమ్మొనగుబ్బలి
కనుమం బనసామ్రనింబఖర్జూరకుచం
దనచందనబృందంబుల
ననువగు మధువనము దానియవ్వలిచెంపన్. 147

మహాస్రగ్ధర—
కరిశుండాచండదండాక్రమణవిఘటితక్ష్మారుహోదగ్రశాఖా
పరితఃప్రచ్ఛన్న ముద్యత్ఫణివదనమరుద్భైరవం బుగ్రఝిల్లీ
పరుషధ్వానప్రథాసంబధిరితదశదిగ్భాగ ముల్లోకభల్లూ
కరురుక్రోడం బెసంగుఁ గహనమొకటియాకానకేసాటిగానన్.

క. అందుండుదుఁ బాలెంబునఁ
బందుల దుప్పులను లేటిపదుపుల దినముఁ
బొందులకుఁ బాపి నాలుక
విందులుగాఁ జీల్చి చింపి వేఁటకుఁ జనుదున్. 149

క. వేఁటాడింపఁగ నేర్తును
వాటం బగునురులఁ దెరల వలలం గెలనం
దూఁటి చననీక మెకముల
నూటిని వేయింటి లక్షనుం బొలియింతున్. 150

సీ. కూరతోఁటలు మాకు గుంపులై యింపులై
క్రొవ్వారు మెకములకోన లెల్ల,
నిల్లుముంగిలి మాకు నిరులపెన్నిరవులై
తెఱపి యింతయు లేనిపఱపుఁబొదలు,
తోడునీడలు మాకుఁ గోడెసింగములకు
సరివచ్చు ననవచ్చు జాగిలంబు,
లిలువేల్పు మాకు బొల్లెలుఁగునెమ్మెయినిల్వ
గద్దియఁ గొల్వుండు కాటితేఁడు,
తే. భోజనంబులు మాకు ముప్పొద్దు జీడి
పండ్లు పెరతేనియలు చాఱపప్పు వెదురు
బియ్యములవంటకము నేయి పెరుగుఁబాలు;
నింతసుఖ మున్నదే రాజు లేరికైన! 151

సీ. అన్నన మిన్నుమన్నను తెల్విలివ లేక
కన్ను గానక యుండు మన్నుగములుఁ;
గప్పారుమైచాయ ముప్పిరిగొన మింట
నుప్పరంబులు గొనుదుప్పిపదుపుఁ;
జిటికవేసినమాత్రఁ జివ్వున రివ్వున
దాఁటుచుఁ జెలరేఁగు లేటిపిండు;
మబ్బుగబ్బునఁ జాల నిబ్బరంబుగఁ జేయు
సుదరోమములఁ జిమ్ము సూకరములుఁ;

తే. గడమ చిక్కినమేకములఁ దడవఁ గొలఁది
గాదు "చిక్కినఁ బెట్టిరి; గంప గప్పి;
రాఁక నిడి;" రన నున్నవి మూఁక లగుచుఁ;
దేరి చూడంగ నరిది నోరూరుఁ దనకు. 152

చ. హరికిరిపుండరీకగవయప్రముఖాఖిలసత్త్వకోటి నేఁ
దెరలిచి చించినన్ వసుమతీతలనాయక, వెంట వచ్చు నా;
బిరుదు మెకాలగొంగ యనఁ బేర్కొనఁ బిల్చు; జగంబులోన నా;
సరిశబరుండు లేఁడు; పెదసామి ననుంగరుణించుఁ జాలఁగన్.

క. ఇటువలె నొకకొదవయు లే
కట వసియింపంగ నిప్పు డతిశితదంష్ట్రా
కుటిలానన మగు నొకహరి
కటుతరరూక్షేక్షణములు కనకన మనఁగన్. 154

{ రత్నమయసింహముచే దమపడు బాధలను బోయ దిలీపునకు విన్నవించుట. }

చ. పులుల వధించుఁ; ద్రుంచు గురుపోతుల; దుప్పులఁ జప్పరించు
మ-న్నులఁ బడఁదన్నుఁ; బందులఁ దినున్, దలకాయలఁ
జీల్చు దంతులన్;-సెలయునఖాగ్రసంహతుల సింహములన్
వెఱపించు; గోకులం-బుల విదళించు; భిల్లచయమున్ భయ
మున్ గొనఁజేయు ప్రేల్మిడిన్. 155

సీ. వైడూర్యరుచి మించువన్నెలు కన్నులు;
తపనీయవిస్ఫూర్తిఁ దవులు చెవులు;
దారుణశితవజ్రధారలు కోఱలు;
గోమేధికచ్ఛాయగీము మోము;

కట్టాణిపము త్రైపురగమి మించు మైమించు;
పద్మరాగప్రభాచ్ఛటలు సటలు;
బహులపిద్రుమరమాభరణముల్ చరణముల్;
తేటపచ్చలరచ్చదీను కౌను;

తే. నీలజాలైకసంసృష్టి వాలయష్టి;
సింగ మలరోమహర్షోత్తుంగశృంగమవనిఁ
బ్రాణ మెసఁగంగఁ జరియించుఁ ద్రాణ చూపు
మానవాధీశ, సత్ప్రీతిఁ గానఁ గాన. 156

చ. నెలపదినాళ్లనుండి ధరణీవర, వింటివె వేఁట వోవఁగా,
గొలఁదిఁ జరింపఁగాఁ, బసులఁ గోనలలోఁ జవిపూరి మేపఁగాఁ,
దలఁపక గ్రుక్కుమి క్కనుచు దయ్యము దూఱుచు నున్న
వాఁడ; నే-వలన నెఱుంగ నంజుఁ డనువారత నాలుక నంజ
నేనియున్. 157

చ. పొదరులమాటున న్నిలిచి పొంచి కనుంగవక్రేవచూపులం
బ్రదరముఖంబుల న్నిలిపి బల్పు దలిర్పఁగ జంగసాఁచి పే
రెద బలియించి లాసి గురియించి తటాలున భిల్లవల్లభుల్
చెదరక యేసినం గినిసి సింగము చంగున దాఁటు నీటుగన్.

క. మాయమందులు మంత్రంబులు
నేమియుఁ బని సేయఁ, వోనరేశ్వర, శౌర్యో
ద్దామవిహారం బగునల
సామజరిపుఁ దునిమి కావు శబరకులంబున్." 159

చ. అనవుడు నవ్వుచున్ నృపకులాగ్రణి "సింహముఁ దున్మివైచి గో
ధనములఁ గాఁచెదన్, శబరధామముఁ బ్రోచెద; వేగ వేఁట
కున్ - జనుద." మటంచు వానిమది సంతసిలన్ ధన మిచ్చి

కొల్వుం గన్గొని: "మృగయాప్రయాణమునకుఁ దలతే."
పని యాన తిచ్చుచున్. 160

వ. కొల్వువారల ననిచి యభ్యంతరంబున కరిగి యుచితకృత్యం
బుల నద్దినశేషంబును, రాత్రియుం గడపె నంత: 161

తే. "నాదుమనుమనిమృగయాప్రమోదగమన
మెఱిఁగి యింతకుఁ దనలోనియిట్టి దాఁచ
సురుగుఁబో చందురుం." డని చూడ నేఁగు
దెంచెనో యన నుదయించె దినకరుండు. 162

క. అంతకుమున్నె మాగధ
సంతానానూనగానజయశబ్దములన్
సంతసమున మేల్కాని భూ
కాంతాగ్రణి రచితకాల్యకరణీయుం డై: 163

దిలీపునిమృగయాసన్నాహము

సీ. బిగిములాసాపాఁగఁ బెనఁచి హారమతల్లి
శేషాహిఁ జుట్టినశివుఁ డనంగ,
వలఁతితామరయాకు వన్నెజోడు వహించి
మబ్బు గప్పినపచ్చమల యనంగఁ,
గంఠపీఠవిలంబికాండాసనముకల్మి
పరివేషభీషణభానుఁ డనఁగ,
జవళిపచ్చలబన్నసరములు ధరియించి
కాచినదేవతాత్మజ మనఁగఁ,
తే. దురగవల్గనచంచలహారివినీల
కుండలచ్ఛాయ చెక్కులఁ దాండవింప

సంభ్రమోత్థితనృపజూటచటులఘుర్ష
సాదు లౌరౌర! బళిర మజ్ఝా! యనంగ. 164

చ. "పదపదఁ; డాలసింపకుఁడు; పల్లన కట్టుఁడు; తెండు మావు
లన్; - గదలుఁడు; లెండు, రండు, వెసఁ గానెలు చుట్టుఁడు,
వన్నెపావలన్ - బదముల మెట్టుఁ; డత్తలము బల్లెము
విల్లుఁ గటారి ముప్పిడిన్ - మొదలగువానిఁ బూనుఁ." డను
మ్రోఁత పురిం దఱి చయ్యె నయ్యెడన్. 165

సీ. ఆనాభికందరం బగుమేనఁ బచ్చని
డాలొందు పెనుదుప్పటములవారు;
పులితోలుకచ్చడంబులమీఁద బిగిమీఱఁ
గీలించునీలిదట్టీలవారు;
జంట వాయక యుండఁ జమరవాలముదండ
హత్తించుబలుపిడియములవారు,
కఱకుజుంజురుల ముంగలిఁ దగిల్చినయాకుఁ
బోరకల నిగ్గుపే ళ్లురువువారు,
తే. బంతితలముళ్లు, వాకట్టుబదనికలును,
నక్కకొమ్ములుఁ బూనువా రుక్కుమిగిలి,
శరశరాసనపాణులై నరవరేణ్యు
వెంటఁ జనుదెంచి నిలిచిరి వేఁటకాండ్రు. 166

ఉ. క్రుస్సినకౌనులుం బటువు గూడినఱొమ్ములు వాఁడికోఱలున్
లెస్సదనంబుఁ దాల్ప ధరణీతల మంఘ్రుల నూఁది త్రవ్వఁగా
నిస్సమసింహకేసరవినిర్మితరజ్జులఁ బూన్చి తెచ్చి రా
దిస్సమొలయ్యవారిబలుతేజుల రాజులు మెచ్చ వేఁటకున్.

సీ. "ఇది బొండుమల్లియ, మదకుంభితల యెక్కి
నిక్కి ముత్తెము లుర్ల వ్రక్కలించు;
సేవంతి యిది, పొంగి సింగంబుకొసవెండ్రు
కలగబ్బు దీరఁగఁ గఱచి తివియు;
విరవాది యిది, వేఁట నెరవాది బెబ్బులి
గాటంపుఁబెనుఁగ్రొవ్వుగదరు మాన్పు;
నిది సుమీ సురపొన్న, తుదిఁ బోక భల్లూక
కర్తఁ జిక్కఁగఁ జేయు గంధలహరి;
తే. నిదియ కోవిల, వనసీమ నుదుటు మీఱు;
నిదియ చిత్రాంగి, సారంగహృదయభిదుర;"
మనుచు బిరుదులు చెప్పి రయ్యధిపుమ్రోలఁ
గదిసి బోయలు కౌలేయకములఁ దెచ్చి. 168

క. "వలయుఁడు, పాలయుఁ, బయ్యెర
వలని కరిగె వెలిచె డబ్బు పా లయ్యెం గ
బ్బులుఁగు కన్నెంటె చిలుతయుఁ;
గలుగుఁ శుభ." మనుచు వేఁటకాఱు లనంగన్. 169

వ. ఇవ్విధంబునఁ గట్టాయితం బైనసైన్యంబుతోఁ దమటడ మామికాశంఖపణవవీణావేణు నిస్వనంబులు చెలంగఁ గదలి పురోభాగంబున: 170

మృగయావిహారము.

సీ. ఉద్దండపుండరీకోద్భిన్నమృగశాబ
బహుళతనూద్గతరక్తపల్లవితము;
సంచరత్పంచాస్యచంచన్నఖప్రోత
రదికుంభమౌక్తికప్రసవితంబు;

గండభేరుండాస్యఖండితకాసరో
ద్భగ్న మేదోరజఃపుంఖితంబు,
క్రీడన్మదక్రోడతాడితరురుగర్భ
పతితమజ్జామధుప్లావితంబు,
తే. నగుచు మృగయావినోదచైత్రాగమమున
కాస్పదం బైనపుష్పకం బనెడునడవి
నిజపురోవీథి వీక్షించి నృపవరుండు
చిట్టమిడుచుచుఁ జోద్యంబుఁ జెంది యుండ. 171

సీ. శరసముద్ధురవృత్తిఁ బరఁగినకతననో
తిరముగా నిరువంకఁ దెరలు నిలిపి,
నేటు సూటిగ నేయ నేర్చినకతననో
వీఁగక చక్కఁగాఁ బోఁగువారి,
సతతకాంతారాగసంచారు లగుటనో
వలగొని యుండంగ వలల మార్చి,
వార్త కెక్కినక్రూరవర్తను లగుటనో,
వెల్లు దాఁటఁగ రాని కల్ల వైచి
తే. శబరు లక్రాంతసమ్మదప్రబలహృదయు
లగుచుఁ బో నీక యాఁగిరి మృగకులంబు
నంధతమసచ్ఛటల్, భూజనావలోక
ములఁ దెరల్చినజాడ నేర్పులు దలిర్ప. 172

వ. అప్పుడు: 173

క. వేడుక నునుఁజిగురాకులు
చూడాబంధమునఁ జెరివి చూడఁగఁ బొల్చెన్

క్రీడాకిరాతుఁ డగుశశి
చూడామణిజాడ రాజచూడామణియున్. 174

క. జృంభించి యెదురఁ గేసరిఁ
గుంభినిఁ బడ నేసె రాజు క్రూరాస్త్రమునన్;
గుంభిన్యవనధురీణుఁడు
కుంభిన్యపరాధకారిఁ గూల్పక యున్నే! 175

క. వాలమ్ము వాలముం గొని
ఫాలమ్మున వెడలనేసెఁ బార్థివుఁ డొకశా
ర్దూలంబుఁ జందనపుబలు
దూలంబుక్రగ్రకచధారఁ దునిమినజాడన్. 176

తే. దివికి లఘించునిట్టిఁ బార్థివసుతుండు
మెఱుఁగునారాచమున నేయ మిట్టిపడియె
హయరయోత్కంపితానిలం బాత్మహయముఁ
బొడిచి యద్దానిఁ బడఁద్రోచిపోయె ననఁగ. 177

క స్వమరీచిజ్యోత్స్నావి
భ్రమరీతుల రాగజలధిపై నురువులుగా
నమరినసితకాండమ్ములఁ
జమరీవాలములు దునిమి జగతిం గప్పెన్. 178

క. చానేయక నృపనందనుఁ
డేనికకుంభములఁ జీఱె నిద్ధాస్త్రములం
గాననధరణికి ముత్తెపు
సోనలు కచకోరకములసొంపు ఘటింపన్. 179

తే. పుట్టఁ గోరాడునొక మేటిబొల్లియెలుఁగు
నేయ కొకయింత చూచె మహీవిభుండు

కంబళము గప్పి పులిగూడుకందు వగుటఁ
గాచి యుండినజడదారిఁ గాఁ దలంచి. 180

క. గఱిగఱిన పాఁపగుఱుకలఁ
గొఱికెడియొకదుప్పి మెఱుఁగుఁగోలం గూల్చెన్
నెఱబిరుదు విభుఁడు భోగుల
కుఱక కఱకుఁదనము చూపనోర్తురె తజ్ఞుల్! 181

తే. జలజలోచనురాణివాసంబు గాన
ధారుణికిఁ గల్గెఁ గైతకదళసపర్య
ధరణిభృచ్చాపభృత్సముద్దండకాండ
ఖండితాఖండకిటిదంష్ట్రికామిషమున. 182

వ. వెండియు: 183

ఉ. కోల నొకంట భూవిభుఁడు కోలముజబ్బల దూఱి పాఱ నా
భీలత నేసినన్ రుధిరబిందులు సోఁకక యాశరంబు పాతా
ళముఁ దూఱెఁ: "దత్ప్రథమదంష్ట్రియె లక్ష్యముగాక యి
వ్వనీ-కోలముఁ గీలమున్ సరకుఁ గొందునె?" యం చటు
వోవుకై వడిన్. 184

ఉ. ఈఁటె నొకండు చండకిటి నెత్తె సముద్ధతిఁ గ్రుమ్మి ధారయై
పాటిలురక్తవారి తనపై నవకుంకుమచర్చకై వడిం
బాటలతన్ ఘటింప జలబంధురితాంకరమాసమృద్ధికై
నీటునఁ బట్టుసూత్రమున నించినమేచకచామరం బనన్. 185

మ. "అదె లే; డల్లదె దుప్పి యల్లదె గజం; బమ్మక్క! కొండంత
య-ల్లదె యాకారెనుబోఁతు; పెద్దకడిఁ దొరా! యెంత
గ!"ద్దంచు బో-యదొరల్ మ్రాఁకుల నెక్కి చూచుచు ధను

ర్జ్యాముక్తనానాశిత-ప్రదరశ్రేణుల నేసి రీసున గుఱిం బా
టించి యొక్కుమ్మడిన్. 186

వ. అయ్యవసరంబున; 187

సీ. ధరణిపై స్నేహంబు బెరయించె నన నేయి
యడుగువెంబడిఁ బడి వడియుచుండఁ,
దోడు ర మ్మని హరిక్రోడంబుఁ బిలిచె నా
ఘుర్ఘురారావంబు గుబ్బతిలఁగ,
వడిఁ గ్రొవ్వు సెలవుల వెడలెనో యన నర్ధ
చర్వితవదనముస్తములు చెదర,
బంటుతనంబునఁ బాటిల్లుకీర్తుల
చెలువునఁ గొమ్ములజిగి దలిర్పఁ,
తే. గాంతపాషాణయుతసూచికలవిధమునఁ
గప్పుగందంపుఁగొనవెండ్రుకలు దనర్పఁ
బదరుచూపుల మిణుఁగుర్లు పాఱఁజిమ్ము!
వీఁక గలయేకలమ్ములమూఁక యొకటి. 188

వ. పెనపరియునుంబోలె మోరతోపుఁదనంబు చూపుచుఁ, గొం
డీఁడునుంబోలె వాతివాఁడిమై, చతురవిటుండునుం బోలె
వలకు లోనుగాక, దాఁచిమఱచినవెడంగునుంబోలెఁ బెక్కు
చోట్లు ద్రవ్వుచుఁ, గ్రొవ్వున నివ్వాలవ్వాల చూడక పొడ
కట్టినయాగ్రహంబునం గిరాతధట్టంబు ధట్టించి బెట్టాప్పుచుం
దత్పట్టాభిషిక్తుకనుసన్నం గనకంపుఁబట్టెడలు వెరల్చి కవి
యించిన. 189

క. కాలాగ్ని ధూమసంఘము
లీలం గబళించువిస్ఫులింగములగతిం

గోలపరంపరఁ గదిసెం
గాలేయకగణ మఖర్వగర్వప్రౌఢిన్. 190

క. రదములుఁ బదములు బేరెద
లదవదలై చెదర నదర నరుణాంబుఝరీ
నదములు వరాహపటలముఁ
బొదివె వటుకాధినాథపూజాహయముల్. 191

క. కిరి యొకటి శాతదంష్ట్రాం
కురమునఁ గాలేయకంబుఁ గొట్టిన నందుం
బిరుదస్ఫురణకు నించిన
విరిసర మనఁ బ్రేఁగుతీఁగ వ్రేలుచునుండెన్. 192

క. భటుఁ డొక్కఁడు దరి పొడిచెం
బటురయమునఁ బంది నంది బల్లెంబునఁ బైఁ
బొటమరిలుఁ గ్రొవ్వు మేనికిఁ
జిటిపొటిగందంపుఁబూఁత సేయం డాయన్. 193

సీ. పొలఁకువ యుల్లంగి పూరేడు లావుక
పొన్నంగి దాబయు నున్నిగాఁడు
కైఁజు కక్కెర గువ్వ కల్లెడు కేరజ
మాఁడెలు తొగ గిజిగాఁడు కొరడు
జీలువు జీనుప జిట్ట చింద వెలిచె
గుడ్డంగి గొనకొనకోడి పికిలి
వంగపండును గోరువంక కప్పెట పొట్టి
పిట్ట పావురము కన్బెట్టి మూఁగ

తే. మొదలుగాఁ గల్గుపులుఁగుల గుదులు గ్రుచ్చి
తెచ్చి కాంచిరి యాజగతీకళత్రుఁ
బలుదెఱంగుల నెత్తురుపదను చేసి
విపిన మంతట వేఁటాడి వేఁటకాండ్రు. 194

తే. కట్టుజవ్వాది యిభకుంభగళితమౌక్తి
కములు వింజామరంబులుఁ గావడించు
మెకములును బచ్చికస్తూరినికరములును
నృపతియెదుటికిఁ దెచ్చిరి మృగయు లపుడు." 195

క. అని యిట్లు రామచంద్రున
కినకులకలశాబ్ధిహర్షకృతిచంద్రునకుఁ
మునినాథుఁ డయ్యగస్త్యుఁడు
వినిపించె గభీరధీరవిశదప్రౌఢిన్. 196

మ. ప్రతిభాశేష, యశేషభూవినుతసంపద్భోగనిస్తంద్ర, సాం
ద్రతరస్వచ్ఛయశస్సుమావృతదిగంతా, సంతతోత్సాహవ
ర్ధితనానాకవిరాజ, రాజనయవర్తీ, కీర్తితౌదార్య,భూ
ర్యతులప్రాభవ, శ్రీభవోల్లసితగాత్రా, గోత్రరక్షానిధీ. 197

క. గూఢపదకంకణోపమ
గాఢయశఃకాండ ఘటితకమలభవాండా
ప్రౌఢనృపనయవిహారా
వ్యూఢోరఃకలితరుచిసముజ్జ్వలహారా. 198

మాలిని.—

దినకరసమతేజా, తిమ్మమాంబాతనూజా,
కనకకుధరధైర్యా, కర్ణజిద్బాహుశౌర్యా,

వనధిసమగభీరా, వర్ణితశ్రీవిహారా,
జనవినుతచరిత్రా, సౌఖ్యలక్ష్మీకళత్రా. 199

గద్యము. ఇది శ్రీమత్తెనాలిరామేశ్వరశాశ్వతకృపాకటాక్ష లక్షితకవితాభిరామ రామయపండితకుమార సహజశైవాచారసంపన్న ధీమదన్నయనామధేయప్రణీతంబైన సుదక్షిణాపరిణయం బనుశృంగారకావ్యంబునందుఁ దృతీయాశ్వాసము.

శ్రీ

# సుదక్షిణాపరిణయము

## చతుర్థాశ్వాసము

శ్రీమత్తనుధామ, జయా
రామ, గుణోద్దామ, యిందిరాసుత్రామా
భూమబలభీమ, జగదభి
రామా, పులిజాలధామ, రామయసోమా. 1

తే. అవధరింపు మగస్త్యసంయమివరుండు
పలుకుఁగ ప్రంపువలి మీఱఁ బలుకు నిట్టు
"లవలికథ దెల్పు." మనురాఘువాధినాథుఁ
గాంచి రదనాంశుచంద్రికల్ గడలుకొనఁగ. 2

వ. "అయ్యవసరంబున: 3

### రత్నమయ సింహాగమనము

ఉ. గర్జితనిస్స్వనస్ఫురణఁ గ్రక్కదలం గులశైలకోటి య
తూర్జితవాలచాలనసముద్ధతి మిన్నగలంగ దృక్ప్రభా
స్ఫూర్జితవహ్నికీలములు భూవియదంతర మాక్రమింప సం
తర్జితజంతుయూథ మొకదంతివిరోధి రయాధికోన్నతిన్. 4

మ. చనుదేరం గని భిల్లవల్లభులు రాజన్యాగ్రణిం జూచి: "యో
జనితాటోపనృసింహ, సింహ మిదిగో, సంరంభగంభీరత

ర్జనరేఖం బఱతెంచె; నంపగములన్ జా నేయవే." యన్నఁ గ
గ్గొనల న్నవ్వుచు నవ్విభుండును రణోత్కటదండదోర్దండుఁడై.

చ. శర మరి నించి పొంచి రభసంబున నేయఁగ డాయునంతఁ గే
సరి సరి లేనివీఁకమెఱుఁ జంగన నింగికి దాఁటి యచ్చటన్
దరళతటిల్లతాసమతఁ దాండవ మించుక సేపు చేసి ది [చున్.
క్కరులకు గుండె తల్లడముగాఁ గడలన్ వడి సంచరించు

### రత్నమయసింహముఁ దఱుముకొని దిలీపుఁడు మంత్రినందనునితో చాల దవ్వేఁగుట

వ. క్రీడాసంచరిష్ణు వగుతరణికరణి ధరణికి డిగి సమీపంబున నిలుచుచు, రివ్వున దవ్వులకుం జనుచు, నతితీవ్రవేగంబునం బార్శ్వభాగంబులం బొడకట్టుచు, నికుంజపుంజంబుల నణంగుచు, విస్ఫులింగంబునుం బోలె నింగి కెగయుచు, నైంద్రజాలికుపోలిక విశంకటదంష్ట్రావిటంకనిరంకుశ ప్రభాధాళధళ్యంబుల నసమయసాంద్రచంద్రాతపంబులఁ బచరించుచు, నటునిపటిమఁ గుంభికుంభస్థలంబుల వ్రక్కలించి రుధిరబిందుచ్ఛటాసిక్తంబు లగుమౌక్తికంబుల గహనమహీరంగంబునకుం బుష్పాంజలి యాచరించుచు, మదనసారథిగమకంబున మెకంబు క్రొత్తనెత్తుట జొత్తిల్లునఖకింశుకంబుల పరువంబు చూపుచు, మహావీరుం డన నత్యూర్జితగర్జితస్ఫూర్జితంబుల నిఖిలభూభృద్గర్భనిర్భేదంబు గావించుచుం, బ్రళయపవనవిజృంభణంబుకైవడి నక్షేపవాలవిక్షేపంబుల గగనమార్గనిరర్గళసంచారివారిధరవితానంబుల విరియించుచుఁ, గాలకంధరకంధరానిర్గతకాలకూటశిఖిశిఖాస్ఫూర్తిమూర్తి వహించినజాడం జూడ నేదిక్కునం దానయై, పోటు

నకు నలవి గాక నదీనదంబులును బహుమహీధరవనపరం
పరలుం గడచి చనుసింహంబువెంట వెంటాడించి మించిన
యాగ్రహాతిశయంబునం జనుచుండ ధరాఖండలుం గూడ
నేరక యాయాయితరులనీడల సకలబలంబులుం జలంబు
దక్కి నిలిచెఁ; మంత్రినందనుం డగుసుదర్శనుం డొక్కరుండు
తోడునీడయుం బోలె ననుగమించి యరుగుచుండె. నయ్యవ
సరంబున: 7

ఉ. డాయఁగ వచ్చినం గని తటాలున మౌర్వి శరం బమర్చి తా
నేయఁగఁ బూనునంతనె మృగేంద్రము గ్రక్కున మాయ
మై యెటొ-పోయిన నద్భుతం బడర భూవిభుఁ డొక్క
రసాలభూరుహ-చ్ఛాయ నొకింత నిల్చి సరసంబుగఁ బల్కెఁ
బ్రధాననందనున్. 8

శా. "ఆకర్ణంబులు నావిలోచనము లాయంగంబు లాయాననం
బాకంఠాంచల మానఖప్రతతు లాహా, నూత్నరత్నప్రభా
నీకోత్సేకసమన్వితంబులు; రయోన్మేషంబు రోషంబు ను
ల్లోకంబుల్; నయలోల, యిట్టిహరి నేలోకంబునం జూచితే!

ఉ. చూచిన నేత్రపర్వ మగుసొంపు ఘటింపఁగఁ జాలుచారురు
గ్వీచిక లుల్లసిల్లెడు నవీనమణీమయదేహయష్టి; లో
నేచినకోపముం జలము నెచ్చఁగఁ జేయుచు నున్న; దుగ్రక
ర్మాచరణంబు; దీనిఁ దెగటార్పఁగ నేర్పు ఘటిల్ల దేమియున్."

వ. అనుటయుం బ్రధానతనయుండు: 11

చ. "కనకవినూత్నరత్నమయకాయవిలాసము నీజవంబుఁ గ
ల్గునె యలఘాలలోచనవిలోలవిలోచనతేజికైన! నె

వ్వనగజవైరి యేనియు భవన్న వచండధనుః ప్రయుక్తబా
ణనిహాతికిందొలంగి చనునా, మనునామతియెన్ని భంగులన్!"

క. అని విన్న వించునప్పుడ
ఘనాఘునరవోపమానగర్జార్భటి మిఁ
బెనుబీఁట లెగయ వెండియుఁ
జను దెంచెఁ మృగవిభుండు సక్రోధగతిన్. 13

దిలీపుని బాణహతిని సింహము హరిణియను నచ్చరయగుట

శా. కంటెం గంటి నటంచుఁ జంచలధనుఃకాండంబు గాఢంబు బ
ల్విం టన్నంటుగఁ గూర్చి రాజవరుఁ డుర్వీచక్ర మూఁటాడఁ
బె-న్మంటల్ మింటఁ జెలంగ నేయ నతిభీమప్రౌఢి నత్తూపు
మై-నం టెంబో యనుమాత్రఁ గేసరియు దివ్యస్త్రీత్వముం
జెందుచున్: 14

ఉ. గుబ్బలనిబ్బరంబుసిరిఁ గొంచెపుఁగౌ నసియాడఁ, గల్వపూ
మబ్బులఁ జూపుచూపు లలమన్మథుతూపులతోడు చూప; నా
గుబ్బగఁ గమ్మతావులు బుగుల్కొను మేను మెఱుంగులీనఁ; బె
ల్లబ్బుర మైనచెల్వమున నవ్వనలక్ష్మివిధంబు చూపుచున్. 15

సుగంధివృత్తము —
మ్రొక్కి కేలు మాళిఁ జేర్చుమోహనాంగిఁ జూచి: "పెం
పెక్కి నిక్కుసింహ మేడ! యీలతాంగి యేడ! యీ
చిక్కు మొక్కలంపుమాయచేఁత యాట నిక్క!" మం
చక్కురంగనేత్రఁ జూచి యాదరార్ద్రచిత్తుఁడై. 16

తే. "తరళవీక్షాసమాసక్తి హరిణి వయ్యు,
గమనలీలారసవ్యాప్తిఁ గరిణి వయ్యు,

నమితకచనిచయప్రౌఢిఁ జమరి వయ్యు,
నడుముననుసింహ మైతివి, నలినవదన!" 17

ఉ. నా విని చిన్న నవ్వు వదనంబునఁ గ్రొందొలకపొల్పు నిల్పఁ, బూ
దావులతావులై యమృతధారలమేరలు నై తనర్చువా
చావిభవంబు లెచ్చఁగ, రసాతలనాయకుఁ బల్కు మేచక
గ్రీవవిరోధి బంగరువుకిన్నర మీటినవీటు చూపుచున్: 18

తే. "స్వామి, నా లెఱుఁ గెఱిఁగింతుఁ జందమామ
డెందమునఁ గ్రీడసల్పుపాఠీనకేతు
రీతి నీవజ్రవేది సంప్రీతి నిల్వ
చిత్త మానందకందళాయత్తముగను." 19

వ. అనిన సంతోషితస్వాంతుండై మహీకాంతుండు తత్ప్రదర్శిత మణిమయవేదీవిటంకంబునం బ్రధానతనయవిస్తృతం బగు నవపల్లవాస్తరణంబున నాసీనుం డగుటయు నిటలతటఘటి తాంజలియై యామంజువాణి యిట్లనియె: 20

హరిణి తనవృత్తాంతమును దిలీపునకు వినిపించుట

చ. "హరిణి యటండ్రు నన్ను; దివిజాధిపుకొల్వున నుండునప్సర
స్తరుణులలోనఁ బేరు కలదాన; సదానయమార్గవర్తియై
పరఁగెడువీతహవ్యమునిపాలకుఁ డన్నిషధాద్రిధైర్యబం
ధురతఁ దపంబు సేయ విబుధుల్ చలియించుచు విన్నవించి
నన్. 21

తే. చేతికులిశంబు సటునైచి చింతవంత
మనసునెత్తమ్మి తహతహ మొనప వజ్రి
యతనినిష్ఠకు విఘ్నంబు నాచరింపఁ
దలఁచి కొలువున నున్న నావలను చూచి: 22

క. "హరిణీ, గమనవిధాజిత
కరిణీ, శృంగారసారకమనీయశ్రీ
సరణీ, ఘనజఘనావృత
ధరణీ!" యని చేరఁ బిల్చి తాత్పర్యమునన్. 23

క. "ఆవీతహవ్యమునితప
మీ పేటటి నడఁచి వచ్చితేనియు వినుమా,
నే వీతభయుఁడ నై శ్రీ
దేవసుతఖ్యాతిఁ గాంతు దివిజపదంబున్. 24

సీ. పరువెత్తుఘనులకుఁ బదములు గల్పింప,
నల్లనేరెడుఁబండ్లు తెల్లఁజేయ,
నద్దమరేప్రొద్దు ప్రొద్దు దీండ్రింపించఁ,
గుందేటికొదమకుఁ గొమ్ము చూప,
బయలఁ జిత్రంబులు ప్రత్యక్షముగ వ్రాయఁ,
జుక్కలిన్ని యటంచు లెక్క సేయఁ,
బెన్నీరు గిలకొట్టి వెన్నముద్ద లొనర్ప,
నుడుపథం బంతయుఁ బిడికిలింపఁ,
తే. గడమవన్నియు నిఁక నేల? కతకుఁ గాళ్లు
ముంతకుఁ జెవులుఁ, గల్పింప ముజ్జగములఁ
బడుపుజవరాండ్రకును దృణప్రాయ మహహా!
తపసిఁ దేల్చుట వింతయే తరుణి, నీకు?" 25

క. అని గారవించి పలికిన
విని గాఢోత్సుకత వేల్పువెలఁదులతో న
మ్ముని యుండునద్రి చేరం
జని నిండుమనంబుతోడ సరసప్రౌఢిన్. 26

ఉ. నవ్వుచు నెచ్చెలిం జివురునం గొని రువ్వుచు మవ్వమైన లేఁ
బువ్వులు గోయుచున్ వలపుఁబుప్పొడి మోములఁ జల్లి డా
యుచుం-జివ్వకుఁ జేరినట్లు రొద సేయుచుఁ జన్నుల మేను
రాయుచున్-అవ్వేలు చేసినన్ దపసి తాపతిమో యన నుండె
ధీరతన్. 27

క. పాటలఁ దీయనిమాటల
నాటల నమ్మౌనిధైర్య మావంతయునుం
బేటెత్తమిఁ జెనకితి నొక
పాటిగ నఖధార జీరువాఱన్ గళమున్. 28

ఆ. చెనకి యంతఁ బోక 'సింహంబు నీకంత
మించుకంతఁ గోరఁ జించె, తెప్ప
లెత్తి చూడు.' మన్న నెట్టనిచూపుల
నిప్పు లడరఁ గాంచి తప్పు లెంచి: 29

ఉ. "సింగము సించె నంచు ననుఁ జీరికి నెంచక కంఠసీమ న
య్యంగజహేలికుండు దురితాపగఁ దేలుచు వాఁడిగోరఁ జీ
రం గత మేమి? యేమి చతురత్వము గాంచితిదీన? దీనతా
సంగతి సంచరింపు వనశైలతటంబున సింహమూర్తి వై." 30

క. అని శపియించిన నించిన
వెనుపంతయుఁ దక్కి మ్రొక్కి ప్రియవాక్యములన్:
"మునినాథా, తేజోజిత
దిననాథా, కరుణ యింత దిగవిడఁ దగునే! 31

సీ. అవ్వారి మధువారి నివ్వటిల్లుచు నుండు
డాలుకెమ్మోవుల మేలు గలదె!

సూటి పాటింపక శ్రుతులఁ బల్మఱు దాఁటు
  చూపుల నిక్కడ చూపఁ గలదె?
సచ్చక్రవిఘటనస్వక్రమంబునఁ బొల్చు
  చన్నుల సాధుత్వ మెన్నఁ గలదె?
నాస్తివాదక్రియోపాస్తికి నెడముకొ
  న్నడుముల దార్ఢ్య మేనాఁటఁ గలదె?
తే. నటలు పల్కులు; వలవంత లటమటములు;
నిక్కములు సున్న; చపలముల్ నెమ్మనంబు;
లధికపాపస్వరూపిణు లగుట యరుదె
యంగనలు! వారిపై మఱి యలుగఁ దగదు." 32

చ. అని కనుఁదమ్మి తేనియల నంఘ్రియుగం బభిషేక మార్చినం
గని మునికుంజరుండు మదిఁ గప్పినకోప మొకింతమాని:" యో
వనరుహగంధి, నాపలు కవశ్యముఁదప్పదు; మాసమాత్ర నీ
తనువు దిలీపభూపనిశితప్రదరం బొకయింత నాటినన్; 33

తే. రత్నమయ మైనసింహవిగ్రహము మాని
మానితం బైననీతొంటిమేనుఁ దాల్తు;
పొమ్ము నీ."వని యంప నప్పూడ మృగేంద్ర
మూర్తిఁ దాల్చితి నీరీతిఁ గీర్తినిలయ! 34

వ. అట్లయ్యును బూర్వపుణ్యపరిపాకంబునం దొల్లింటియెఱుక దప్పక భవదాగమనప్రీతి నీరీతి భూయిష్ఠంబు లగుగోష్ఠంబుల కలజడి సేయుచుం దావకాలోకంబునం బూర్వపుణ్యమూర్తిఁ గైకొంటి. నమ్ముని కోపంబున శాపంబు నా కొసంగక ము న్నొక్కనాఁ డేను సుధర్మాస్థానసంస్థితుం డగునా

ఖండలునకు రాయంచ నాడించులీలం గేలు సారించి వింజా
మరంబు వేయుచుం గొల్చియున్న యవసరంబున: 36

నారదుఁ డింద్రున కెఱిఁగించిన
రత్నచూడవధోపాయమును హరిణిదిలీపునకుఁ జెప్పుట

సీ. పాటలపటుజటాపటలంబు శరదంబు
ధరచలచ్చపలావిధంబుఁ దాల్ప,
డాచేతిమణికమండలువు లీలాఖేల
దమరద్రుమంజరీసమత నిల్వ,
మరుదంకురాఘాతమహతీధ్వనిసురేభ
కటభృంగరంగదార్భటిఁ జెలంగఁ
గటి నున్నయజినంబు నటదలికేక్షణ
క్షితిభృత్తటాంబుదాకృతి వహింప,
తే సరసబహువిధవిద్యావిశారదుండు
ప్రచురతనుకాంతినిర్జితపారదుండు
నిఖిలసంయమిచాతకనీరదుండు
ననుచు సంతోషమున వచ్చె నారదుండు. 36

క. వచ్చినమౌనికి నెదురుగ
వచ్చి పదాంభోరుహముల వ్రాలుచు నర్ఘ్యం
బిచ్చి కృతార్థునుఁడై: "మీ
వచ్చుట భాగ్యంబు వెదకివచ్చుట గాదే." 37

తే. అనుడు నారదుఁ డనియెః "నోయనిమిషేంద్ర,
జలజభవుఁడు జలంధరాశ్రమముపొంత
నాత్మనిష్ఠ వసించినరత్నచూడ
దైత్యకులవల్లభునకుఁ బ్రత్యక్ష మగుచు. 38

క. "వర మిత్తు వేఁడు." మనినఁ
హరివైరియు మ్రొక్కి: "శస్త్రహతి మ త్తను వే
యరి చేరుఁ బోర నాతని
శిర మిలఁ బడుఁగాక వేయిచిదురుప లగుచున్." 39

చ. అనవుడు: "నట్టికాక"యని యంబుజసంభవుఁ డేఁగ నేను న
వ్వనరుహసూతిఁ గాంచి: "తగవా పగవాఁ డగువానిచేత నీ
యనిమిషసిద్ధసాధ్యఖచరాదులు నొచ్చు టెఱింగియుం బ్రి
యం-బెనయఁగ నివ్విధంబు వర మిచ్చితి; మెచ్చితి." వన్న
ధాతయున్. 40

వ. ఒండువిధం బానతిచ్చె; నది విను." మని శ్రవణంబు డాసి వదనచంద్రికలు తద్భూషామౌక్తికచ్ఛాయాదాయాదం బులై నిగుడ నొక్కయేకాంతవాక్యంబు సూక్ష్మస్వరంబునం దెలిపెఁ; గంకణక్రేంకారంబులకతంబున లెస్స విననైతిం "గన్యకు వరుం డగుదిలీపభూవరుం డద్దానవేశ్వరభుజా సంపద నొంపం జాలు." ననుమాట వింటిఁ; గన్యాశబ్దం బే కాని తజ్జనకశబ్దంబు విన దొరకదయ్యె; నారదుం: "డీవింత వార్త యెఱింగింప వచ్చితి నిలింపనాథ; యప్రమత్తుండవై యుండు." మని దీవించి చనియె. నాఖండలుండునుం గొలువుననున్న పుష్పకోదండుని డగ్గఱం బిలిచి తత్కర్ణపుటాంతిక న్యస్తవదనాంబుజుం డై యేమో రహస్యంబు నుడివినఁ దదనంతరంబ శంబరారాతి యొక్క కనకకేతకీపత్త్రంబు కరంబున ధరియించి సంతానలతాంతముకుళంబు మృగమదం బునం బదనుకొల్పి సమాధానమానసుం డై: 41

సీ. గగనమో! కాదు; మేఘకదంబ మనవచ్చు
మించుపాపటకాని మెఱుపుకతనఁ;
గొండలో! కావు; పూఁగుత్తు లౌ ననవచ్చుఁ
గమ్మగస్తురితేఁటికప్పుకతనఁ,
గుతలమో! కాదు; సైకతభాగ మనవచ్చు
నడువచ్చు మొలనూలినాఁచుకతనఁ;
దలిరులో! కావు; కెందామర లనవచ్చు
రవలిమట్టెలమించురజముకతన;
తే. నీలములో, పైఁడికుండలో, నిర్భరేభ
మౌళిదేశంబొ, లత్తుకడాలుసిరులొ!
యనఁగఁ గచములఁ గుచములఁ బెనుపిఱుందు
నడుగులను వ్రాసి వ్రాసె లతాంగి నొకర్త. 42
క. రవిదీప్తిచెంత నిల్చిన
దివియలక్రియ ఫలకలిఖితతిలకినియెదుటన్
రవివంశతిలక, రంభా
దివధూనికరంబు నిలిపి తేరినకాంతిన్. 43
తే. వేయికన్నులు గల్గినవిభవమునకు
సరససాఫల్యయోగంబు సంభవింప
భావభవుఁడు లిఖించు నప్పడఁతిఁ జూచి
యమరభర్త శిరఃకంప మాచరించి: 44
ఉ. "మేలు, బళీ, చతుర్ముఖుఁడు మిక్కిలినేర్పరి; యెట్టులన్న నీ
బాలిక మాదిలీపనరపాలకుదేవిగ నిశ్చయించె; ల
క్ష్మీలలనేశునాభిసరసీరుహమందిరవర్తి యైనవాఁ
డేలయొనర్చు వేదజడుఁడేనియు నీడుకు రానిచేఁతలన్!" 45

క. అని కొల్వువారి నందఱ
ననిచి మహేంద్రుండు మందిరాంతరమునకుం
జనియెన్ లతాంగి యేనృపు
తనయామణియో యెఱుంగఁ దరణికులేంద్రా! 46

ఉ. నీకరుణాకటాక్షమున నిక్కపురూపు వహింపఁ గంటి; నీ
యాకృతి చూడఁ గంటి; భ్రమదాంబుధిఁ దెప్పలఁ దేలఁ
గంటి న-న్నాకముచేరఁగంటి; నమరాధిపువెండియుఁ గొల్వఁ
గంటి; భూ-లోకమహేంద్ర, యచ్చరచెలుల్ గని మెచ్చఁ
గఁ బోయివచ్చెదన్." 47

వ. అనిన నమ్మహీమహేంద్రుండు: 48

క. "అమృతాంబుధి నుద్భవమై
యమృతకరుఁడు మోము గాఁగ నధరంబున న
య్యమృతంబు దాల్చు నీ వీ
యమృతాలాపములఁ దేల్చు టద్భుతమె చెలీ!" 49

తే. అనుచు ననిచిన ననిచినహర్ష రేఖ
దివిజపురమున కేఁగె నచ్చివురుఁబోఁడి
యవనినాయకుఁ డున్నచో టరసికొనుచు
సైన్యసంఘంబుఁ గదిసె నాసమయమునను. 50

క. అరవిందమందిరాంతర
ఖురళిఁ బరాగంబు నలఁదికొను తేఁటులతో
సరి పెనఁగి యలసి సొలసిన
కరణిం జనుదెంచె నంత గంధవహంబుల్. 51

ఉ. ఆనునఁ దెమ్మెరల్ మెలఁగునందము డెందముఁ గందళింప
భూ-జాని నిజానివార్యమృగసంహరణశ్రమ ముజ్జగింప న

చ్చో నొకకొంతదవ్వు చని జొంపపుఁబూఁబొదరిండ్ల సోన
పూ-దేనియవాఁకఁ గమ్మవిరి దెప్పల దాఁటి పురస్థ్సలంబునన్.

క. కంజాతకుముదకువలయ
సంజాతమరందబిందుసౌరభ్యనట
చ్ఛింజానమత్తమధుకర
గంజాయిత మొక్క కొలనుఁ గనుఁగొని యచటన్. 53

వ. మరకతమణిస్తంభగంభీరసోపానసమర్థం బగునొక్క తీర్థంబు
నధివసించి కృతావగాహుం డై లఘుధౌతపరిధానవరణం
బవధరించి మంజుకంజాతసంజాతకింజల్క పింజరం బగునీరం
బున నమూరుసారథికి నర్ఘ్యం బొసంగి సుదర్శనకరావలంబ
నుం డై తత్తటస్థలి మాధవీమంటపంబునకు విజయంబు చేసి
పరిజనానీతబహువిధాహారవిహారంబులం బరితృప్తి వహించి
పరిమళమిళితవివిధలేపనోద్దీపితాంగకుం డై కర్పూరతాం
బూలచర్వణంబు నొనరించుచు నుచితకథాకథనకేళిశ్రవణ
పరాయణత్వంబునం గొంతప్రొద్దు గడపి కనుపన్నం బరి
జనంబుల ననిచి ప్రధాననందనుం గనుంగొని: 54

క. "హరిణీవాక్యము వింటివె
తరుణిం దాఁ గన్నయట్టిధన్యాత్మకుఁ డే
ధరణీనాథుఁడొ మది నీ
వరయంగా వలదె!" యనుడు నాసచివుండున్. 55

{ సుదర్శనుఁడు శృంగారమాలికవలన వినిన సుదక్షిణా
వృత్తాంతమును దిలీపున కెఱిఁగించుట }

సీ. జగతీతలాధ్యక్ష సాకేతనగరోప
వనవీథి నొకనాఁడు తనకెలఁకుల

సమవయోరూపవేషవిశేషభూషితు
లైనబాలకులు రా హర్ష మొదవి
కేలికాగతి నేఁగి కెందమ్మికెంపుల
మగతుమ్మెదలకప్పుమానికముల,
సురుపుముత్తియముల, సునునాఁచుఁబచ్చల
బలుతేనెతుంపరపవడములను,

తే. దనకు రత్నాకరముతోడిపెనుపు దనర
వలను మీఱంగ నొకతమ్మికొలనికెలనఁ
జలువ తెమ్మెర లింపులు గులుకుచుండ
నుబుసుపోకకు నే నటు లుండునంత: 56

తే. డేగ యొక్కటి యతితీవ్రవేగ మడర
నిగిడి పోనీక వెనువెంటఁ దగిలి రాఁగ
సాధ్వసంబునఁ జనుదెంచి చక్రవాకి
ఘోర్తి ననుఁ జేరి పల్కెఁ బ్రియోక్తి నిట్లు: 57

చ. "సచివకుమార, నీమఱుఁగు చయ్యనఁ జొచ్చితి; నొచ్చితిన్,
జగత్-ప్రచయభయంకరాక్రమణభంగిఁ జెలంగెడుడేగ
వెన్కొనెన్;-గుచరితు లావిపద్దశలఁ గూరినవారి నుపేక్ష
సేయఁగా-సుచరితు లార్తరక్షణవిశుద్ధవిలాసయశోవశోద
యుల్. 58

తే. అనుడు వెఱవకు మంచుఁ బటాంచలమునఁ
గప్పుటయుఁ జూచి డేగ యుగ్రంపురవళిఁ
దిరుగ కురువడి నామీఁద నరుగుదేర
రూక్షహుంకార మొనరింప నాక్షణమున. 59

సీ. భల్లూకరోమశ ప్రబలాంగసైంధవ
స్కంధబంధురశతాంగంబుతోడఁ
గాలకంధరకంఠకాలకూటకృపీట
జననధూమశ్యామతనువుతోడ
విలయధూమధ్వజాకులమహార్చిర్వార
శితదీర్ఘదీర్ఘోగ్రజిహ్వతోడఁ
గల్యాణగిరిగుహాగర్భనిర్భేదన
వ్యాపారఘోరారవంబుతోడఁ
తే దఱచు మిణుఁగుర్లు గ్రమ్ము నేత్రములతోడ
నుడుపథముదాటు నీల్కైనపాదవుతోడ
వికటనృకరోటికంఠమాలికలతోడ
విస్మయంబుగ దైత్యుండు భస్మ మయ్యె. 60

క. ఆసంరంభముఁ గనుఁగొని
నాసంగడిబాలు రెల్ల నానాగతులం
ద్రాసముతోఁ బఱచిరి దర
హాసముతో నేను నిలువుఁ డని పలుకంగన్. 61

ఉ. క్రొత్తమెఱుంగుము త్తియపుఁగోవయొ, వాలుమెఱుంగుఁ
దీవయో,-చిత్తజుపూవువిల్లొ మఱి చెల్వముపుట్టినయిల్లొకో,
యనఁ-మత్తగజేంద్రయాన యగుమానినియై నిలిచెం
బటాంచలం-బత్తఱి నిర్గమించి జగదద్భుతవైఖరిఁ జక్రవాకి
యున్. 62

క. "పడఁతీ, యెవ్వరు నీ?" వని
యడిగిన ననుఁ జూచి పల్కె నంగన పలుకుల్

వెడవిల్తునివిరితూపుల
వెడలుమరందంబునకును విందులు గాఁగన్. 63

తే. "సాధ్యలోకాధినాథుఁ డాచంద్రపాలుఁ
డనఘు, మాతండ్రి; లోకత్రయంబునందుఁ
గేలిఁ జరియింతు శృంగారమాలికాభి
ధానమున; నేర్తు నొకకొంత గానవిద్య. 64

క. వాణిసభ గౌరిసభ హరి
రాణిసభక్ సంచరింతు రాజితవీణా
క్వాణోల్లాసవిలాసధు
రీణకళాకలితమాధురీసాధురతిన్. 65

సురథునివృత్తాంతము.

చ. అతులితకీర్తి మజ్జనకుఁ డాశ్రితవారిధి చంద్రపాలకుం
డతిశితబాణదారితమహారినృపాలకమూర్తి మాగధ
క్షితిపతి పుణ్యగణ్యనిజశీలుఁ డలోలుఁడు నిత్యవైభవ
స్థితసురథుండునుం జెలిమి చేసి చరింపుదు రేకచిత్తులై. 66

సీ. కలలోన నేనియుఁ గపటకృత్యము లేక
కడసాగుగుణములకలిమి చెలిమి
ధనమనోవంచకత్వము లేశమును లేక
యేపుదీపించినయొలమి చెలిమి
యొండొరుమదులలో నొరపొరలు లేక
ప్రాపు దాపున నైనబలిమి చెలిమి
ప్రాణంబు ప్రాణంబు లై వింత లెద లేక
హత్తినఁ దగుజయం బలిమి చెలిమి

తే. కెలని కెడ మీఁక తగువగల్ గలిమి చెలిమి
చూచి వారించుఁ బెఱవారిఁ జులిమి చెలిమి
నూళ్లొసంగనిరిపులచే నులిమి చెలిమి
చెప్ప నిఁక నేల వారలచెలిమిబలిమి. 67

రత్నచూడుఁడు సురథునిరాజ్యమును ధ్వంసముచేయుట.

చ. ఇటువలె నుండ నాసురథుఁ డేలెడుధారుణి దారుణక్రమో
త్కటభుజసంపదం గలఁచి కాఱియఁ బెట్టుచు నుండు విక్ర
మోద్భటభటవాహదంతిరథపఙ్క్తిసమేతుఁడు రత్నచూ
డుఁ డాకుటిలనిశాటుబారిఁ బడి కుందుదు రయ్యమరేంద్ర
ముఖ్యులున్. 68

సీ. తోఁటదోడ్డి యనెడిమాట లేకుండఁగఁ,
గాలువక్రంతలక్రం దడంగఁ,
బైరుపచ్చలు లేక ప్రజలు నెమ్మదిఁ గుంద,
నిల్లుముంగిలి యను టిల్ల గాఁగ,
మానిసిమత్రలు గానిపించఁగ నీక,
పల్లెపట్టులు సివపాడు గాఁగఁ,
బసరముపెయ్యలపస యెక్కడో చనఁ,
జెట్టుచేమలయునికిపట్టు వదల,
తే. సురథభూపాలుఁ డేలెడిధరణి యెల్ల
నిచ్చ రాయిడిఁ బీడించు నికట మగుట
మదభరాంధత్వమునఁ దన కెదురు లేక
మందరాచలవాసి యమ్మానవాశి. 69

శా. వాఁడే కాఁడె సురాధినాథనగరద్వారంబు దాఁకె; న్మరిఁ
వాఁడే కాఁడె యశస్కరం బనుచు దుర్వారోద్ధతిఁ వచ్చినఁ

వేఁడిం బాసి బలారి యింక నెచటన్ లేఁడే యనం బోయెఁ
దన్ - గాఁడం దూఱునిశాతమార్గణశలాకల్ నొప్పి
నొప్పించినన్. 70

తే. వైభవంబునఁ జంపకావతిపురంబు
నేలుసురథుండు దైత్యుచేఁ జాలఁ దూలి
యలకుశస్థాన మనియెడునాశ్రమమున
కరిగి శాండిల్యునకు వినయమున మ్రొక్కి: 71

క. "మునినాథ, రత్నచూడుం
దునుమాడఁగఁ జాలుపుత్త్రు ధూర్తారివిభం
జనకీర్తిపాత్రు నీవే!"
యనుటయు మునినాథుఁ డనియె నాతనితోడన్. 72

సీ. జడరాశి డాఁగనిబడబానలజ్వాల,
మృడుఁడు ఖండింపనిమృత్యుదంష్ట్ర,
శాంతి యెన్నఁడు లేనిసంహారరుద్రుండు,
పక్షముల్ చిదుమనిపర్వతంబు,
శూలికంఠబిలంబు చొరనిహాలహాలంబు,
వనదంబుఁ దగులనివైద్యుతాగ్ని,
పన్నగారికి నెదుర్పడనిమహాఫణి,
ఫణివాతఁ బడనిప్రభంజనంబుఁ,
తే. గాక కేవలదైత్యుండె కఠినశౌర్య
పాటితామర్త్యవిభుఁడు నిశాటవరుఁడు!
వానిఁ ద్రుంచుట యెరికి వలఁతి యగునె!
బుద్ధి నీ వేమి యెఱుఁగవా భూతలేంద్ర! 73

ఉ. బాలిక యోర్తు నీకు నరపాలక, కల్గు దిలీపధారుణీ
పాలకుఁ డాతలోదరికి భర్త యగుః; రణశూరుఁ డాతఁ;
డా-భీలసమిన్మహిః దివిజభేది వెసం దునుమాడు; జాహ్నవీ
కూలమునందుఁ జేయు మనుకూలగతిః శిఖిఁగూర్చి జన్న
ముల్." 74

—◎{ సురథుఁడు శాండిల్యోపదేశమున నగ్నిదేవునిఁ గూర్చి యాగము చేయుట }◎—

తే. అనుడు రాజవతంసంబు హంసకేలి
కావధూమణి రప్పించి గంగఁ గాంచి
కేలు ఫాలస్థలంబునఁ గీలుకొల్పి
సన్నుతులు సేయు వాచాటచాటుధార: 75

లయ. "గంగ మది మోదము దగంగ దురితంబు లణఁగంగ
సుకృతంబు లెసఁగంగ శుభముల్ సా-గంగ నలముక్తి మరు
గంగ భవుఁ డాత్మఁ గరఁగంగ సిరు లెందుఁ జెలఁగంగ భవ
ముల్ వీఁ-గంగ జగమెల్ల నెఱుఁగంగ జయలక్ష్మి పరగంగఁ
బెఱచింత సురుగంగ మమతల్ గ్రాఁ-గంగ వ్రతకోటి పెరు
గంగ హృదయార్తి దొలఁగంగ జడబుద్ధి యరుగంగ నినుఁ
గొల్తున్. 76

చ. కుడిచెవిఁ జేరి మంచుమలకూరిమియల్లుఁడు తారకంబు ము
న్నొడువునఁ గూర్చి పల్కుచు వినోదము సల్పఁగ నేద దేరి చె
ట్టడిచినఁ జేరెఁడన్ని నిటలాంబకమూర్తులు గాన వచ్చు; నా
మడఁ బరువెత్త నేల నఘమర్దననిర్దయ యైన కాశికన్. 77

తే. అట్టి కాశికి విశ్వనాయకునిమౌళి
భాగమునకును నీవ యాభరణ మైతి;

చేరి నీవారి తానంబుసేయువారి
యఘువిదారణతరవారి యగుట యరుదె!" 78

క. అని సన్నుతించి మునిపతి
యనుమతి జనవిభుఁ డొనర్చె యాగంబు సుధీ
జనులను బహుదక్షిణలం
దనుపుచుఁ బావకునిఁగూర్చి తత్తటభూమిన్. 79

వ అయ్యవసరంబున; 80

{ అగ్ని దేవుఁడు ప్రత్యక్షమయి సురథునకు సుదక్షిణయను పుత్త్రికనొసగుట. }

సీ. "ఘనకిరీటప్రభల్ గాఁబోలుఁ! గావు వో
దలనైనకీలలకొలము గాని;
కాఁకఁ బెట్టినహేమకమలముల్ గాఁబోలుఁ!
గావు వో; జిగినెమ్మొగములు గాని;
యమరు లిచ్చినకల్పకాంజలుల్ గాఁబోలుఁ!
గావు వో శుభవిలోకములు గాని;
కరుణాబ్ధివీచికల్ గాఁబోలుఁ! గావు వో
సముదగ్రబాహుదండములు గాని;"

తే. యనుచు మును లచ్చెరువుఁ బొంద యాగవేదిఁ
దగరుఁదత్తడితోడఁ బ్రత్యక్షమయ్యె,
వేఁడియయ్యను బుధమనోపీథులందుఁ
జల్లనై కొల్వ సేయుతజ్జ్వలనమూర్తి 81

ఉ. సన్నిధి సేయువహ్నిఁ గని చాఁగిలి మ్రొక్కి విభుండుభక్తిమై
సన్నుతు లాచరింపఁగఁ బ్రసన్నతఁ బొంది నృపాలుదేవికిన్

గన్నె మెఱుంగువంటియొకకన్నియ నిచ్చి: "శివారివిభ్రమో
త్పన్న సుమీ పురాకలితభాగ్యము బాల ఫలించె నీక్రియన్.

తే. బహుసుదక్షిణ లిచ్చి మద్భక్తి వెలయఁ
గ్రతు వొనర్చినఫలమునఁ గలిగెఁ గాన
ధర సుదక్షిణ యను పేరఁ బరఁగు నీకు
మారి యారూఢభుజవిక్రమారిహరణ." 83

చ. అని యనలుండు వోవుటయు నగ్గురునానతి భూమిపాలుఁ డ
వ్వనితయుఁ దాను నాప్తభటవర్గముఁ గొల్వ రథాధిరూఢుఁడై
తనపురి కేఁగి భూభరము దాల్చెఁ దొల్లిటిలీల వైరిభం
జనచణనిర్ఘృణాసిరుచిచండమహాభుజదండపీఠికన్. 84

క. వనజాక్షి హంసకేలిక
యనిలసఖుం డొసఁగునిసువు నందినమొదలుగా
ననగుత్తులఁ దేనియవలెఁ
జనుబిందెలయందుఁ బాలు జలజలఁ గురియున్. 85

సుదక్షిణాసౌందర్యవర్ణనము

తే. ప్రతిపదైందవకళఁ బూర్ణభావఁ జేయు
సమయగతి వోలె సురథేంద్రచంద్రవదన
పెంపు నొందింప నుపచారభేదగతుల
నాకుమారియుఁ లేఁబ్రాయ మధిగమించె. 86

క. కటితటముబటువుఁ జనుఁగవ
పుటపుటయు విలోచనాంతముల కొఱసిగ్గుల్
కుటిలాలకములనిగ్గులు
నటునిటు బాల్యంబుఁ గొంత యసియాడించెన్. 87

ఉ. సిగ్గులయుగ్గు లూడ్చి గుటి చించుక వంచుక వచ్చుచూపులన్
న్నిగ్గులె కాని పాదిపాటి నిక్కుచుఁ గ్రిక్కిఱియంగ లేని చ
న్మొగ్గలు తావు లిచ్చు టని నూలునఁ బట్టినసాటి ముత్తెముల్
తగ్గక యొప్పెఁ గోమలికిఁ దత్సమయోచితయౌవనంబునన్.

సీ. ఉన్కినున్కినె కల్గె నొకవింతపసవంబు
మినుమిను క్కనుచనుమిట్టలకును;
గనుపట్టె నాకస్మికముగ వేఱొకనిగ్గు
తళుతళు క్కనుకుచస్తబకములకుఁ;
గదిసె నెప్పుడు నెందుఁ గాని లేనిమెఱుంగు
దిగదిగ మను మేనుదీవియకును;
హెచ్చె నెన్నఁడుఁ జూచి యెఱుఁగనిచెలువంబు
చకచకల్ గలముఖజలజమునకుఁ;
తే. గన్నుఁగోనల నొకడాలు చెన్ను మీఱెఁ;
గటితటంబున నొకలాఁతిబటువు నిలిచె;
రాజవదనకు మారసామ్రాజ్యమహిమ
నుప్పతిలఁ జేయునవయౌవనోదయమున. 89

శా. పంచారించెఁ గుచద్వయంబు; శరసంపాతంబుల స్మితె దీ
ర్ఘాంచల్లోలకటాక్షవీక్షణము; లొయ్యారంబు దైవాఱె ము
న్మించున్ మించుశరీరయష్టి; తలరాణిం బుచ్చెఁ జేతోభవుం
గాంచీనామ మదభ్రవిభ్రమరతిం గన్పట్టుప్రాయంబునన్. 90

మహాస్రగ్ధర—

కరియానం గంబుకంఠిం గరజితకమలం గచ్ఛపాకారపాదం
దరలాక్షిం దన్వి దంతోత్కరవిజితమణిం దారహారస్తనశ్రీఁ
దరుణిం బింబాధరోష్ఠిం దటిదధికతనూధామఁ బోల్పంగ నౌ

నా-హారి దేవేరిఁ మనోభూహరుసతి మరుశుద్ధాంత కాంతా
మతల్లిన్. 91

వ. ఇవ్విధంబున నవ్వరారోహ నవయావనోదయంబునఁ బొగరు
మీఱుచిగురుంగైదువు మిటారికటారివిధంబున వికటారి
హారుం డగుతంద్రిమందిరంబున మందరకంధరంబునఁ బ్రవ
ర్ధిల్లురత్నశలాకయుం బోలె నభినవకళాకలిత యై విలసిల్లు
నయ్యవసరంబున. 92

{ నారదుఁడు రత్నచూడునొద్దకుఁబోయి సురథుని వరవృత్తాంతమును జెప్పుట. }

సీ. పాటకు మది మెచ్చి భర్మచేలుం డిచ్చు
కట్టువర్గము తలఁ జుట్టె ననఁగఁ,
దనయుండు గాన విద్యాపరిగ్రహవేళ
నలసరస్వతిచేత నందె ననఁగ,
దేహకాంతికి నిగ్గు రా హరిణాంకుచేఁ
గరపజ్క్తి కరముగాఁ గాంచె ననఁగఁ,
దనదైనసుజనమందారత్వ మెల్లచోఁ
జాటంగఁ బూనుమంజరి యనంగ,
తే. జడలు బంగారువీణెయుఁ జంద్రకాంత
ఘటితజపమాలికయుఁ గుండికయు ధరించి
కమలసంభవసూతి యాకస్మికముగఁ
జనియె నొకనాఁడు మంథానశైలమునకు. 93

వ. చని తదగ్రవసుంధరాస్థలగంధసింధురంబునకు రంతివేసినపగిది
నగణితమణిమయూఖచ్ఛటాచ్ఛాదితదిశావారంబై యొప్పు
నిలింపకంపనుహాజారంబుఁదారంబోవునంత ఫణిహారులవలన

నెఱింగి యెదురు చనుదెంచి రత్నచూడుండు చూడా
సంఘటిత మణికిరణరాజిం దదీయచరణరాజీవంబులకు నీరా
జనం బాచరించి యంతఃపురప్రాంతం బగునేకాంతనిశాం
తంబునకుఁ దోడ్కొని పోయి సమంచితభద్రపీఠంబున నిలిపి
యర్ఘ్యపాద్యాదివిధులం బూజించి తదనుమతిం దాను
నాసీనుండై యి ట్లనియె: 94

ఉ. "ఎక్కడనుండి వచ్చితి మునీంద్ర; మహేంద్రునివీటినుండి
యో;-యక్కమలామనోహరున కాస్పద మౌ తెలిదీవినుండి
యో;-పుక్కిటియందు నిందుముఖిఁ బూనినవేలుపు టెంకి
నుండి యో;-చక్కెరవిల్తు నేర్చుదొరసావడినుండియొ; ధాత్రి
నుండి యో!" 95

వ. అనిన నమ్మునీంద్రుండు: 96

తే. "హేమగిరిధైర్య, యిపుడు నీ వెన్నినట్టి
యిందిరేశాదిధామంబు లెల్లఁ జూచి
యుర్వి కేతెంచి యక్కడ నొక్కవింత
వార్త విని వచ్చినాఁడ నీవాఁడఁ గాన: 97

సీ. నిను గెల్వఁ జాలునందనుఁ గోరి సురథుండు
జాతవేదునిఁ గూర్చి జన్న మొకటి
సేయఁ బ్రత్యక్షుమై: "చేయుదు నీకోర్కి;
యొఱఁగింపు." మన నమ్మహీశ్వరుండు
తనపూన్కిఁ దెలుప: "నందనుఁడు లేఁ; డొకకన్నె
జనియించు; నజ్జలజాతవదన
వరియించునతఁ డేర్చు వాసవాహితు." నంచు
వరమిచ్చి చనియెఁ బావకుఁడు రాజ

తే. వరునకును గల్గె నొకబాల వాలుమెఱుఁగు
తెఱఁగునెమ్మేనితోడ నామెఱుఁగుఁబోఁడి
యించుప్రాయంబుమై నున్న; దీతెఱంగు
నీకు నెఱిఁగింప వచ్చితి నిర్జరారి. 98

క. దొరలకుఁ బరాకు దగునే!
యరయంగా వలదె సకలయత్నంబులనుం
జరముఖవార్తల; నీతి
స్ఫురణం బిటు వింటె; యేము పోయెద." మనుచున్. 99

క. తేలునవలె మీటి యమ్ముని
పాలుఁడు పోవుటయు దనుజపాలుఁడు సేనా
కోలాహలములు నిర్జర
హాలాహలములుగఁ గదలి యాగ్రహ మెసఁగన్. 100

రత్నచూడుఁడు చంపకావతిపయి దండెత్తి పోవుట

ఉ. అప్పుడు మందరాద్రి డిగి యాసురథాధిపుచంపకావతిం
దప్పక చుట్టుముట్టి భుజదర్ప మెలర్ప నగడ్త పూడ్చి పె
న్గప్పలు గాఁగఁ గోటయును గూల్పఁగఁ బంపిడియెం బురీజనం
బొప్పఱి పద్మినీదళపయోలవలీలఁ దలంకుచుండఁగన్. 101

వ. అప్పుడు: 102

క. "మిన్నక యుండుట గా."దని
యన్నరభోజికిని గప్ప మంపెఁ సురథుం
డున్నతపుఁగరుల హారులం
గన్నెల రత్నముల గంధకర్పూరములన్. 103

వ. అంపినం గొనిపోయి వృద్ధామాత్యులు నిలింపవైరిం గనుం గొని: "దేవర ప్రతాపంబునకు నేము నొక్కెదు రే! చెప్పిన పనుపు చేసెదము; దెప్పరంబు లగుబలంబుల మరలించి యొక్కింత యెడ గలుగ విడియింపు." మనుటయుం గొంత శాంతుం డై యా నిర్జరాంతకుండు: 104

క. "సురథుం డనలునివరమునఁ,
బొరసినసుత నిచ్చెనేని పోయెద; లేదా
శరవహ్నిజ్వాలల, నీ
పురమంతయుఁ బ్రేల్చువాఁడఁ బో నిమిషమునన్." 105

చ. అన విని మంత్రు లవ్విభున కవ్విధ మంతయుఁ దెల్పి రాజుచే
ననుమతిఁ గాంచి వచ్చి: "దనుజాధిప, యోజనమాత్రభూ
మికిఁ-వెనుకని నేల బాశిమయి నిల్వుము; రేపు మదీయ
భర్త నం-దనిఁ గొని తెచ్చి యిచ్చుఁ బ్రమదంబున నీకుఁ గర
గ్రహంబుగన్." 106

ఆ. అనిన నట్ల నిల్చి యవ్వంచనాబుద్ధి
తెలియ కాత్మవాహినుల మరల్చి
మురళిపొంత విడిసె నరుణాంశుఁ డపరాద్రి
శిఖరి దాసనంబుచెలువు పూన. 107

క. ఆరాత్రి సురథుఁ డాప్తులఁ
జేరం బిలిపించి: "యేమి సేయుదు? రక్షో
వీరునకుఁ గూఁతు నిచ్చిన
వీరత్వముఁ గులముఁ దపము వెలుతులు గావే!" 108

క. అని శాండిల్యమునీశ్వరుఁ
దనతలఁపున నిలుపుటయును దత్క్షణమున స

జ్జననిధి సన్నిధి నైయ
మ్మునిలోకవిభుండు రాజముఖ్యునిఁ బలుకున్. 109

మ. "జననాథా, దిననాథతేజ, మదిలో సంతాప మింతేల? య
వ్వనజాతాక్షుఁడు వార్ధిశాయి త్రిజగద్వంద్యుండు లక్ష్మీమనో
వనజాతాంబుజబాంధవుండు కలఁ డావంతైన నీవంత హృ
ద్వనజాతంబునఁ జాలఁ దేలుజగదాధారంబు సేవింపవే." (?)

క. అని యొక్కదివ్యమంత్రము
జనపతి కుపదేశ మిచ్చి: "సతియు న్నీవు
మనుజేంద్ర, డెందమునఁ జిం
తన సేయు; ప్రసన్నుఁ డగు ముఖంబున హరియున్." 111

### శాండిల్యుఁ డుపదేశించిన దివ్యమంత్రజపప్రభావమున సురథుకడకు విష్ణుదేవుఁడు వైనతేయునిఁ బంపుట

తే. అని మునీశ్వరుఁ డేఁగిన నాక్షణమున,
నాదితత్త్వంబు నిల్పి హృదంతరమున
ముకుళితాక్షిసరోజుఁడై ముఖ్యనిష్ఠ,
జపము గావింప నాలవజామునందు: 112

సీ. అదె సుధాకరబింబ; మౌనొకో కావొకో!
కాదు; చక్కని నెమ్మొగంబు గాని;
యదె పక్షయుతమేరు; వౌనొకో; కావొకో!
కాదు; సందీప్తవిగ్రహము గాని;
యవె కల్పతరుశాఖ; లౌనొకో కావొకో!
కావు; మహాభుజాగ్రములు గాని

యవె మణిస్తంభంబు; లౌనౌకో, కావౌకో!
కావు; పృథూరుయుగంబు గాని;
తే. యనుచు జగములు గొనియాడ యాక్షణమున
శౌరి దనుఁ బంపఁ బవనాతిజవనరేఖ
వైనతేయుండు పరమపావనవిధేయుఁ
డరుగుదెంచె వసుంధరాధ్యక్షుకడకు. 113

ఉ. వచ్చినయారమారమణవాహముఁ గన్గొని భూవరుండు లో
నచ్చినభక్తియుక్తిఁ దననాతియుఁ దానుఁ గృతప్రణాముఁడై
ముచ్చటమై నుతింప ఖగముఖ్యుఁడు నవ్విభుఁ జూచి యంత
"లో-మెచ్చె రమావిభుండు తుద మీఱిననీమహనీయభక్తి
కిన్. 114

ఉ. దానవుఁ జంప నిప్పటికిఁ దావకబాహుబలంబు చాల; ద
న్మానవభుగ్వరేణ్య నతిమానుషశాలి మరల్పఁ బోల దె
వ్వానికిఁ; దేవదేవునకు వాంఛితరూపనివాస మై జగ
న్మానిత మొక్కశైల మసమప్రభఁ బొల్చు ధరాతలంబునన్.

వ. అచ్చటఁ జతుర్భుజుండు చతుర్ముఖముఖనిఖిలబర్హిర్ముఖుం డై
విమానాంతరంబున నధివసించి యుండు; నక్కొండ యరా
తులకుం దేఱిచూడ నలవి గాదు; రాక్షసుండు దెగటాఱు
నంతకు నిన్ను, నీసర్వసంపదలు సర్వేశ్వరుం డచట నునిచి
రక్షించు; నావెంటఁ జనుదెమ్ము; కరితురగరథభటసమేతంబు
గా నీపురంబును, నిన్ను, నీవారి నద్దానవారి శైలంబునకు
నాకర్షించెద." ననుటయు నమ్మహీవల్లభుం డుల్లంబు పల్లవింప
నకంపితోత్సాహుండై సమ్మతించిన: 116

వైనతేయుఁడు సురథు నాతని నగరముతోఁ గూడ నాకర్షించి విష్ణుదేవుఁడుండు శైలమునకుఁ గొనిపోవుట.

సీ. అసురవీరులచేత నదవద లగుపాటి
యే కాని పురికోట లెడలకుండ,
నిద్రించువారును నెలఁతలతో మేల
మాడువారును దమయట్ల యుండఁ,
గరులుఁ దేరులుఁ దురంగంబులు సుభటులు
మున్నున్న రీతిని జెన్ను మీఱ,
ఘంటలఘణఘణాత్కారంబు లడరంగఁ
బ్రహరివారలు పూర్వభంగి మ్రోయఁ,
తే. జీమ చిటు కన కుండంగఁ జిత్రపటము
వెంటఁ గళ దేల్చుకైవడి, వింట నోడ
నడపుచందాన నాకర్షణం బొనర్చె
వైనతేయుండు చంపకావతిపురంబు. 117

క. ఇటువలె విహంగవిభుఁ డ
ప్పాటభేదన మఖిలవిభవములతో రాధా
విటకటకధరాధరరా
ట్కటకగుహం జేర్చి శౌరికడకుం జనియెన్. 118

చ. ఇటు లమరాహితుండును నరేంద్రుఁడు చేసినవంచనంబు
హృ-త్పుటపరితాపముం బెనుపఁ బూనికి దప్పినభోగియుం
బలెం-గుటిలతఁ గ్రమ్మఱంగఁ దరికొండకు నేఁగి విరోధి
వోవుచో-ప్పటఁ దెలియంగ లేక యుసురంచుఁ దలంకుచు
నుండ నిచ్చటన్. 119

చ. సురథనృపాలపుత్త్రి రుచిశోభితగాత్త్రి సుదక్షిణాఖ్య యా
తరుణియు నన్ను మన్ననలఁ దన్పుచు నెచ్చెలిగా నొనర్చి
యో-నరనుత నామతంబుననె నాతుక వీణియ మీటఁ
నెప్పుడున్ - ... ... ... 120

క. మాపులు జనకగృహంబున
రేపులు సురథేశతనయగృహమున నుచిత
వ్యాపారంబుల మెలఁగుచు
నీపగిదిఁ జరించు చుండి యెప్పటిలీలన్. 121

రత్నచూడుని గూఢచారుఁడు శృంగారమాలికను వెనుదవ్వులుట

తే. సాధ్యలోకంబునందుండి చంపకావ
తీశుసౌధాంతరంబున కేఁగుచుండ,
రశ్మికేతనుఁ డనువాఁడు రత్నచూడ
గూఢచారుండు నన్ గని కూడముట్టె. 122

క. ధరణీసురుఁ డై డగ్గఱి:
"తరుణీ, యెటఁ బోయె?" దనుడు: "ధరణీధరమం
దిరధరణీధరమున కే
నరిగెద." ననఁ గపటవిప్రుఁ డగ్గిరియందున్. 123

క. "సురథేశ్వరుఁ గానవె! యా
ధరణీశ్వరునాశ్రితుండఁ; దా నవ్విభుఁ డెం
దరిగెనొ? కన్గొనుదాఁక
న్నిరశనముం బూనినాఁడ నీలశిరోజా!" 124

మ. అని నావెంటనె వచ్చుతత్తులునిమాయావృత్తి భావించి దై
త్యునిఁగా బోధమయావలోకములఁ జేతోవీథి నూహించి వి

ప్రునిహుంకారముచేతఁ గూలుట తుదిం బొంకంబుగాఁ
జూచి పా-వనతేజోనిధి చక్రినై కదలినఁ వాఁడుఁ మహా
శ్యేనమై. 125

తే. నిగిడి యేతేరఁ జొచ్చితి నీమఱుంగు
గగనమార్గస్థలంబులు గడచి వచ్చి;
యసుర హతుఁ డయ్యె నీచేత; నధిపపుత్త్రి
కడకు నేఁగెద; సౌఖ్యంబుఁ గాంచు మీవు." 126

క. "అని పలికిన నా శైలము
తనుమధ్యా, యిచటి కెంతదవ్వు గల దౌశో!"
యని యడిగిన: "నది గడుద."
వ్వని తెలియం బలుకఁ బూసునాసమయమునన్. 127

క. కోలాహలమున మునుచను
బాలకు లేతేర వేల్పుఁబడఁతుక చనియెం
గోలమెఱుం గుద్భవమై
యాలో గ్రక్కున నణంగునాకృతి నధిపా!" 128

మ. అనుడుఁ సంతస మంది రాజతనయుం: "డౌరా, లతాతన్వి
యూ-జనప్రక్రమసంపదల్ సుకథయజ్ఞంబుం గృతార్థంబు
చే-సినదాఁకం బురి కేఁగ రాదు; మధురశ్రీ వీనులం జొన్పి; తే
మన వచ్చుఁ భవదీయవాక్యరచనావ్యాపారపారీణతల్!"

వ. అనుసమయంబున: 130

సూర్యాస్తమయవర్ణనము.

సీ. చూపులఁ బోకుండఁ జుట్టి యాఁగెడులీల
నెదవడి జక్కవ లెదురు చూడ;

'నటుపోక నిల్వుమీ' యనుచుఁ బ్రార్థన సేయు
చాయ సంయమములయంజలులు వెలయ;
నతలంబు దూఱెనో యధిపుఁ జూచెద నన్న
కరణిఁ బద్మిని గొంత శిరసు వంప;
సాఁగినమరుసైన్యచటులధ్వనులువోలె
నీడల ఖగచరోన్మేష మడరఁ;
తే. గరచరశ్రేణి యుడుగుటకతనఁ దాన
యంధకారంబుకొలఁదుల నరసి చూడ
మిగులఁ దుద యెక్కెనో యన మిహిరబింబ
మధివసించెను జరమశైలాగ్రవీథి. 131

క. సన్నపుఁజీఁకటి యేనుఁగు
గున్నలు చరమాద్రితటులు గోరాడఁగ ను
త్పన్న మగు కావిచే బలె
మిన్నంతయు సాంధ్యరాగమిళితం బయ్యెన్. 132

సీ. చక్రవాకీదృగంచలచంచలత్కోష్ణ
తోయచ్ఛటాసారదుర్దినంబు,
కైరవోన్ముఖకంజగర్భోచ్చలద్భృంగ
తుములగరుద్రజోధూసరంబు,
సాంద్రముహుర్ముహుస్సముదితబహుళతమ
స్సంఛాదితాఖిలేక్షణపథంబు,
వివిధనివేశప్రవేశవేళాభీల
కఠినతరద్విజాక్రందనంబు,
తే. భవననూతనదీపికోపరిసమగ్ర
మలినరేఖాగ్రధూమాయమానదిశము,

నగుచు దోషంబునం దెటు లరుగు మరుఁడు(?)
దండయాత్రకు శూరు లుద్ధతులు గారె! 133

తే. వనజవనినుండి తేఁటులు వలస గదలఁ
గోమలోత్పలదళమధ్యగుహాలదనుకఁ
గటికిచీఁకటి యెడమన్న కాఁడు గెరలి
విక్రమంబున దిక్కుల నాక్రమింపః 134

సీ. అధికపురాణదిగంతజీర్ణనిశాంత
మండలీనిష్కృతన్మషి యనంగ,(?)
నస్తాచలాహతిధ్వస్తసూరరథాక్ష
నవపాతిశకటాంజనం బనంగ,
నూతనాంకురితమనోజాతసంజాత
తుములప్రతాపాగ్ని ధూమ మనఁగ,
భానుకరావలంబనవిధాసంబంధ
గళితతక్షణభిన్నగగన మనఁగ,

తే. నంధకారంబు జారచోరాభిమతని
వేశలీలాప్రవేశైకదేశికంబు
కఠినకోలాహలావేశకౌశికంబు
పిక్కటిలి పర్వ సూచికాభేద్య మగుచు; 135

క. "మును తాఁసు మ్రింగి గగన
మ్మినరుచుల్ వెడలఁ గ్రాసె; నిది నిజ." మనఁగా
మినుమినుకు మినుకు రనుచుం
గనుపట్టెం గొన్ని తారకాకోరకముల్. 136

తే. అంధకారచ్ఛటాయామునాంబుపూర
భీకరం బైనగగనతటాకమునకుఁ

దోయరుహాసూతి పటికంపుఁదూముకాల్వఁ
దీర్చెనో యనఁ దొలుదిక్కు తెల్లనయ్యె. 137

## చంద్రోదయవర్ణనము

ఉ. తమ్ములగొంగ జక్కవలదాడి వియోగులముక్కుగోయ శ్రీ
లో-కమ్ములతన్ను పాల్కడలికానుపు వేల్పులచల్ది చంద్ర
కాం-తమ్ములు నానుమందు కుముదమ్ములజన్మఫలంబు కల్వ
చె-ల్వమ్ములయిక్క చక్కనగువాఁడు సుధాంశుఁడు దోఁచెఁ
దూర్పునన్. 138

తే. నలువ యనుకాఁపు గగనంబునల్లనేలఁ
దారకావార మనుమేలిపైరు నించి
నిండి దిగుపాఱుటయుఁ జూచి నించుదృష్టి
కుండయునుబోలెఁ బూర్ణేందుమండలంబు. 139

చ. చిలుకలతేరితోఁ జెఱకుసింగిణితో విరిమొగ్గజోడుతోఁ
దలిరులకాసెతోఁ బొగరుదాఁటులమేటిపతాకతో నిర
ర్గళమతిఁ బాంథులం గలఁచి కాఱియఁబెట్టి మనోభవుండు ది
గ్వలభులఁ గీర్తిచంద్రికలు వ్రాసె శశాంకరుచిచ్ఛలంబునన్.

మ. నెలగొమ్మల్ గబళించు; ముంగొనలు ద్రుంచెన్; ముంచె
మూలంబు; లే-కొలఁదిం గాక భుజించె నంశువితతుల్ గో
ర్కుల్ పిసాళింప; వె-న్నెలపుల్గుల్ తుదిఁ బోక చంద్రు నిశి
తోన్నిద్రాస్యధారావిని-ర్దళితాంగుండుగఁ జేసె. నిష్ఠురులు
మిత్రద్రోహు లూహింపఁగన్. 141

వ. ఇవ్విధంబునఁ జంద్రుం డుదయించి యుత్పలంబులకు బలం
బును దొగలకుం బొగరును జక్కవలకుం దక్కువయు.

నేత్త్రమ్ములకు నుత్తలమ్మును నై వియత్తలసరోమరాళలీలఁ గ్రాలుచుండ దిలీపనృపాఖండలుం డంతకమున్న సంధ్యాది కృత్యంబులు నిర్వర్తించి యావర్తులస్తనిం దలంచి చలించి మవ్వం బగుపువ్వుచందంబున నలరి శశాంకుసిం గనుంగొని:

దిలీపుని విరహము-చంద్రోపాలంభము

క. "ఆలేమమోముఁదామరఁ
బోలుదు వని నిక్కమునకుఁ బొగడుదు నిన్నుఁ;
బ్రాలేయకిరణ, మఱచేఁ
దూలితి నెచ్చోట నున్నదో తెలుపఁగదే! 143

ఉ. అత్రికిఁ గంటిపాప; హరునౌదలయేటికి నీటిపాప; లో
కత్రయి మెచ్చఁ బాల్కడలి గాంచినముద్దులపాలపాప; న
క్షత్రగణేశుఁ డందఱికిఁ జల్లనివాఁ డనియాడుకొంద్రు; త
ద్గాత్రముతోడనే కొఱవిదయ్యమ వైతి నిశీథినీధవా! 144

మ. గగనం బా యిది? కాదు; నీలమణులం గావించుగేహంబు;
చుక్కగముల్ గావవి తోడినెచ్చెలులు; నీకన్పట్టుబింబంబు
గా;-దిగురుంబోఁడిసుదతీణాసతిమొగం; బీక్షించితిన్ లె
స్సగాఁ; - దొంగవిందా, తగువింద వైతి నిను నే దూఱంగ
నేరం గదా! 145

సీ. అంబుస్వరూప మై యధివసింపకయున్న,
వలిగొండచఱులలో నిలువకున్న,
శైవమానససరోజములు దూఱకయున్న,
నౌర్ధ్వాంగసుధ నోలలాడకున్నఁ,
గేదారమున జలక్రీడ సల్పకయున్న,
నొంటిమామిడినీడ నుండకున్న,

శిరసుపై మిన్నేటిచెలమఁ దాల్పకయున్న,
యుమచనుంగవగంధ మూనకున్న,
తే. విరహిహాలాహలం బనఁబరఁగునీక
శాంశ మొకయింత తలఁ బూనునాదిమూర్తి,
హృదయజారాతి యేరీతి మెదలఁగలఁడు
బాడబానలసహజన్మ, పద్మవైరి! 146

తే. పాలవంటికులంబునఁ బ్రభవ మొందిఁ,
హరుశిరంబున హరికంట నధివసించి,
భూరివిద్యల మిన్నందుబుధునిఁ గాంచి
వెలసినందునకా చంద్ర విరహిబాధ!" 147

వ. అని చందురుం జూచి మదనోన్మాదపరవశుండై యాగట్టి
చనుమిట్టలాఁడి ముందరం బొడకట్టిన నారాచపట్టి దిట్ట
తనంబు వోనాడి తనలో నిట్లనియె: 148

క. "అలికలభములకు నీలపుఁ
గళికలకుం జీఁకటులకు ఘనపంక్తులకుం
దలకట్టైనవి గనుఁగో
తలకట్టై కురులు వఱలుఁ దరుణీమణికిన్. 149

తే. పూని బాల్యంబు గడిదాఁటి పోవుటకును
జిగురుఁగైదువువోర యిచ్చుచీటి యనఁగఁ
గంబుకంధరఫాలభాగంబు దనరె
నంచలాంచితచూర్ణాలకాక్షరముల. 150

క. కనుఁగవ వెన్నెలపులుఁగులు
చను నున్ముఖవృత్తి నిటలచంద్రకళకు నై

యని నలువ నడుమ నిలిపిన
నునుఁజీఁకటి తెరలు నాఁ జనుం జెలువబొమల్. 151

క. 'నగువెన్నెలవెల్లి వెలి
న్నిగుడునొకో!' యనుచు నజుఁడు నేరుపు వెలయన్
బగడంపుఁగట్టుఁ గట్టిన,
పగిదిం గెమ్మోవి దనరు బాలామణికిన్. 152

క. అలఘుతరకాంతిరేఖా
కలితం బగునాలతాంగికంఠంబునకున్
వలమురి సరి గా దని యా
వల మురి వెట్టంగ వచ్చు వలరాజునకున్. 153

క. చన్నులు జక్కవపిన్నలు;
కన్నులు తలచుట్టి వచ్చుఁ; గలికిమొగం బా
పున్నమనెల; యీకన్నియ
కన్నులవిలుకానిజీవకళ గాఁబోలున్! 154

క. ఈతోయజముఖి చేతులు
చేతోభవుహేతు లగుట సిద్ధము; వజ్ర
ద్యోతితనఖముఖముల వి
ఖ్యాతం బగువాఁడి చూపుకతనం దెలిసెన్. 155

చ. అలరెఁ గ్రమక్రమంబున శుభాంగిచనుంగవ, యేమి చెప్పఁ!
బోఁకలవలె, నిమ్మపండ్లవలెఁ, గంతునికానుకకమ్మఁబూవుబం
తులు బలె, గిన్నెలుం బలె, మనోహరకాంతిరసంబు నించు
కాఁగులుబలె, గొప్పబంగరపుఁగొప్పెరలుం బలెఁ, గొండ
లుం బలెన్! 156

సీ. కటితటాశ్రమకారి కంతుండు ధరసంధి
గ్రుచ్చిన నీలంపుగోరక యారు;
విశదాంబరావృతి విలసిల్లు నటుగాన
నాకధునీపులినంబు పిఱుఁదు;
లావణ్యజలధికూలస్థలీసంజాత
కర్పూరరంభాయుగంబు తొడలు;
శాస్త్రప్రమాణలక్షణలక్షితంబు లై
శరధు లనఁగఁ జాలు జంఘ లహహా;
తే. సమధికారుణకాంతిలేశంబుచేత
నంబుజమ్ముల నిర్మించు నడుగుదోయి;
నవ్వఁ జుక్కలచొక్కంబు నఖముఖములు
భామ మన్మథసామ్రాజ్యసీమ గాదె." 157

వ. అని పలికి యాముద్దరాలు విరాళిం బైకొన్న యట్టిన
వెండియు; 158

చ. "నిలు నిలు కౌఁగలింప; కటు నీరజవైరి నభస్థ్సలంబున
న్నిలిచినవాఁడు; వాఁడె చెలి, నిన్నుఁ గనుంగొను నేమొ!
ర." మ్మటం-చలికులఝంకృతుల్ దలఁప కంతికపుష్పనికుంజ
మంటప-స్థలి వెసఁ జొచ్చి మంత్రిరచితం బగుపాన్పున నత్త
మిల్లుచున్. 159

క. వాణీకరధృతకచ్ఛప
వీణానిక్వాణహారి వినిమయముగ నో
యేణాయతాక్షి, మరుసా
మ్రాణివలెం బలుకు గులుకు మమకారంబున్. 160

చ. కుచలికుచోపగూహనముఁ గోరెద; నాయెదఁ గాఁడి పోవు
నం-చచలకుచా, తలంకవల; దంగజుతూపులు దూఱి తూఱి
య,య్యచలతటాకృతిం బరుస నై నటు లున్నది; కౌఁగి
లింపవే-విచికిలసూనదామసమవిశ్రమబాహులతామతల్లులన్.

తే. అంబుజానన, మద్భుక్త మైనతావ
కాధరముమీఁద నీదరహాసరేఖ
నూత్నగతిఁ బొల్చెఁ బలుసోఁకునొప్పి మాన్పఁ
బరిఢవించినకపురంపుఁబలుకు వోలె. 162

క. బాలామణి, తావకకుచ
కాలాగురుపత్త్రరచనగం దగు నా కు
న్నీలకనీలపువలరైయె
చేలాంచల మేల మాటు చేసితి చెపుమా! 163

తే. మించి చీఁకటి మూర్తిభవించె ననుచుఁ,
గుముదబంధుండు మదిలోనఁ గుందుచుండ,
వెలఁది, నఖశిఖరములఁ బ్రావిరులు రాల్చి
కొప్పు పెట్టెద; నిట నిల్వు; కోప మేల?" 164

క. అని యిటు మదనోన్మాదం,
బునఁ బరవశవృత్తి నున్నభూపాలకనం
దనుచింత వంత యడఁపం,
దనమది నూహించి మంత్రితనుజాతుండున్. 165

తే. శంభుచూడాప్రసూన మా చంద్రుఁగూర్చి
జపము సేయుచు నిజవిలోచనయుగంబు
మోడ్చి బాహ్యేంద్రియవ్యాప్తి యూడ్చి వైచి,
యుండె నిర్వీచికాంభోధియో యనంగ." 166

క. అని యిట్లు రామచంద్రున
కినకులకలశాబ్ధిహర్షకృతిచంద్రునకుఁ
మునినాథుఁ డయ్యగస్త్యుఁడు
వినిపించె గభీరధీరవిశదప్రౌఢిన్. 167

శా. కాంతానూతనపద్మసాయక, సుధీకళ్యాణసంధాయకా,
సంతానద్రుమదానవైభవ, సదాసౌజన్యపద్మోద్భవా,
సంతోషప్రకటీకృతాశయ, సమస్తస్తుత్యసత్యాశ్రయా,
ధ్వాంతారాతిసమప్రభాకలిత, విద్యాహృద్యధీలాలితా. 168

క. కోనేటిరామరాజద
యానూనప్రాప్తశాశ్వతైశ్వర్యనిధీ,
దానకలాజితజలధీ,
నానాబాంధవగృహాంగణస్థాననిధీ. 169

సుగంధి

దిక్కరిచ్ఛటాకపాలదేశదానసీలిమా
ధిక్కృతిప్రవృత్తికీర్తిదీపితానుభావ, భూ
భుక్కులాగ్రగణ్య, గణ్యపుణ్యనీతివిస్ఫుర
ద్వాక్కలాప, భద్రరూప, వారిజాతలోచనా! 170

గద్యము. ఇది శ్రీమత్తెనాలిరామేశ్వరశాశ్వతకృపాకటాక్ష లక్షితకవితాభిరామ రామయపండితకుమార సహజశైవాచారసంపన్న ధీమ దన్నయనామధేయప్రణీతం బైన సుదక్షిణాపరిణయం బను శృంగారకావ్యంబునందుఁ జతుర్థాశ్వాసము.

శ్రీ

# సుదక్షిణాపరిణయము

## పంచమాశ్వాసము

---

క. శ్రీనాయకసాయకపూ
జానిరతస్వాంత, బుధరసాలవసంతా,
భానుభవోద్భవసత్యధ
రానుత, పులిజాలధామ, రామయసోమా. 1

తే. అవధరింపు మగస్త్యసంయమివరుండు
పలుకుఁగప్రంపువలి మీఱఁ బలుకు నిట్టు
"లవలికథఁ దెల్పు."మను రాఘవాధినాథుఁ
గాంచి రదనాంశుచంద్రికల్ గడలుకొనఁగ. 2

{ రత్నచూడునిమంత్రి విరహపరవశతనున్న దిలీపుని
ఆతనిమంత్రిని తన పుష్పకంబుపైనిడి కొనిపోవుట }

సీ. కదలి సాగెడుతమఃకదళంబులలీల
నసురవీరులు చిటుకనక కొల్వ,
నిర్గర్జితం బైననీరదం బన నీల
మణిజాలఖచితవిమాన మడర,
గాలికిఁ దలలెత్తుకాలాహితతివోలెఁ
గింకిణుల్ మొరయనికేతు వాలయ,

గంభీరగతి చూపుకుంభినీధరముల
కరణి ఘంటలు లేనికరులు బెరయ,
తే. సురథభూపాలుఁ డేఁగినచొప్పు దెలియ
మ్రుచ్చుపోఁజుగ నడురేయి వచ్చుచున్న
రత్నచూడాసురునిమంత్రి రౌద్రవదనుఁ
డనెడుదైత్యుండు వినువీథియందునుండి. 3
క. తరుణీవిరహాతురుఁ డగు
నరనాథతనూజు మంత్రినందనుఁ గని "యీ
నరపతి 'సుదక్షిణా,' యని
వెరవిఁడి గ్రాయి పలుకఁ దొడఁగె వీడనికాఁకన్. 4
తే. సురథనందన వరియించుశూరవరుఁడు
రత్నచూడుని వధియించు రణమునందు
ననెడుమాటకుఁ గాదే యియ్యవనివిభుని
వసతిఁ దెలియంగ మదిఁ గోరి వచ్చినాఁడ. 5
క. వీఁడే దిలీపభూపతి
వాఁడితనంబుననె కాన వచ్చునె మరుచేఁ
బోఁడిమి యఱి యున్నప్పుడె
వేఁడిమెయిం బట్టి లేత్తు వేల్పులు బెగడన్." 6
క. అని తేరు డిగ్గి డాయం
జని యవశత నున్నవిభుని జపవిధిఁ జాలం
గనుఁగవ మోడ్చినమంత్రిం
దనపుష్పకమునకుఁ దెచ్చి దర్ప మెలర్పన్. 7
మ. గగనాభోగవిభేదకారణము లౌగర్జాధ్వనుల్ మీఱఁ దీ
వ్రగతిం బోయె నొకింత నేల; యపు డారాజన్యసింహాంబుఁ

కెం-జిగురుంగ్రైదువుత్తేఁ డౌనర్చుతగులుం జిత్తంబులోఁ
దాళి ధై-ర్యగుణప్రౌఢిమ మూర్ఛ దేఱె దివిజేంద్రారాతి
నీక్షించుచున్. 8

ఉ. "ఎక్కడనుండి యిక్కడికి నీగతి వచ్చితి? వీఁడు దానవుం
డెక్కడివాఁడొ? మంత్రిసుతుఁడే యితఁ? డేటికిఁ గన్ను
మోడ్చినాఁ?-డక్కట, మన్మథార్తునకు హాని యదేటికిఁ
దప్పుఁ? దప్పె నీ-చక్కటి మేటిధైర్యమును శౌర్యముఁ;
బల్కులు వేయు నేటికిన్!" 9

### దిలీపుఁడు రత్నచూడునిమంత్రిని దునుమాడి యతని పుష్పకమును గ్రహించుట

చ. అని తననెమ్మదిం దలఁచునంత సుధాకరదేవతాజపం
బు నుడిగి మంత్రినందనుఁడు పొంత వసించినయొక్కదైత్య
ము-ఖ్యునియరదంబుపై కుఱికి ఘోరకరాహతి వానిఁ జంపి త
ద్ధనువు నిషంగయుగ్మకము ధారుణిభర్తకుఁ దెచ్చియిచ్చినన్;

ఉ. భూపతి మంత్రినందనునిపూనికి నెమ్మది మెచ్చి వేఁడి యా
చూ పరిమీఁద నించుటయుఁ జూచి సురారి సమీపవర్తితే
రేపున దాఁటి యెక్కి మనుజేంద్రునిపై గద పూఁచి వైచెఁ
దా-రాపథవీథి నిప్పుకలు రాల నరాళకరాళమూర్తియై. 11

క. ఆగద నిర్జరహృదయో
ద్వేగదయై రా విభుండు వీక్షించి దిశా
భోగదళనోగ్ర ఫణభృ
ద్భోగదరప్రదశితాస్త్రమున ఖండించెన్. 12

క. ఖండించి వేఱ యొకశిత
కాండంబున వానితలయు ఖండించె మణీ
మండలకాంతుల వసుధా
ఖండంబున రత్నకోరకపుసను లెత్తన్. 13

ఉ. ఏలికపాటు చూచి భటు లేమని పోద మటంచు నందఱున్
శైలముఁగప్పుమేఘములచందమునన్ దనమీఁదఁ గ్రమ్మినన్
భూలలనేశ్వరుండు నిజభూరిశరాసనముక్తనిర్భరా
భీలశరానలాహుతులఁ బీనుఁగుపెంటలు సేసె వ్రేల్మిడిన్. 14

సీ. దినకరుండును బోలె దీర్ఘాంశుకలితంబు,
ఖగము వోలె ననంతగమనశాలి,
గోత్రారిపురి వోలెఁ జిత్రరేఖాశోభి,
పఙ్క్తికంఠుఁడు వోలె బహుముఖంబు,
రతివిలాసము వోలెఁ దతకామగమనంబు,
నమరుండు వోలె ముక్తామయంబు,
వైశ్రవణుఁడు వోలె వసుసముద్గమపూర్తి
కేశవాంఘ్రియుఁ బోలెఁ గేతుయుతము,

తే. వాణియును బోలె నవహంసవాహయుక్త
మనలమూర్తియుఁ బోలెఁ గీతాన్వితంబు
నైనదనుజువిమానంబు నపుడు చూచి
మనుజపతిఁ బల్కె మంత్రికుమారకుండు: 15

తే. "రత్నచూడునిమంత్రి యీరాక్షసుండు;
వీనిఁ దునుమాడి యేతద్విమానరత్న
మధిప, గైకొంటి వప్పుడే యసురవిభునిఁ
దున్మి వరియించినాఁడ వాతోయజాక్షి. 16

మ. అవె దిక్పాలకపట్టణంబు లవిగో, యాశాంతదంతావళ
ప్రవరంబుల్ శిర సెత్తిచూడు; మదిగో పాకాసురధ్వంసి వీ;
డవదాతాంశుఁడు వీఁడె తావకవిమానాగ్రస్థలీబద్ధమా
ధవళచ్ఛత్రమురీతిఁ జూడఁ దగియెఁ దవ్వైప్పు డే తెంచుటన్.

సీ. పచ్చబలోకోటలుఁ, బవడంపుగవఁకులుఁ,
గోత్తముత్తియములకొమ్మగములు,
నెత్తమ్మిగచ్చుల నిగిడించుతిన్నెలుఁ,
బచ్చికదిండిరారచ్చపట్లుఁ,
దెరలమానికములఁ దీర్చినవెలకట్లుఁ,
బోది మించుమంజిల్లబోదియలును
జాబిల్లిరతనాలు సవరించులోవలు,
జాజురేఖలు దిద్దుజాలకములుఁ,
తే. బచ్చిబంగారుగోడలు, మెచ్చు లిచ్చు
మణులవాకిళ్లు, నలవేల్పుమ్రానిపాదలుఁ,
గలుగునొకదివ్యనగర మగ్రస్థలమునఁ
జూపువిం దయ్యెఁ జూచితె భూపతిలక! 18

శా. ఏణాంకోపలసౌధవీథికలపై నింపొంది చిత్రంబు గా
వీణెల్ కేల ధరించి రాగలహరీవిస్ఫూర్తిమైఁ జొక్కుచున్
జాణల్ సాధ్యకుమారు లాగమవిధానస్నిగ్ధగానంబులన్
రాణల్ మీఱఁగ నాలపించెదరు చిత్రప్రీతిమై వింటివే! 19

క. సాధ్యపురం బిది; యిచట న,
సాధ్యం బగుగానరవము జలధరపదవీ
మధ్యలు వినిపింతురు బహు
విధ్యుక్తక్రమవిశేషవిభవప్రతిభన్." 20

క. అని పలుకుచుండ నిద్దఱు
వనితలు తత్పురము వెడలి వలరాయనిపూ
దోటనుండి వెలికి మొనసిన
కనదనుపమగంధిలాస్త్రకళికలో యనఁగన్; 21

తే. గగనముననుండి మాన్మథగంధకరటి
గమనదమన ప్రయాణసంగతుల నతుల
చరణపద్మాభరణఝుళంఝుళలు బెరయ,
నొయ్యనొయ్యన రాఁ బూని రుర్వరకును. 22

సీ. గొప్పకొప్పులకప్పు గప్పినచో నెల్ల
నల్లోనేరెడుపంటియనువు దాల్పఁ,
గలికికెమ్మోవినిగ్గులు పర్వరా నెల్ల
బింబఫలచ్ఛాయ బిత్తరింపఁ,
జుబుకభాస్తబకముల్ ప్రబలినకడ నెల్ల
వటఫలోల్లాసంబు పాటమరింప,
గబ్బిగుబ్బలమించు గాన్పించునెడ నెల్ల
మాలూరఫలలీల గీలుకొనఁగ,

తే. భావిరవిబింబనిర్గత ప్రచురరుచిని
రంకుశాతంకశంక లో నంకురింప
నిలకుఁ జనియెడునమృతాంశుకళలఁ బోలి
తఱిసి రారామ లాకనవోద్యానసీమ. 23

వ. అయ్యవసరంబున: 24

సూర్యోదయవర్ణనము

ఉ. చీఁకటియేనుఁగుం గెడపి చెండెడుసింగము, తమ్మిలచ్చికిన్
దాఁకుమఁడుంగువాయి విటతాటము చేసినజెజ్జఁబ్రోడ, య

ట్టాఁకల నున్న జక్కవల కచ్చికబుచ్చిక చిందు, వేఁడి బ
ల్కాఁకలవేల్పు తేఁడు తొలుగట్టుతుదం జెలు వొందె
నంతటన్. 25

తే. నిజవియోగంబుచే బలె నీరజారి
కరవిపాండురరుచి యైనగగనలక్ష్మి
రాగమునఁ దేల్చె రవి; విదేశాగతప్రి
యావలోకంబు సతికి నెయ్యంబు గాదె! 26

మ. పొడుపుందిప్ప తటాలునం డిగినయంభోజాప్తబింబంబు సం
గడ మై రత్నమరీచివీచికలు దిగ్వాటిన్ మిటారింపఁగా
నుడువీథిన్ దిగి యెయ్యనొయ్యన విమానోత్తంస మాభూ
మికిం-దోడ వై చేరె వధూవిగాహితతరుస్తోమాంతరాభోగ
మున్. 27

వ. ఇవ్విధంబున నవ్వనంబుఁ దఱిసి సరసిజహితాన్వయుండు
పురస్స్థలంబు పరికించి యద్దేవతనయుం (?) గనుంగొని: 28

క. "చనుఁగవబంగరుపనఁటుల
మినుకులు వలెఁ గక్షురుచులు మినుమిను కనఁగా
వనకుజలతికాజాలముఁ
గనకముగాఁ జేయుకల్వకంటులఁ గంటే!" 29

వ. అనిన నతం డొక్కింత లోనం గనుంగొని: 30

"సీ. ఆనీలకుంతల యాధనుర్భ్రూవల్లి
యాహేమహాలమనోహరనాస
యాచకోరేక్షణ యాపికభాషిణి
యాపరిపక్వబింబాధరోష్ఠి

యామధూకకపోల యాశంఖకంధర
యాబిసవల్లికాహ_స్తయుగళ
యామంజరీకుచ యానభోనిభమధ్య
యాగాంగసైకతాయతకటీర
తే. యాకరికరోరు వానిషంగాచ్ఛజంఘ
యాసరోజాంఘ్రి యాహీరహారినఖర
యల్లయాయింతి నాఁడు నే నచటఁ గన్న
యతివ శృంగారమాలిక యగు నిజంబు. 31

వ వీరలు సుదక్షిణాధ్యక్షిత క్షితిభృత్కందరంబునకుం జను
చున్నవారలు గావలయు నేతదనుసరణంబునం జనఁ
బ్రయోజనసిద్ధి యగుట సిద్ధం.” బని విన్నవించునవసరం
బునం బురోభాగంబున: 32

మ. అలినీలాలక పల్లవాధర సముద్యద్వల్లికాబాహ యు
జ్జ్వలగుచ్ఛ_స్తన పుష్పగంధి మదచంచత్కీరసల్లాపవే
శల మాయూరవితానయాన మృదుసంచారంబుతో వచ్చె
నె-చ్చెలులుం దాను వనీసరోజగృహ లక్ష్మీనాథు నీక్షింపఁ
గాన్. 33

వనదేవత యేతెంచి సుదక్షిణ విరహబాధను దిలీపున కెఱుకపఱచుట

క. వచ్చి విరిగుత్తి కానుక
యిచ్చి: “మహీపాలచంద్ర, యిటు చూచితె నీ
వచ్చుట ఘుగుడం బ్రాయము,
వచ్చినయచ్చెరువు మీఱువనవాటంబున్. 34

చ. జలజమృణాళనాళసరసంబు శిరీషతరుప్రసూనపే
శలమును నైనయాసురథసంభవమె_త్తనిమేను పాంథని

ర్దళనవిధావినిర్దయనిశాంతదురంతలతాంతబాణకీ
లల నిటు వేఁచు నే మకరలాంఛనుఁ! డెంతటిపాపకర్ముఁడో!

చ. పలుకులు వేయు నేమిటికిఁ బంకజమిత్రకులావతంస, య
య్యలికులనీలకుంతలకు హర్షకరంబులు గావు కప్రపుం
బలుకులుఁ బంజరీశుకముపల్కులుఁ గిన్నెరముద్దుపల్కులుం
బలుమఱు విన్నవించుచెలిపల్కులుఁ గంతునిముల్కులం
బలెన్. 36

సీ. నెట్టెంపువెలిచిల్వనిట్టూర్పు సోఁకని
చంద్రశేఖరశిరశ్చంద్రరేఖ,
నారి యాతేఁటిపిన్నలు తావిఁ గ్రోలని
పుష్పకోదండాస్త్రపుష్పకళిక,
సావిచిన్కులజోరుకావి మైనంటని
మణిసానుసానుస్థమణిశలాక,
పొగరు మీఱినకన్నెమొగులు పైఁ బర్వని
యమృతార్ణవస్ఫూర్జదమృతలహరి,
తే. హెచ్చుగుం దాడఁ జాలునయ్యింతి మేనుఁ
గందఁ జేయుదె పుష్పాస్త్రకాండహతుల
నటన సుకుమారమూర్తి నున్నాఁడ వింత
కటికిడెందంబువాఁడవు గా నరేంద్ర. 37

మ. కమలామందమరందబిందుకణికాకల్లోలడోలావిలో
లమరాళీగరుదుచ్చలత్పవనబాలక్రీడనప్రోల్లస
త్కుముదామోదపరాగవాసితదిశాకుంభీంద్రగండస్థలీ [నన్
సముదాయం బలరుఁ నృపాల, యొకకాసారంబు దూరంబు

సీ. కంజాతసంజాతమంజుపరాగంబు
నవయవంబుల నిండ నలఁది యలఁది,
సరసబాలమృణాళజాలవల్లీహార
వలయముల్ చనుదోయి వైచి వైచి,
యుత్ఫుల్లహల్లకవ్యూహహోల్లసన్మధు
శీకరంబులు మేనఁ జిలికి చిలికి,
నందదిందీవరామందకేసరపఙ్క్తిఁ
దళుకుఁజెక్కుల చెక్కిఁ గులికి కులికి

తే. చల్లుపోరాడునెపమునఁ జంద్రముఖులు
సఖులు శిశిరోపచారముల్ సలుపుచుండ
సురథనందన యాసరోవరమునందుఁ
దేలుచున్నది విరహార్తిఁ దాళ లేక. 39

శా. వాడెం దీరతమాలవల్లికలు శైవాలంబులుం బుష్పాడిం
గూడెం బంకజకుట్మలంబులు గడుం గుందెన్ మదాళిచ్ఛటల్
క్రీడల్ మానె సరోరమం గరుణ వీక్షింపం గదే భూమిభృ
చ్చూడాహీరవిహార యాఁడుకొల వచ్చున్ నేఁడు పేక్షిం
చినన్.” 40

క. అని విన్నవించి గ్రక్కున
వనదేవత చనిన రాజవరుఁ డెదుట సరో
వనవీథి నున్నవనితం
గనుఁగొని రోమాంచకంచుకవృతాంగకుఁ డై. 41

వకుళవృక్షము మఱువుననుండి దిలీపుఁడు సుదక్షిణను గాంచుట

తే. సరసమకరందమత్తషట్చరణతరుణ
కలకలోన్నిద్ర మైనవకులకుజంబు

మాటున వసించి పల్కు నమ్మంత్రిఁ జూచి
పలుకుపలుకున నమృతంబు దొలకరింప: 42

ఉ. "వాలుకప్రోవు లెల్ల హిమవాలుక లై విలసిల్లు చున్నె, జం
బాలము నూతనైణమదభావము పూనక యున్నె, యానమ
త్కూలము నీరపూర మిడి గొజ్జఁగినీ రిఁకఁ గాక యున్నె
యా-లోలకురంగశాబకవిలోచనచారుశరీరవాసనన్. 43

ఉ. ఈలతకూనపొక్కిలియు నీనతనాభిపిఱుందు నీసము
ద్వేలకటీరపాదము లుదీర్ణజలస్థితి డాఁగియుండినం
బోలిక లెస్సగాఁ దెలిపెఁ బో సుడిచేఁ బులినస్థలంబుచే
శ్రీలలితాంబుజాతములచే జలజాకర మాప్తబంధు వై." 44

క. అనుచుండ సరసి వెల్వడి
చనుదెంచెం జంచలాంగి జలజనిలయ యా
వననిధి వెల్వడి కూలం
బునకుం జనుదెంచుజాడఁ బోలఁతులుఁ దానున్. 45

వ. అప్పుడు: 46

చ. తొలిమొగు లంబుధిం గొనినతోయము వెంట నిజోదరస్థ మై
నిలిచినముత్తియంపుఁబొది నిండ వెలి న్నిగిడించుజాడ న
య్యలికులనీలవేణిచికురావలి దాఁ గురిసెన్ వనీలతా
కళికలతళ్కులం దెగడుకంజసరోజలబిందుబృందమున్. 47

చ. చెలువు దలిర్పఁగా వడియుసేవతినీరునఁ జల్వవట్టి వె-న్నెల
సెక నార్చువల్పెముల నెచ్చెలి యొక్కతె దెచ్చి యిచ్చినం
గలకలకంఠకంఠి వడగాడ్పులకై వడి వేఁడి చూపునూ-ర్పులు
నిగుడ న్నిజాంగమునఁ బూన్చె శశిద్యుతిగాఁ దలంపుచున్.

వ. అత్తరుణికిం జెలిమికత్తియ మొత్తంబులు తత్తదుచితశృంగార రచనం బాచరించి; రత్తటి శృంగారమాలిక పూఁబోదములుం గున నున్న రాజుం గనుంగొని చిత్తజు నుద్దేశించి: 49

సీ. "కరవాఁడిచిగురాకుసురెకత్తిచే నొత్తి
మగలమానము గొనుమానటీఁడ,
రతిదేవిజిగిమించురారాపుఁజనుదోయి
నొఱగుదిండులు నేయునొఱపులాఁడ,
మినమిన మనుగండుమీనుటెక్కెముతోడి
విరితేరునఁ జఱచుబిరుదులాఁడ,
కనకాచలపువింటి కెన గాఁగఁ జక్కెర
వి ల్లెక్కువెట్టినబల్లిదుండ,
తే. కలువనెచ్చెలిచెలికాఁడ, మలయపవను
వేగరిగఁ జేసి వర్తించునాగరికుఁడ,
చెలువఁ గరుణింపు; కరుణింప కరిగితేని
మాదిలీపునిపాదపద్మంబు లాన!" 50

{ దిలీపుఁ డమాత్యసహితుఁడయి సఖీసమేత యగుసుదక్షిణను డాయంజనుట }

క. అని పల్కుచెలులపల్కులు
విని వంజులకుంజగృహము వెడలి యమాత్యుం
డును దాను డాయ వచ్చిన
జనపాలకుఁ జూచి సఖులు సంభ్రమ మెసఁగన్. 51

ఉ ఒండొరుమోముఁ గన్గొనుచు: "నోయన నెచ్చెలి నోంచు పుష్పకో-దండుఁడు వీఁడె; చైత్రుఁడును దాను నిజంబుగ వచ్చినాఁడు; వే-ఱొండు దెఱంగు చూత." మని యొయ్యనఁ

గన్గొని: "యెవ్వఁ డామహీ-మండలనాయకుండు గడు
మన్మథమన్మథుఁ డై చెలంగెడున్" 52

తే. అనుడు శృంగారమాలిక యయ్యమాత్య
తనయునకుఁ గన్నుసన్న వందన మొనర్చి
చెలుల సందడి వీక్షించి: "చిత్తజుండు
గాఁడు కాఁడు; దిలీపుఁ డీఘనభుజుండు." 53

క. అన విని సురథతనూభవ
యను రాగాంకురము మానసాంబుజమునకుం
జినుకుం దేనియ గాఁ జను
మొనలం బులకాంకురములు ముంచుకొనంగన్; 54

క. పతిఁ గనె సతి; పతి చూచెన్
సతి; నిరుపురదీర్ఘశాతసరసేక్షణముల్
సితకరధరనిటలాంబక
హాతుఁ డగురతిపతికిఁ దిరుగఁ బ్రాణం బొసఁగెన్. 55

మ. కలకాంచీమణికింకిణీక్వణనముల్ కంజాశుగజ్యాలతా
కులకోలాహలలీలఁ బెక్కొనఁగ సిగ్గుల్ నిగ్గుకందోయి తె
ప్పలఁ గప్పన్ నవఘర్మబిందుకళికల్ పైఁ గ్రమ్మ నక్కొమ్మ నె
చ్చెలి నడ్డంబుగఁ జేసి నిల్చి విభు నీక్షించెన్ సరాగంబుగన్. 57

వ. అయ్యవసరంబున:

## శార్దూలదర్శనభీతలయి సుదక్షిణాదులు పాఱిపోవుట

సీ. కులిశధారలఁ బోలుకోఱలు గలనోఱు
దెఱచినఁ జూపఱు దిగులు పొంద,
మువ్వన్నెచాఱల మొదమొదకన గైన
మేనిచాఁ పత్యుగ్ర మై సటంప,

దండధరోద్దండడిండిమధ్వనిఁ బోలు
రవలి రొప్పుల సృష్టి చెవుడు పడఁగ,
గాలిమిగాళులవంటి ఘోరంపుఁగన్నుల
జోరున నిప్పులు కారు చుండఁ,
తే. బేర్చి కుప్పించి వాల మల్లార్చి నేల
గగ్గతిల్లంగ నిజపాదఘట్టనమున
వాలునాఁకటికినుక శార్దూల మొకటి
థాటి వెన్నాడె నొకచిన్నలేఁటి బోటి. 58

క. శార్దూలాలోకనభయ
నిర్దళితస్వాంత లగుచు నెలఁతలు చన నా
శార్దూల ముందు మెయి నృప
శార్దూలము సచివదత్తశార్ఙ్గము మ్రోయన్. 59

సీ. వెలిదమ్మి రేకుల వికవిక నగఁ జాలు
డాలు గన్నులయొప్పు గీలుకొనఁగ,
జుట్టుగ త్తియు నీటిపుట్టువుఁ జేదోయి
నీరెండ రేయెండఁ దారసింపఁ
బచ్చరానిగ్గుతో మచ్చరానకు వచ్చు
మచ్చ యయ్యోదచక్కిఁ బెచ్చు మీఱ
నుదిరిబంగరుచుట్టు నొఱవట్టునునుఁబట్టు
దుప్పటి వలెవాటు దొంగలింపఁ
తే. బోసరించినయొకబొల్లిపులుఁగు నెక్కి
పులియుఁ గఱిమేనివేల్పుతోఁ గలయఁ జనుట
చూచి యచ్చోటినికటంపుసొంపుఁ బెంపు
మెచ్చె నారాచకోమరుండు నిచ్చలోన. 60

వ. అప్పుడు: 61

దిలీపుఁడు శేషశైలమును జేరుట

చ. చని చని ముందఱం గనియె సారసమిత్రకులుండు లోకలో
చనశతకోటిదీప్తిమణిసానువిభాసిదిగంతరాళముః,
సనకసనందనాదిమునిసంస్కృతవిస్తృతపుణ్యశీలముః,
జనజనికర్మనిర్మథనసౌఖ్యవిశాలము శేషశైలమున్. 62

తే. పుష్పకళికలఁ జెన్నొందుభూరుహంబు
లలమి దీపించు నచ్చట నచలభర్త
కదిసియుండినగగనంబుకడకు నెత్తఁ
బూనుముక్తావిభూషణభుజము లనఁగ. 63

చ. పిడికిటఁ బట్టి వంచెఁ బురభేది యొకానొకకొండ; మింటికిః
గొడుగుగ నెత్తిఁ దాల్చె యదుకుంజరుఁ డొండొకకొండ;
వేల్మిడిః-బుడమి నడంగఁ జేసె ఘటపుత్త్రుఁడు వేఱొక
కొండ; నున్న యీ-వెడవెడకొండ లీ డగునె వేంకటభర్త
వసించుకొండకున్! 64

వ. అప్పుడు ప్రధాననందనుండు రాజసంక్రందనుం గనుంగొని
"ప్రతాపనిటలనయన, నయసుధాస్యందం బగునిందుబింబ
వదన మదనసంతాపసంజీవనియుం బోలెఁ గైవసంబయ్యె
దుర్దమశార్దూలభయంబున నిజమందిరకందరంబునకుంజనియె;
రత్నచూడ విజయశుల్క యగునాచిల్కపల్కులాఁడి
నిన్నుఁ జెందు; సందియంబు వల; ధేతత్కుధరకూటా
గ్రహాటకవిమానాంతరచరిష్ణుం డగువిష్ణుండు భవదీయ
మనోరథంబు నవితథంబుగం జేయుఁ; దదీయపాదరాజీవ
సందర్శనం బవశ్యకర్తవ్యం." బనుడు సౌగంధికబంధురంబు

లగుస్వామిపుష్కరిణికబంధంబులం గాలోచితకృత్యంబులు నిర్వర్తించి సాకారకనకగిరిశంకాకారప్రాకారపరివృతంబును ఘనఘనాఘనచ్ఛటాను మేయధూపధూమవిలోకనతాండవత్కుండలిపరిపంథిమండలంబును సముత్తంభితచంచత్కేతుపటాంచలకాంచనకింకిణీకలకలాకులితజలజహిత రథఘోటకంబును నగునద్దేవదేవుదివ్యభవనంబు ప్రవేశించి పురోభాగంబున: 65

సీ. వెలిదామరలనవ్వు వెడఁదకన్నులవానిఁ,
గౌస్తుభగ్రైవేయకంబువానిఁ,
జిగురుఁగెమ్మోవిపైఁ జిన్నినవ్వులవానిఁ,
గమనీయరత్నశేఖరమువాని,
రంగైనమొసలివాపోఁగంట్లు గలవాని,
శంఖచక్రాంకహస్తములవానిఁ,
బసిమి మీఱినపచ్చపట్టు గట్టినవాని,
నిగమనూపురధగద్ధగలవానిఁ,
తే. బాలసంద్రంబు గాంచినవాలుగంటి,
నిజభుజామధ్యపీఠిక నిలుపువాని,
వేడ్క దైవాఱఁగజేమేనివేల్పుఁ గాంచి
వందనము చేసి రాజసంక్రందనుండు: 66

దిలీపుఁడు శేషాచలపతిని సందర్శించి స్తోత్రము చేయుట

సీ. "గోవింద, గోరూప, గోపికావల్లభ,
శౌరి, శార్ఙ్గాయుధ, శంఖహస్త,

పరమేశ, పరమాత్మ, పరమపదాధీశ,
కల్యాణకర కాంతికలిత కాయ,
లావణ్యలీలావిలాస, లాలితలోక,
యక్షీణకరుణాకటాక్షవీక్ష,
తీర్థాంఘ్రి, తీర్థేశ, తీర్థఫలోదయ,
త్రిగుణాత్మ, త్రిదశేంద్ర, త్రివిధరూప,
తే. నిఖిల, నిష్కామ, నిష్కల, నిత్య, నిరఘ,
భద్ర, భవభావభంజన, భక్తసులభ,
యాద్య, యాద్యంతరహిత, విద్యానవద్య,
నిన్నుఁ బొడగంటి, మిక్కిలి వన్నెగంటి. 67

సరసిజవృత్తము—
వేదాధారా, నాదవినోదా,
విషధిమథన, కరవిధృతకుతల, ప్ర
హ్లాదాధీనా, యాదృతమాయా
యతన, యహితహర, యతిమతిసదనా,
శ్రీదోల్లాసా; మేదురశౌర్యా,
జితవరమతభర, శ్రితగతిఫలదా,
పాదానమ్రప్రాహ్లాదనదక్షా,
భవభయపరిహృతిపరిచితకరుణా! 68

అక్షరగుణితము.—
మ. సనకప్రస్తుత, సారరూప, సితహాసా, సీరహస్తాప్త, సు
స్వనవేదస్తుతపాద, సూర్యనయనాబ్జా, సేతుబంధక్రియా
జనితోత్సాహధురీణ, సైంధవవిలాసా, సోమకప్రాణభం
జన, సౌజన్యవిలోల, సంగరహితా, సర్వప్రియంభావుకా!"

## దిలీపుఁడు శేషాచలపతి యనుగ్రహమును బడసి పుష్పకము పైఁ దనసైన్యమును జేరఁబోవుట

వ. అని కొనియాడి పునఃపునః ప్రణామంబు లాచరించు రాజకంఠీ
రవు నకుంఠితోత్కంఠానుకంపాసంప దధ్యక్షితంబు లగు
కటాక్షాంచలంబుల నిరీక్షించి పుండరీకాక్షుం డలభ్య
వాల్లభ్యకల్యం బగునిజకంధరామందారమాల్యంబు నను
గ్రహించి "దిలీపా, యాఖేటక క్రీడావ్యాజంబున వెడలి
దనుజులం బడలువడం జేసి చతుర్ముఖదత్తం బై రాక్ష
సాయత్తం బగునత్యుత్తమవిమానంబు గైకొని యిటకుం
జనుదెంచితి; వింక నీయభీప్సితంబు లెవ్వియైన సఫలంబు
లగు; నశ్రమంబున రత్నచూడునిం దునిమి విజయకాంతా
కరగ్రహంబుతోడన సుదక్షిణాకరగ్రహం బొనరింపు; సుర
థుండు నీక్షణంబునం బక్షిరాజదక్షత్వంబున సపురంబుగ
నిజక్షమామండలంబున కరుగు; నీ వరుగు." మని యాన
తిచ్చి యంపుటయు నాశౌర్యసంపన్నుండు తత్క్షణంబున: 70

తే. ఆవిమానంబు వెడలి తదగ్రశిఖర
సంగతం బగుహైమపుష్పకము నెక్కి
ముదితహృదయంబుతోఁ దన కెదురు చూచు
సైన్యములఁ జేరె నొకనిమిషంబులోన. 71

ఉ. దుష్పథవర్తివర్తనుల ధూర్తనిశాటులఁ ద్రుంచి ధీకళా
గీష్పతిసన్నిభుం డగుచు గెల్పునఁ బొల్పు వహించి యింద్రజి
త్పుష్పక మెక్కి వచ్చునృపపుంగవుఁ గన్గొని చేరి వారు వా
క్పుష్పములన్ విలోకములఁ బూజ యొనర్చిరి సమ్మదంబునన్.

వ. అప్పుడు: 73

క. ఇనవంశవరుఁడు సోదరి
తనయుఁ డగుభానుదేవధరణీధవునిం
గనుఁగొని: "మనసైన్యంబుల
ననువుపఱుపు మాహవక్రియాలోలమతిన్. 74

సుగంధి. మందరాద్రికందరాగ్రమందిరుండు దేవతా
బృందబాహుశౌర్యధైర్యభేదవాదచాతురీ
తుందిలాగ్రహాశయుండు దుష్టబుద్ధి మాయిక
స్యందనుండు రత్నచూడశక్రవైరి సాధ్యుఁడే. 75

క. ఆరాక్షసుఁ డనుమాడక
పోరాడు పురంబునకును; బోరాట మహా
ధారాటరథమదద్విప
వీరాటనపాటవంబు వెల కెక్కించున్. 76

{ దిలీపుఁడు రత్నచూడదనుజునిపై దండెత్తి చని యతనిరాజధానిని ముట్టడించుట }

శా. ఆమంథాననగంబుఁ జుట్టుకొని సైన్యవ్రాతసంజాతది
గ్భూమివ్యాపకధూళిపాళి తిమిరంబుం జొన్పి దైతేయదృ
గ్ధామశ్రేణి నడంచి నిర్జరమనస్తాపంబులం బాపకే [గన్!"
లా మెచ్చుఁ జయలక్ష్మి మామకభుజాలంకారమై నిల్వఁ

వ. అని సైన్యఘట్టంబులం గట్టాయితంబు సేయించి యప్పట్టాభి
షిక్తుండు కవ్వంపుగట్టుచుట్టుకోనం బంపు పెట్టె; నప్పట్టున
రత్నచూడుండును: 78

మ. తనమంత్రీంద్రుని రౌద్రవక్త్రుని భుజాదర్పంబు గైవ్రాల్చి
యయ్యినవంశేంద్రుఁడు ద్రుంచె నా విని మహాహింక్రూర

నిశ్వాసగుం-ఛనసంరంభత నూర్పు లుప్పతిల నా_ప్తశ్రేణి
నీక్షించి త-ద్వినిపాతం బఖిలంబుఁ జెప్పుటయు నుద్వే
గంబుతో నందఱున్: 79

సీ. "అఱచేతఁ జఱతుమే యబ్జభవాండంబు
నెట్టనఁ బై చిప్ప మిట్టి పడఁగ;
నుగ్గునూచంబుగా నూఁకుదుమే మేరు
ధరణీధరంబు దోర్దండశ_క్తిఁ;
బుడిసిలింతుమె మహాంభోరాసు లేడును
బలువీఁక నిసుము గుల్లలును జిక్క;
విఱిచి వైతుమె సముద్వేలహేలాశ_క్తి
ఘోరమృత్యువుఁ గిట్టి కోఱ లెల్ల;
తే. మిన్ను నేలకు, నేల యమ్మిన్ను నకును,
దెత్తుమే; తెత్తుమే యొక్కదిక్కునకును
దిక్కులన్నియు; మనతోడ నొక్కరాచ
కొమరుఁడే పోరువాఁడు నేఁ డమరవైరి. 80

క. అనుచుండఁ జారుఁ డొకరుఁడు
చనుదెంచి:" "దిలీపుఁ డధికసంభ్రమసేనా
ధ్వను లెసఁగ నిచటి కేతెం
చెను నిక్కం." బనుడు దనుజసేనావీరుల్; 81

రత్నచూడదనుజుఁడు ససైన్యుఁడయి యుద్ధమునకుఁ దరలుట

వ. అదభ్రభ్రుకుటిఘటనంబులు నిటలతటంబుల నటియింప నా
ప్రౌఢ కదలి పటుపటహానినాద మేదురరోదోంతరాళంబుగ
మాయావతినగరంబు వెడలి మనుజపతి కభిముఖంబుగఁ
జనఁ జొచ్చి; రయ్యవసరంబున: 82

సీ. గంధర్వసింధురగమనల యెదచిచ్చు,
కిన్నరీమానసక్లేశకారి,
గరుడాంగనావక్త్రకంజాతకౌముది,
విద్యాధరీభయావేశముద్ర,
ఫణివధూగానవైభవగళహస్తంబు,
ఖేచరీవర్తనాక్షేపకంబు,
యక్షకాంతావిలాసాంభోధిఘటసూతి,
చారణీతనుకంపకారణంబు,
తే. జర్జరితవజ్రిముఖ్యనిర్జరవతంస
జఠరపీఠంబు దైత్యరాజన్యజన్య
భేరినినదంబు నిగిడె గభీరపటిమ
భయదమై దిగ్గజములగుండియలు వగుల. 83

మ. "వెడలించెఁ మహీకాననగంబు మొదలన్ మిన్నేటి నే
మేటినై-వెడలింతుఁ యమునాస్రవంతి" ననుచున్ వేవేగ
మంథాద్రిన-ల్గడలం బర్వఁగఁ జేయుజాడ హాయలీలల్ పేచి
కాక్రీడగా-నడచెఁ దానవరాజసేన మహీకాంతానీలహారా
కృతిన్. 84

స్వాగతవృత్తము. శంక లేక శరచాపధరుండై,
యంకుశాహతమహాకరితోడన్
వంకదారకడ వాఁకిట నిల్చెన్,
బింక మొప్ప సురభేదివిభుండున్. 85

వనమయూరము. చండకరరశ్మిరుచిసంగతవిమానో
ద్దండగతి నిక్కి వసుధావరసుతుం డా

ఖండలముఖుల్ పొగడ గాఢగతి నేఁగెఁ
భండనము సేయుతమిఁ బోఁజులును దానున్. 86

దిలీపరత్నచూడదనుజసైన్యముల సంకులసమరము.

సీ. అన్యోన్యసంఘట్టనావిర్భవత్స్ఫులిం
గస్వర్ణకవచంబు కాల్బలంబు;
భ్రూభంగభయదఫాలాభోగరూక్షాక్షి
రుచిధాటి వాహనారోహకోటి;
దావపావకమూర్ధధరణిభృన్నిభములు
గురుకుంభసిందూరకుంజరములు;
వాహినీఫేనసందోహగేహద్వీప
దీప్తముల్ వజ్రాలతేరుగములుఁ;
తే. గదిసి యొండొంటిఁ దాఁకి యాగ్రహమహోగ్ర
సంభ్రమాదభ్రవిభ్రమోత్సాహరేఖఁ
బోరె నొకకొంతవడి యోర జాలు లేక,
తుములవిక్రాంతిఁ త్రాసునఁ దూఁచినట్లు. 87

వ. ఇట్లుభయవాహినీవీరులు ధీరులై నిజాలోకనిష్క్రాంత దహనవిస్ఫులింగసంతానంబు ప్రతాపవైశ్వానరబీజరాజి యోజం దేజరిల్లఁ బట్టు పట్టి తలలు గొట్టి చట్టలు చీరుం డనియును, దొడలు మెడలు గదలం బడలువడం బొడుపొడుం డనియును, ప్రక్కలు పిక్కలు ముక్కలుం జెక్కలై రాలం జెక్కి చక్కాడుం డనియును, గరంబులు శిరంబులు నురంబులు నరంబులును నుగ్గునుగ్గు సేయుం డనియును, గురులు జరులుం దరులు సరులుం దెరలుచుం డని

యును, నొక్కరొక్క రీరస మెక్కి పంతంబు లెక్కించుకొని యుత్సాహసముద్భటు లగునటులపటిమ సురసుభ్రూసవిభ్రమనిరీక్ష్యమాణులై యనంతసమరవృత్తంబున రణప్రాంగణంబునం బ్రవర్తించిరి. వెండియు నిసుమంతయుఁ బిఱికికండ లేనిదండిమగలు బూతంబుమొత్తంబులకు బుత్తులు పట్టు కత్తుల మత్తగజంబులనెత్తురు జొత్తిల్ల మొత్తి కుంభకూటంబులు విపాటితంబులు సేయ హత్తినక్రొత్తముత్తియంబులు జయలక్ష్మీకచవిచికిలకోరకధట్టంబు లై బిట్టగయ వల్గదవల్గుతురంగరంగత్ఖురపుటోద్ఘట్టనక్షుణ్ణమణి క్షోణీపరాగంబులు హరిదంతదంతావళయానలకు నవకుంతనపటంబులుగ నిశాతస్వర్ణపుంఖప్రేంఖద్రుచిరుచిరశరసంఘాతనిపాతితంబు లగు మణిమయరథాంగచ్ఛేదంబులు సముద్ధురసమిద్ధరాసంచారిభూతబేతాళంబులకుం బిశితఖండశంక యంకురింప నకంపితోత్సాహసంపన్నులై భీమసంగ్రామకేలీధురీణత్వంబునం బ్రవర్తింపం దద్గాత్రంబుల నుత్తరించునెత్తురు ధూళిపాళిం గబళించి ప్రవాహంబు లై యురవడిఁ దరు లురులం గేలి నురువులపరువునం దురంగాంగగళితచమరవాలజాలంబు పయిం దేల నంతంతకుఁ బొంగిన; 38

సీ. మాలిమిగమి వోలె మణిమయధ్వజశిఖ
రములు ప్రాఁకుచు నున్న రథికవరులు,
నెడవాఁలు మొత్తంబు లెడలించి తురగసం
చయముల నీఁదించుసాదికులము,
శుండాలములమీఁద నుండి కాల్వురకును
వేవేగఁ జే యిచ్చుమావఁతులును,

దెగి పడ్డయిరుసులు తెప్పలుగాఁ బడి
రవలిగా నీఁదుసారథులకులము,
తే. భీమసాహసధామసంగ్రామసీమ
వాటముగఁ బర్వెనవరక్తవారిధులకు
నోడ లూర్పులు నక్రంబు లుగ్రమీన
ములును దా నైరి నారదుం డెలమిఁ బొంద. 89

భానుదేవవిక్రమధన్వులయుద్ధము

చ. సమతల మయ్యె నప్పుడు నిశాచరభూవరవాహినీతురం
గమరథవీరసామజనికాయపదాహతి రొంపి గ్రైక్రమ
క్రమమున రక్తవాహిని మొగం బరుణంబుగ భానుదేవుఁ డ
ర్యమకులుకన్నుసన్నను భటావళితో నెదిరించి యార్చుచున్:
మహాస్రగ్ధర. కరులం జెండాడెఁ, దేజీగమిఁ దునిమెఁ, ధరం
గాల్వురం గూల్చెఁ, దేరుల్-దెరలించెన్, నించె జన్యస్థిర
నరిమకుటీవీ క్షితిని రాజనంబుల్,-సురలన్ మెప్పించె ఘోరా
సురభటపటలీసూదనాసాదమేదో-ద్ధురవాదాహ్లాదకేళీతుము
లకమలబంధుప్రథాటోపరేఖన్. 91
గీ. వీరసాటవి దహియించుఘోరవహ్నిఁ
గాద్రవేయుల ఖండించుఖగవిభుండుఁ
జండశుండాలదమనకేసరివరుండు
ననఁగ నిజసేన సుఖముమాడునతనిఁ జూచి. 92
మత్తకోకిల. దానవేశ్వరమంత్రి విక్రమధన్వుఁ డన్బలియుం
డనిన్-భానుదేవు నెదిర్చి తత్పటుభానుభానుసమాననా-నాని
తాంతదురంతదంతురనవ్యమార్గణవర్గసం-ధానవేగము చూ
చి యిట్లను దారుణారుణనేత్రుఁ డై: 93

శా. "ఓరీ, మానవమాత్ర, గోత్రరిపుబాహాదగ్రజాగ్రత్పవి
క్రూరారాహతికోర్చె నంచు ఖగవీరుం బల్కుటల్ మిథ్యరా;
రారా, నిన్నటిసంగరంబుననె నేరా, యమ్మహాస్త్రంబు ని
ష్కారుణ్యాక్షతదక్షిణేతరకరాఘాతంబునం దూల్చితిన్."

మ. అనుచుం గాంచనపుంఖరింఖదసమాస్త్రానీకముల్ జ్యాగుణ
ధ్వని దిక్కుంభికఠోరకర్ణబిలదుర్వారక్రమోద్వేల మై
చనఁగా నేసెను భానుదేవునిరథాశ్వశ్రేణిపై సూతుపై
ననిలాహారపతాకపై రథముపై నంగంబుపై నార్చుచున్. 95

క. అలుక మెయి నతనిములుకులు
పలుకులుఁ గటుకంబు లైనఁ బటుచటులసటా
వలిసంత్రుటనావిలమృగ
కులవిభునిభుఁ డగుచు భానుకులునల్లుండున్. 96

స్రగ్ధర. జ్యాటంకారాంకురంబుల్
సజలజలదగర్జాసమంబుల్ సుధాభు
క్కోటీహృద్వాటిఁ జల్వల్
గొలుప రిపుధనుష్కోటిఁ దున్మాడి చంచ
ద్ఘోటీచక్రధ్వజంబుల్
దునిమి తునిమెఁ జేతోభవధ్వంసకార్చి
ద్ధాటీభీమావలోకో
ద్భటశరపటలీధారఁ దత్కంధరంబున్. 97

ఆ. భానుదేవుఁ గప్పుపాథోధరము లన
భానుదేవుఁ గప్పెఁ బరుషరోష
నటనదైత్యమంత్రిభటపటలంబులు
వారిఁ బొదివి రాచవారిమూఁక. 98

ఉ. క్రూరకుఠారధారలను గుత్తుకలన్ విడిపింప వ్రాలె దు
ర్వారసురారిమూర్ధములు వాలుగ వేలతరంబు యుద్ధకా
సారమునన్ లవిత్రమునఁ జండకరప్రియసూతి గోయునం
భోరుహకోటి యోయనఁగ భూతతతుల్ తలలెత్తి నవ్వఁగన్.

శా. లేళ్లం ద్రుంచుమృగేంద్రుఁడో యన భుజాలీలాధనుర్జ్యాల
తా-వేల్లద్బాణపరంపరల్ నిజభటోద్వేగంబు దూలించి తే
నల్లుం దప్పక చూచి నిప్పుకలు పై నాడంగఁ గందోయి భ్రూ
వల్లీభీషణఫాలభాగుఁ డగుచున్ వజ్రాయుధారాతియున్.

రత్నచూడుని మాయాకల్పనము

వ. మాయావిజృంభణంబు గల్పించిన: 101

సీ. రంగత్తరంగపరంపరాసంపాత
కంపితాకాశదిగ్గగనతలముఁ,
బాతాళబిలవాసివాతాశనాధీశ
సంతాపకౌర్వాగ్నిసంభవంబుఁ,
క్రూరతరగ్రాహఘుమఘుమితకబంధ
ఘోషసముత్సేషభీషణంబు,
జలపానసంచారిజలధరశ్రేణికా
భీలసముత్తాలకూలకులముఁ,

తే. బృథులడిండీరమండలీహిండనంబు,
దీపితాంతఃప్రకాశితద్వీపకంబు
నైనమాయాపయోరాశి యధిపబలము
ముంచె వేల్పులు వీక్షించి సంచలింప. 102

భాస్కరవిలసితము.—

ఈగతి సురరిపుఁ డింతయుఁ దా నై
యేచినఁ గనుఁగొని యినకులుఁ డుద్య
ద్వేగతరళమతి వెంబడి సేనా
వీరులు గొలువఁగ విజితజయశ్రీ
రాగము వెలయఁగ రాక్షసయోధా
రామపరశుభుజరటదసిధారా
భోగచకచకలు పొల్పు దలిర్పన్
భూరిరయగతులఁ బొదివె నరాతిన్. 103

దిలీపుఁడు దనుజమాయను మాయించుట

క. మాయాపయోధి శోషణ
సాయకమునఁ గ్రోల్చి మగ్నసైన్యంబు మహీ
నాయకుఁడు గాచెఁ బ్రాక్కిటి
యాయంబుధిలోన మునుఁగునవనిం బోలెన్. 104

వ. వెండియు: 105

మహాస్రగ్ధర.—

పులు లేతెంచెన్, గజంబుల్
పొదివె, శరభముల్ పొంచి పై ముంచె, సింగం
బులు చేరెం, గాలసర్పం
బులు గదిసె, మహాంభోధరశ్రేణి విచ్చెన్,
విలయాగ్నుల్ మిన్ను ముట్టెన్,
విబుధరిపుసముద్వేలమాయానిరూఢిన్
బలియుం డారామవిద్యా
ప్రబలమహిమఁ దత్పాటనం బాచరించెన్. 106

ఉ. శంక యొకింత లేక రథచంక్రమణక్రమ ముల్లసిల్ల వి
శ్వాంకుశుఁ డైనదైత్యనిభటాలిఁ గఠోరరవప్రచండవ
క్రాంకనిరంకుశద్విపకులాగ్రణి తమ్మికొలంకుఁ బోలె దు
ష్పంకకలంకసంకటవిశంకటవృత్తిఁ గలంచి మించినన్. 107

క. భూవరశరజన్మనినా
దావిర్భావమున నిల్పె నశ్రుకణంబుల్
జైవాతృకరుచిపాండుర
దేవారివధూకపోలదేశములందున్. 108

మ. ప్రఖరారీణనఖాంశుశోణములు కర్ణస్వర్ణభూషాప్రభా
సఖముల్ శూలివిశాలఫాలదహనజ్వాలాకరాళంబు ల
భ్రఖనీభానవభానురత్నహారణప్రోథంబు లై తచ్ఛిలీ [మున్.
ముఖముల్ గ్రోలె సురేంద్రజిద్భటసుహృద్భూతాసువాతూల

### రత్నచూడుఁడు గజారూఢుఁడయి దిలీపుని మార్కొనుట

వ. అవ్విధంబు వీక్షించి రత్నచూడరాక్షసాధ్యక్షుండు తీక్ష్ణం
బులు కృతాంతమణివేణికలు వాఁడిరాఁ దీఁటుశాణంబులుం
బోలెఁ జిఱుఁజిఱుఁ దిరుగుచు విస్ఫుటస్ఫులింగాసారంబులు
బోరనం గురియుచుండ సముచ్చండగండస్థలీనిర్గళదచ్ఛా
నర్గళదానాంబుధారాధోరణీమరాళపృథుకంబు లగుశ్రవణ
మూలవిలంబివిలాసకంబుల నదభ్రశరదభ్రశుభ్రప్రభాపరిభ్ర
మణవిభ్రమంబుల దంతకుంతద్వయీకాంతిసంతానంబులకుం
బైకొసనుగా వీరరసాంభోధి రంగత్తరంగతరంగితోన్నిద్ర
విద్రుమాంకురంబు లగుసముజ్జృంభికుంభస్థలీనిగుంభిత
సిందూరరజోరాజివిభ లుభయపక్షలక్ష్యమాణకనకకక్ష్యా
నైగనగ్యంబుల కనుంగు లై పెనంగ నీలాశైలాభోగవిగా

హినిజదేహచ్ఛాయాతోయదాఖండలధనుఃఖండమండితంబు
లగుసముదంచితానేకనూత్నరత్నరంజకాదీప్తినిచయంబులు
ఫాలస్థలీహట్టవిశాల హైమవటికామరీచికా ధట్టంబులకుం
బట్టుఁగొమ్మలుగాఁ గట్టాయితం బై విరోధిప్రాణవాతూల
గిళనారంభవిజృంభకుంభీనసప్రచండం బగుశుండాదండంబు
చాఁచి కొండొక పూఁచి వరవాహినీప్రతాపపావకంబుం
జల్లార్చువెఁవరియుం బోలె వమధుశీకరనికరంబు లెల్లెడలం
జల్లుచు హయధట్టంబుల రథంబుతెట్టువల మత్తకరుల
మొత్తంబులం బదాతివ్రాతంబుల మట్టియు మల్లాడి నేల
మట్టంబు సేయుచు దిట్టతనంబునకుఁ బట్టగుపట్టమేనుంగు
నెక్కి ప్రతిభటపటలీధనుర్విముక్తసాయకనికాయంబుల
నిరంకుశాంకుశచాలనకేలీప్రచారంబులం దప్ప దట్టుచుఁ
దనమీఁదఁ జనుదెంచుదైత్యపంచాననంబుం గటాక్షాంచలం
బున నిరీక్షించి యవ్వసుంధరాధురంధరుండు; 110

దిలీపరత్నచూడదనుజుల ద్వంద్వయుద్ధము

తే. పాదఘట్టన వసుమతీభాగ మగల
నెదురుగా వచ్చునేనుంగు నింద్రహృదయ
భిదుర మగుదైత్యవిభుఁ జూచి మది నొకింత
కోప మొదవ భుజారూఢచాపుఁడగుచు. 111

మ. గుణవృత్తిన్ నినదంబు దైత్యరథినీకోలాహలాక్షేపకా
రణ మై పర్వ నఖర్వగర్వభుజసారక్రూరధారానివా
రణతేజో విజయాభిరాముఁ డగుచున్ రత్నచ్ఛటాపుంఖదా
రుణబాణప్రకరంబుచేఁ బొదివె నార్పుల్ మీఱ శుండాల
మున్. 112

క. చండాంశుకిరణపటలీ
హిండితమేఘుంబుజాడ నినవంశ్యధనుః
కాండాచ్ఛాదిత మయ్యను
శుండాలవిభుండు బిఱుసు చూపుచుఁ గదియన్. 113

క. చరణములు నాలుగమ్ములఁ
గర మొక్కటఁ గుంభపీఠిఁ గాండత్రయి ని
ష్ఠురగతి ఖండించి కరిం
బరిమార్పఁగఁ జూచునంతఁ బ్రాదివిజుండున్. 114

ఉ. తోమరయుగ్మకాహతుల దుర్వహగర్వ మెలర్ప రాజసు
త్రాముని పేరురంబు వితతం బగుఫాలము వ్రక్కలించె ను
ద్దామనవారణాంబుఝరధారలు మేరుతటాగ్రశృంగల
గ్నామితభానుభానుయుగళాకృతి బోరన జాఱుచుండఁగన్.

తే. అసురనాయకుతోమరహతికిఁ దాళె
ధరణినాథుండు; తనదు దంతావళంబు
గూలుటయు వాలుఁబలుకయుఁ గొని సురారి
మీఁద లంఘింపఁ జూచి యమ్మిహిరకులుఁడు. 116

{ దిలీపుఁడు రత్నచూడదనుజుని పాశుపతాస్త్రంబుచే బడబానలంబునఁ బడవేయించుట }

క. శరహతులం దద్గాత్రముఁ
దెరలింపఁగ రానివరము దెలిసి మహేశుం
బురవైరి నంతకాంతకుఁ
గరుణానిధి మనసుఁదమ్మిఁ గదియించి తగన్. 117

సీ. ప్రీలిననేలలో వెడలి యాదిమభోగి
బహుఫణామణుల దీపముల నొసఁగఁ,

జలితార్కబింబనిర్గళదంశువీచికల్
 వేలుపుమానిక్రొవ్విరులు గాఁగఁ,
గగనగళత్తారకాకోరకంబులు
 ప్రస్థానలాజవైభవము గాఁగ,
బిగిపాఁతు గదలి బిట్టిగయుభూభృత్కోటి
 యావటించుఫలోపహారములుగ,

తే. 'నయ్య, జయ్య నమోనమో, హర, మహేశ'
యనుచు బ్రహ్మాదిసురలు కృతాంజలులుగఁ
జండకోదండమౌర్వీప్రచండముగను
జేసెఁ బాశుపతాస్త్ర మతీక్ష్ణభక్తి. 118

వ. ఇవ్విధంబున నవ్వసుంధరాధ్యక్షుండు విరూపాక్షదేవతాకం బగునయ్యంబకంబుం బ్రణుతించి మ్రొక్కి: "నిర్జరారి మేను జర్జరితంబు సేయక గ్రక్కునం గొని గరుజ్జవనపవనసముల్లోలకల్లోలహల్లీసకసమున్నిద్ర సముద్రజఠరపిఠరాంతర నిరంతరజ్వాలాకరాళబడబాగ్నిస్ఫులింగమధ్యంబున నిడి వడిం దిరుగం జిత్తగింపు." మని తెగ నిండఁ దిగిచి యేసిన:

మహాస్రగ్ధర—
మణిపుంఖప్రేంఖదుద్యన్మహితరుచులు దిఙ్మంజుభూషాకపోల
క్షణకాశ్మీరాంకరేఖాఘుటనపటిమ దృక్పర్వమై పర్వఁగాఁ జా
రణగంధర్వాప్సరోనిర్జరుల కసురహృద్రాజికిన్ మృత్యునేత్రో
ల్బణనిర్యద్విస్ఫులింగప్రతతులుగరయప్రౌఢిరూఢిం దలిర్పన్.

తే. ఆహుతిగ దానవేంద్రుఁ బెల్లాక్రమించి
కఠినభీషణశరరజ్జుగతుల నేఁగి

బాడబానలకీలలపాలు పఱిచి
వచ్చి భూపాలుతూణీరవసతి నిల్చె. 121

ఉ. తెమ్మెరకమ్మఁదావులకుఁ దేఁటిగముల్ తొకుతొక్కులాడఁ
బైఁ గ్రమ్మెడుతేనియల్ చెమరు గాఁగ దిగీశవధూకుచస్థలిం
జిమ్మెడుపుష్పాదుల్ గగనసీమకు బంగరుమేలుకట్లుగా
నమ్మహిభర్తపై దివిజు లప్పుడు నించిరి పూవుసోనలన్. 122

సీ. సంగ్రామవిరతి రాజన్యుఁ డమాత్యహ
స్తమున కిచ్చెను భుజాచాపలతిక,
భానుదేవుఁడు రాజుపంపునఁ జతురంగ
వాహినీధాటి నుత్సాహ మెసఁగ,
మందరాద్రికి నేఁగి మాయావతీపురి
చుట్టుముట్టిన రత్నచూడమహిషి,
యాత్మీయతనయు నరాంతకుఁ దత్పాద
వనరుహంబులమీఁద వైచి దివిజ
తే. సూదనుం డింద్రధామంబు చూఱవట్టి
యాహరించినసంపద లప్పగింప
దానవాధీశసుతుఁ దత్పదమున నిలిపి
మరలి చనుదెంచె భూపాలవరునికడకు. 123

వ. అప్పుడు: 124

మాలిని. కరిహరిభటకోటీగాఢసమ్మర్దలీలా
భరపరిణత సైన్యోద్భాసి యై వచ్చి ధాత్రీ
శ్వరుఁ గనుఁగొని పల్కెన్ జంభసంభేది "బాహా
పరిణతి నెన లే రేపార్థివుల్ నీకు నుర్విన్. 125

క. తొల్లిటిచోటనె మహీభు
గ్వల్లభ, ఖగవిభుఁడు చంపకావతి సురథుం
డుల్లసిల నిల్పెఁ గరుణా
కల్లోలితహృదయుఁ డగుజగత్పతియాజ్ఞన్." 126

వ. అనుటయు: 127

దిలీపుఁడు సకలపరివారముతోఁ జంపకావతిఁ జేరుట

మహాస్రగ్ధర. కదలెం గంఖాణరింఖా
కఠినఖురపుటీఘట్టితస్వర్ణగోత్రా
భ్యుదితోద్యద్ధూళిపాళీ
యుతకకుభ మిభవ్యూహగండస్థలాంచ
న్మదధారావాహినీదం
బరము రథరవామగ్నపాతాళ ముగ్ర
స్యదనానాయోధయూధం
బగుబలము బలాయత్తమై చేరి కొల్వన్; 128

క. మదగజము నెక్కి సురథుం
డెదురుకొనం దత్పురంబు నినవంశుఁడు స
మ్మదము మది నొదవఁ జొచ్చెం
ద్రిదశేంద్రుఁడు చనఁగ నగ్రదేశమునందున్: 129

పౌరాంగనలు దిలీపుని సందర్శించుట

గీ. నూతనాగతరాజన్యశీతకరునిఁ
జూచువేడుక శృంగారసురుచిరాంగ
లైనపురవారిజాక్షుల కగ్గలంపుఁ
దమక మొదవించె నపుడు డెందములయందు. 130

తే. వేణి యొకకేల, నొకకేల వీఁగుఁజన్నుఁ
గవయు నూదుక చనుదెంచెఁ గాంత యొకర్తు;
పినుఁగునెన్నడు మిట్టట్టు బెణఁకకుండ
రెండుదిక్కుల భర మాని యుండె ననఁగ. 131

శా. చేతం గజ్జల మంటి యుండ నొకచేఁ జెల్వొంద నాదర్శ మ
బ్జాతాలోక యొకర్తు కాంచనగవాక్షశ్రేణి వే డాసెఁ ద
చ్చేతోజాతసమానుఁ జూడ ముఖసంసేవాగతేందూదరో
ద్భూతం బైనకళంకపంకము వెలిం బోఁ జల్లుకాంక్షంబలెన్.

తే. సగము ముడిచినవేణికాస్తబక మొక్క
చేత ధరియించి చనుదెంచెఁ జెలువ యొకర్తు
ఫణిఫణాగ్రాహికేకిడింభంబు గవిసి
గట్టివాయితనంబునఁ బట్టె ననఁగ. 133

సీ. "భానుమతీగర్భపాథోధిసంజాత
సంపూర్ణపూర్ణిమాచంద్రుఁ డితఁడె;"
"నానాదిగంతభూనాయకాయతశౌర్య
విజయసంరంభప్రవీణుఁ డితఁడె;"
"భీమసంగ్రామనిస్సీమసాహసధామ
సుకరఖండితరత్నచూడుఁ డితఁడె;"
"సురధేంద్రనందనీశుభతరవ్రతసార
పారిజాతోదితఫల మితండె;"

తే. యనుచు మేడలనుండి తొయ్యలులు లాజ
లపుడు పైఁ జల్ల నారాజహంస ములికె
నతనుఁ డనుబోయ కరనాళయంత్రకముల
నూఁదఁ బఱతెంచుపటికంపుటుండ లనుచు. 134

వ. ఇవ్విధంబునఁ బరిణయోచితశృంగారరచనాలోచనానంద
కరం బగుతత్పురంబుఁ బ్రవేశించి పరిణయసమాగతమునిదివిజ
వరారోహానివహంబులం గనుంగొనుచుఁ బురాపురందర
ప్రేషితమయనిర్మితభర్మసౌధంబున విడియుటయు సురథుండు
సుచితవిధానావధానతత్పరుం డయ్యెఁ. దదనంతరంబ; 135

ఉ. ఆమఱునాఁడు ప్రొద్దున బృహస్పతియున్ రవివంశదేశిక
గ్రామణియున్ "జతుర్థఘటి కామిత మింతియ లగ్న; మేటికిం
దామస?" మంచుఁ దెల్పుటయుఁ దన్వికి భూపతికిం బురంధ్రికా
స్తోమపరిష్క్రియోచితవిధుల్ శుభలీలల సాఁగె నెంతయున్.

సుదక్షిణాదిలీపుల వివాహాలంకారవర్ణనము

తే. పరిణయోచితశృంగారభాసమాన
పూర్తి యారాజదేవేంద్రమూర్తిఁ జూచి
నలినబాణుండు నాననో నాఁటనుండి
మీఱి డెందంపుగొందులు దూఱుచుండు. 137

వ. అంత నక్కడ; 138

సీ. తల యంటె నొకచాన కలికిగోరుల దువ్వి
యాళులఁ దేనియల నోలార్చె ననఁగ;
లేమ యొక్కతె గంధలేపంబు మై నూన్చె
నెలరేకఁ బొదువుడిండీర మనఁగ;
నలకల నోర్తు గంధామలకము నించె
నిరుల వెన్నెలఁ గదియించె ననఁగ;
జలకంబు గావించె నలకంబుగళ యోర్తు
కంతుకటారిపుల్కడిగె ననఁగ;

తే. మేనితడి యొత్తె నప్పు డోర్తు మీననయన
కనకపుత్త్రిక కొకవన్నె యునిచె ననఁగ;
నవదుకూలంబు నందిచ్చె నాతి యొకతె
క్రొమ్మెఱుంగున వెలిమొగుల్ గూర్చె ననఁగ. 139

తే. కురులతడి యార్పఁ గోరి చకోరనయన
లల్లనల్లన వీవ నుత్ఫుల్లకుసుమ
తాలవృంతానిలంబు లత్తరుణిమీఁదఁ
బ్రబలె మాన్మథశరగరుత్పవనలీల. 140

తే. కొమ్మ నలయించుచంద్రికాంకురము తెల్ల
డాలుఁ జీఁకటిపొదిలోన డాఁచె ననఁగ
వెలఁది యొక్కతె కడివోనివిరులు దుఱిమి,
కొప్పు సవరించె నొయ్యారముప్పతిల్ల. 141

చ. నెఱయఁ బదాఱిటక్క విఱిగి నీదగు కాంతికిఁ గాక చాల వం
దురినమదీయవల్లభునితోడివిరోధము మాను మంచు డ
గ్గఱి వినయార్థమై వదనకంజముఁ జేరినతారలో యనం
దెఱవకుఁ గర్ణపూరముల దిద్దినమౌక్తికరాజి రాజిలున్. 142

ఉ. బాలకు నాణిముత్తెములపాపట కుంతలమార్గవీథి నీ
లాలక యోర్తు నించెఁ దుహినాంశుకరావళియావళిం దమో
జాలవిభేద మింతయును సల్పుటకుం దఱి గామి సంధిమైఁ
దాలి యొకింత నిల్చె ననఁ దాండవమాడురవిప్రకాండముల్.

తే. భువనసమ్మోహనాకాంక్షఁ బుష్పధన్వి
పొన్నుమెట్టియ నెత్తమ్మిపూవునడుమఁ
ద్రాణమై డాఁచె ననఁగఁ గట్టాణిముత్తి
యంపుముంగర విలసిల్లె నబ్జముఖికి. 144

క. వెండియుఁ గలమణిభూషణ
మండలిచేఁ బొలిచె నృపకుమారిక యిగురుం
దండంబునడుమఁ దగునా
ఖండలవిటపప్రసూనకళికయుఁ బోలెన్. 145
వ. అప్పుడు: 146
తే. లాటగౌళాంధ్రభూపలలామకోటి
గతుల నిరుపక్కియల నూడిగములు సేయ
భద్రకరి నెక్కి శుభతూర్యపటలి మ్రోయ
సురథునింటికిఁ జనఁబూనె సూర్యకులుఁడు. 147
సీ. హాసచంద్రికలతో నసఁగి పెనంగెడు
డా లొందుముత్యాలప్రాలతోడ,
భూరికాఠిన్యవక్షోరుహప్రతిభట
క్రమనారికేళఫలములతోడ,
దేహసౌరభ్యంబు మోహరింపఁగఁ జాలు
బహువిధపుష్పసంపదలతోడ,
రుచిరనిజాధరారుణ్యవిశేషంబు
తవణించుక్రముకఖండములతోడఁ,
తే. జెక్కుగమిధాళధళ్యంబు సుక్కలించు
లలితసితనాగవల్లీదళములతోడఁ;
గ్రంత ధరియించి శుభగానకలకలంబు
లడరఁ గాంతలు చనుచుండి రగ్రభూమి. 148
తే. సురథభూపాలుననుజుండు సూర్యధన్వుఁ
డనునృపాలకుం డగ్రజుననుమతమున
హారము ల్పెరెములు దాఁట నరుగుదెంచి
పెదహజారంబునడిచక్కి నెదురుకొనుడు; 149

ఉ. సింధురరాజు డిగ్గి సరసీరుహమిత్రకులాన్వయుండు సం
బంధికరంబు నూఁది మణిపాదుక లార్భటి మ్రోయఁగా సుధా
సింధుపుఁ జొచ్చుశ్రీవిభుని చెల్వున మామగృహంబుఁ జొచ్చెఁ
బు-ష్పంధయ వేణి కాచలితచామర చంద్రిక లుల్లసిల్లఁగన్. 150

చామరవృత్తము. ఈరసాభోగ మే యెల్లచో నీమహః
పూరముల్ నిండె నన్ పోల్కి-మై నిచ్చి రా
కీరసల్లాపినుల్ కెంపురాదీపముల్
వైరిభూపాలకవ్రాతసంహర్తకున్. 151

వ. అట చని; 152

సుదక్షిణా దిలీపులవివాహము

ఉ. బంగరుపెండ్లిపీఁట మహిపాలశిఖామణి సంవసింప శే
షాంగదసన్నిభుండు సురథాధిపుఁ డాత్మవధూటి పచ్చరా
లం గర మొప్పునిద్దపుగళంతి జలంబులు వంప భక్తి లీ
లం గడిగెం దదంఘ్రియుగళంబు గళత్ప్రమదాశ్రుపూరుఁ డై.

తే. మనుజనాథకుమారుండు మామ యప్పు
డర్పణము సేయుమధుపర్క- మాదరించె
నాసుదక్షిణ కెమ్మోవియమృతరసముఁ
గ్రోలుసన్నాహమున కెలగోలు గాఁగ. 154

ఉ. ఆఁకలి దప్పియుం గలుగ దంటినమాత్ర; జరాభరంబు మై
సోఁకదు; నిచ్చఁ గ్రొత్త యగుసొంపునఁ బెంపు వహించు
దీప్తిచేఁ;-గాఁక వెలుంగురంగు నొకకానికిఁ గైకొన; దేడ
గల్గెనో-యేఁకట మానికం బొకటి యిచ్చెఁ గులాగత మాన్య
భర్తకున్. 15

చ. అసిలతధార వైరులకు నామరలక్ష్మియు, దానధార న
ర్థిసమితి కాదిలక్ష్మియుఁ, బ్రతిష్ఠగఁ జేసినదాతృవర్యుఁ డ
బ్జిసరుహామిత్రవంశ్యుఁ డొక బిత్తరికై చెయి చాఁచెఁ గామినీ
వ్యసనపరాయణుం డెఱుఁగునా నిజగౌరవవైభవోన్నతిన్!

తే. రాజితాంభోజరాజిచేఁ దేజరిల్లు
నలసరోదేవతలలీల నబ్జముఖులు
పళ్లెరంబుల రత్నదీపంబు లునిచి
నిలిచి రవనీశుచెంత నన్నెలఁతచెంత. 157

మ. కలకంఠీకలకంఠకంఠరవముం గంజాశుగజ్యాలతా
కులకోలాహలముఁ శుకీమధురవాగ్గుంభంబు వాగ్వల్లకీ
కలితాలాపకలాపవైఖరియు నేకగ్రీవ మౌ రేవ మ
చ్చులుగాఁ బాడిరి కాంత లాదిమమహాశృంగారకల్యాణ
మున్. 158

తే. వనజనేత్రలు తెర యెత్తి వంప నెదుట
రాజుఁ జూచి బిరుక్కన రమణిదృక్చ
కోరికలు వ్రాలెఁ బదనఖకోరకాంశు
చంద్రికల; వాసి యెంతురె చపలగతులు! 159

ఉ. కాంతయుఁ గాంతుఁడుం గనకకంకణనిక్వణముల్ చెలంగ నే
త్రాంతముల న్నవీనదరహాసరుచుల్ నసలెత్త హర్ష సం
క్రాంతమనఃప్రసక్తిఁ దలఁబ్రాలుఁ బరస్పరమౌళివీథులం
గంతునికీలుబొమ్మ లనఁగా ఘటియించిరి దోయిలింపుచున్.

ఉ. హల్లకగంధియుఁ నృపకులాగ్రణియుఁ మణికంకణప్రభా
వేల్లితపాణిపద్మముల వేల్చిరి వేడుకతో హవిశ్శమీ

పల్లవరాజలాజతతి పావన నూతన ధూమరేఖ లు
త్ఫుల్లనిజాస్యవాసనకుఁ దోఁచినతేఁటులచాఁటులో యనన్.

చ. "అతనునిశాతబాణహతి నంబుజలోచన, యిన్నినాళ్లు నా
కతన నలంతఁ జెందితివిగా యిది సైఁచు" మటంచు భక్తి నా
నతుఁ డగువాఁడు వోలె నరనాథకుమారుఁడు తత్పదంబు నీ
హితమతి సన్నె కంట బెరయించె నుదంచిత రాగసంపదన్. 162

వ. మఱియు నద్దంపతులు ప్రత్యక్ష యగునరుంధతికి మ్రొక్కిరి; ధ్రువునికి క్షీరార్ద్రాక్షతారోపణం బవధరించిరి; శ్రీమంచంబున వసియించిరి; పురంధ్రీ జనంబులకుం దాంబూలంబు లొసంగిరి; సకలబంధువ్రాతంబు లభిమతవివిధాహారవిహారంబులం బరితోషంబుఁ బోషించి రయ్యవసరంబున; 163

ఉ. "ఇచ్చితి మాజయంతునకు నీవెలిమావును; దీని మాఱుగాఁ
దెచ్చితి బ్రహ్మచే నడిగి; దేవత లచ్చెరు వంద నెక్కినన్
వచ్చు జయింపఁగాఁ గడిఁదివైరులఁ బోరుల." నంచు వాసవుం
డిచ్చె మహీమహేంద్రునకు నెక్కుడిదో యొక కర్తలాణ
మున్. 164

వ. ఇచ్చి మునిగణంబులతోఁ బౌలోమీసహితుండై పాకారి నాకంబునకుం జనియె. నిట నాగవల్లి యొనర్చి సాకేతవల్లభుండు ప్రయాణోన్ముఖుం డగుటయు: 165

ఉ. ఆ రతికైన భారతికి నైన రమాసతి కైన నబ్బురం
బై రహి మించి యెంచ దగి యాణియుఁ బోణియుఁ గల్గు
ముత్తైపుం-బే రొక టిచ్చె భూవిభుఁడు పేరును బెంపు
నిజాన్వయంబునం-గూరుపఁ జాలి పొల్చుతనకూరిమిబిడ్డకు
సమ్మదంబునన్. 166

చ. పసుపున కిచ్చె భూవిభుఁడు ప్రాణ మనంగను బొల్చునట్టిసా
రసదళదీర్ఘలోచనకు రాజనిభాస్యకు నాత్మపుత్త్రికిన్
ప్రసవరసప్రవాహతటబాలరసాలసితేక్షునారికే
ళసరళశాలిసంపద దళం బగు గ్రామశతంబు నర్మిలిన్. 167

తే. విభునికడఁ గూడఁ జనియెడు వేడుకలను
జననిఁ బెడఁబాయఁ జాలనిమనికితమున,
నావిలం బయ్యె సతిడెంద మాదిజలద
ధారచే నూష్మచే మహీతలము వోలె. 168

క. తల వాంచి కన్నుఁ జిప్పలఁ
గొలకొల ముత్తెములసోన గురియుతనూజం
గలకంఠిఁ జిక్క నక్కున
నలముచు ని ట్లనియెఁ దల్లి యతిమృదులోక్తిన్. 169

సీ. "ఈయింటి కాయింటి కెరవు లే దంతయు
మాయమ్మ నీ కేల మనికితంబు?
నేఁ బిల్వఁ బంపెద నేటిరేపటిలోనఁ
బ్రియుచిత్త మెఱిఁగి వర్తింపు; విభుఁడె
దాత దైవ మభీష్టధన మని చింతించు;
కులశీలవతు లైనచెలులతోడఁ
జెలిమిఁ గావింపు; వాసియు వన్నెయును దెమ్ము
కులమున; కధిపుతో నలుగఁ బోకు;
తే. మాఱు వల్కకు వరునకు మఱచియైన;
యశము సుకృతంబు సమకూర్పు; మఖిలబంధు
కోటి గొనియాడ మను." మంచుఁ గూఁతునకును
బుద్ధు లొకకొన్ని దెల్పి యంపుటయు నపుడు. 170

### వివాహానంతరము సుదక్షిణాదిలీపు లయోధ్యానగరమున కేఁగుట

సీ. గంధాంధకరిఘటాకటనిర్గళద్దాన
  ధార లార్ద్రము సేయ ధరణితలముఁ,
కంఖాణఖురపుటీఘటితధాత్రీరేణు
  వభ్రగంగావారి నసలుగొల్ప,
రథచక్రనేమినిర్భరమహాఘోషంబు
  లాశాతటంబులయవలి కరుగ,
భటసముద్భటభుజానటదసిప్రభలచే
  మింటఁ దాండవ మాడ మెఱుఁగుగములు,
తే. తుములతుత్తుంభురవఘుమఘుమితభువన
గోళ మగుసైన్యము భజింపఁ గువలయేశుఁ
డరిగె సంతోషమున నయోధ్యాపురమున
కాసుదక్షిణఁ గూడి నెయ్యము దలిర్ప. 171

వ. ఇవ్విధంబునఁ బురప్రవేశం బాచరించి రాజవికర్తనుండు చిరవర్తనంబునం బ్రవర్తింపుచు నుండె నంత శుభముహూర్తంబున: 172

సీ. పచ్చలజంత్రంబు బకదారిపులుఁగుల
  పలుకులతళుకులు గులుకరింప,
సూత్రంపురాజాటిసూత్రంపుఁబ్రతిమల
  వలరాచపోరుదువాళు లడరఁ,
బులుమేఁతమానికంబులకీలనపుఁదేఁటి
  దాఁటుల మరుగెల్పుపాట లెసఁగ,
రాణింపుఁజవులకట్టాణిరావెలిచిల్క
  ననుపుఁబొత్తపుఁగతల్ నినుపు మీఱ

తే. లచ్చికొమరునిగర్వంబు మెచ్చు లిచ్చు
నిచ్చకలిమియు రూపుగా నిలిపి రనఁగ,
మణిమయం బైనయొక కేలిమందిరంబు
నాయితముఁ జేసి రధిపాబ్జనాయకునకు. 173

## సుదక్షిణా దిలీపుల ప్రథమసమాగమము

చ. కలికిమిటారిపచ్చికలఁ గచ్చుల నెచ్చరికించుమించుఁ బ
ల్కులు గలకీలనంపుశశికాంతవినిర్మితనూత్నపుత్త్రికల్
కెలఁకుల నించుమించు తులకించినమంచమునం దనర్ఘమై
పొలుచుదురంగిపట్టుపఱపుల్ విఱుపుల్ గొనుడాలు దేలఁగాన్

తే. వాసనాధూపధూమవిభాసితంబు
దివ్యకురువిందమణిదీపదీపితంబు
తరుణమందారదామవితానయుతము
నగుచు విలసిల్లెఁ దద్గృహాభ్యంతరంబు. 175

వ. అప్పుడు: 176

శా. పన్నీటం జలకంబు దీర్చి తరుణీపంచాస్త్రుఁ డా రాజు లే-మి
న్నల్ గుల్కెడునొంట్లు హారలతయుల్ మేతావినున్బాత
యుల్-మిన్నుంగన్ను మెఱుంగురంగును సురా మెట్టుంబసల్
వేల్పుఁబూఁ-బిన్నల్ చుట్టుశిఖాకలాపము దగం బ్రేమంబు
దైవాఱఁగన్; 177

తే. కెరలి పైకొన్నవలరాజుకీర్తి వోలె
వలిపదుప్పటివలెవాటు చెలువు మీఱ
ముగురునలుగురుజవరాండ్రు మ్రోలఁ గొలువఁ
జనియె మహీభర్త కేళికాసదనమునకు. 178

వ. అప్పుడు మందారలతికాదిసఖీబృందంబు సురథనందనకు నలంకారం బొనరించి: 179

సీ. "గొనబుగా రతిదేవిగుబ్బచన్గవ నింత
యొఱఁగినమరుఁ జూడు మోలతాంగి;
గౌతమప్రియవధూకాంతుఁ గుక్కుటమైన
జంభారిఁ జూడు మోచంద్రవదన;
దాశకన్యాకేలి దర్పకునకు లొంగి
యున్నసంయమిఁ జూడు మోవధూటి;
దారువనక్రీడఁ దపసికన్యలఁబారిఁ
బడినశంభునిఁ జూడు పద్మనయన;"

తే. యనుచు నాయాయిచిత్రంబు లచట నచటఁ
జూపునెపమున మరలించి సురథరాజ
తనయ సాకేతపట్టణాధ్యక్షుఁ డున్న
కేళిభవనంబుఁ దార్చె సఖీజనంబు. 180

క. "చదువఁగఁ బాడఁగ నేర్చిన
చదురగు రాచిలుక యిచటఁ జంద్రముఖీ, యు
న్నది చూతు గాని ర." మ్మని
కదియించిరి మగువఁ గేళికాసదనంబున్. 181

చ. ఎదుట మహీశుఁ గాంచి తరలేక్షణ మేను చెమర్ప సమ్మదం
బొదవియు సిగ్గుపెంపునఁ బయోజదళాక్షుల వంపుఁజూపు
ముం-దుదల నదల్చి వైచి కరతోయజకేళిసరోరుహంబునన్
బదరుచుఁ ద్రిప్పి వైచె విభుపార్శ్వగతం బగురత్నదీపమున్.

క. వేగభ్రమదంభోజప
రాగావృతనేత్ర యైనరమణి మొఱఁగి యా

నాగేంద్రయాన లరిగిన
రాగకలాకలితుఁ డగుచు రాజేంద్రుండున్. 183

తే. బాలకేలు గేలఁ గీలింప నెదుటికి
వీఁగ వెనుక కతివ వీఁగు టలరుఁ
బూఁచి యున్నవాలు భూపాలుఁ గని లోఁగి
మగిడి మన్మథుఁడు దిగిచె ననఁగ. 184

క. పరభసముదితలజ్జా
శరధిద్వీపాంతరం బసాధ్యమె యేలో
కర మీఁక పెనఁగె భూభృ
ద్వరునకు నొక కొంతసేపు వనజేక్షణయున్. 185

తే. అధికగంభీర మైనయయ్యవనినాథు
తలఁపు బల్కో పదృక్ష్మాత్ర గెలిచి వ్రాయు
భూరివిజయాంకమాలికల్ వోలెఁ జరణ
నఖముఖంబుల ధర వ్రాసె నలిననయన. 186

ఉ. చూపులతూపుహాని మొనచూపక నెమ్మొగ మేల వంచెనో
భూపకుమారి యానృపతిపుత్త్రుఁడు నంతనె సంతసిల్లి పెల్లే
పున నాక్రమించెఁ గర మెక్కటిపోరున మోహరించువాఁ
డోపిక చూపఁడేని పతియొద్దకు గెల్పగు టేమి చోద్యమే!

చ. తనయసమాంబకస్ఫురణఁ దార్కొని యున్నరతీశు గెల్చు
కాంక్షనొ మహీపావలోకము ముఖాముఖిఁ గైకొనియెం
బరయోజలోచనజిగిబొమ్మసింగిణుల జవ్వనిచూపులతూపు
మూఁక నంగనగళశంఖముఁ సకియకర్బురరోమలతాసి
వల్లికన్. 188

మ. కచతాపింఛనికుంజముఁ వెడలి భ్రూగాఢాంధకారంపు మే
టిచటిఁ దిగ్గన డిగ్గి కాంతకుచకాఠిన్యాద్రులం ద్రొక్కి పూ

ని చోరం బాఱి వలగ్నసూక్ష్మపథ మెంతే శ్రాంతి వాటిం
చెనో-విచలించెన్ నృపుమాడ్కి నాభి యనుబావిం దాఁట
శంకించుచున్. 189

చ. కురు లనునీలరత్నములగుంపు కపోలవిలోలఘర్మశీ
కరనవమౌక్తికాళిఁ గుచకాంచనకుంభయుగంబు నబ్బినం
దిరుగక రాజుకేలు సుదతీమణికాంచి హరించునాస న
య్యురువున కేఁగి పట్టువడియెం గడిదేరనిచోరుఁడుంబలెన్.

సీ. అభినవసౌభాగ్యవిభవసామగ్రి లో
చనమత్స్యరాష్ట్రరంజన మొనర్చి,
ముఖపుష్కరద్వీపమునఁ గమ్మఁగెమ్మోవి
పగడంబుడంబు మచ్చుగ గ్రహించి,
యంగప్రభాసింధుసాంగత్యమహిమచే
మానసాంబుజ ముబ్బు నూనఁ జేసి,
గండస్థలాభోగకాచసారస్యంబుఁ
బూనిక కైవసంబుగ నమర్చి,

తే. తోర మైనకటిస్థలదుర్గ మొకటి
యపుడ సాధింప లేఁ డయ్యె నవనిభర్త,
యతివకటియాపబిగిమీఁద నడ్డపడిన
గనయ మనియెడుముడికానికతనఁ జేసి. 191

క. సరి పెనఁగునింతిలజ్జా
శరధికి ఘటసూతి యయ్యె; సఖుఁ డయ్యె రతీ
శ్వరుఁడు; బలవత్సహాయమె
హారు వగుఁగా కేలదొరల కబలాపేక్షల్. 192

ఉ. గట్టగుకూర్మితో బిగువుఁ గౌఁగిటిగద్దియ నిల్పి కోర్కికిం
బెట్టగు నేర్పుమాఁక గనిపించి మనోజుఁడు దాడి వెట్ట ము

న్గట్టినభావసీమ తిరుగంబడ నీక యమర్చి కోమలిం
బట్టము గట్టె భూవిభుఁడు పంచశిలీముఖరాజ్యలక్ష్మికిన్. 193

ఇవ్విధంబున: 194

వలపులనెత్తమ్మికోలఁకుల కెలఁకులఁ
గృతకరతోన్నతగిరులదరులఁ
బూవులతావులమావులక్రేవల
విధుకాంతమణిసౌధవీథికలను
హారువైనహొన్నాణియరఁగులచెఱఁగుల
శైత్యమయాస్తోకసైకతముల
సేవంతిపన్నీటిసెలయేటిమాటుల
మల్లికావల్లికామంటపములఁ
తే. గప్పూరపుటంటిక్రీనీడచప్పరములఁ
బొలుపు మీఱినపగడంపుఁబొదలపొదుల
మగధసుతఁ గూడి మదనసామ్రాజ్యలక్ష్మి
ననుభవించుచు ధర యేలె నవ్విభుండు. 195

ఉ. ఈతియు భీతియుం గలుగ దెక్కడ నైన నిరంతరార్యసం
ప్రీతియు నీతియున్ సరసరీతియు నిం పొదవన్ మహీతలం
బాతతవైభవోన్నతుల నభ్యుదయంబు వహించు శౌర్యవి
ఖ్యాతరతిన్ దిలీపమహికాంతుఁడు రాజ్యము సేయునత్త
ఱిన్. 196

ఈకథ చదివిన వ్రాసినఁ
నాకర్ణించిన నిరంతరాయశ్రేయ
శ్శ్రీకిం బ్రాపగు నరుఁడు వ
శీకృతవిజయాభిరామ, శ్రీరఘురామా!" 197

క. అని యిట్లు రామచంద్రున
కినకులకలశాబ్ధిహర్షకృతిచంద్రునకుఁ
మునినాథుఁ డయ్యగస్త్యుఁడు
వినిపించె గభీరధీరవిశదప్రౌఢిన్. 198

శా. లక్ష్మీసోదరధామ, ధీమహితలోలస్వాంత, దుర్దాంతవై
రిక్ష్మాపాలకమంత్రిమంత్రహరణక్రీడాసముద్యద్విధా
సూక్ష్మోపాయధురీణ, రీణభరణాస్తోకప్రశస్తస్పృహా
లక్ష్మా, లక్ష్మణపూర్వజన్మవిజయాలంకారబాహార్గళా. 199

క. వాణీవేణీప్రసవ
శ్రేణీమకరందనిర్ఝరీవార్లహరీ
వాణీవిలాసముదిత
క్షోణీతలనాథయూథ, సుగుణసనాథా. 200

పంచచామరము —

అమోదయా, జయోచ్ఛ్రియా, గుణాంబుధీ, సుధీనిధీ,
దయానయాకరా, వరాపదాన, దానకల్పకా,
భయాప్రియానభిజ్ఞ, తద్జ్ఞబంధుసింధునాయకా,
శయాశ్రయాంబుజాతజాతచక్రచాపలక్షణా! 201

గద్యము. ఇది శ్రీమత్తెనాలిరామేశ్వరశాశ్వతకృపాకటాక్ష లక్షితకవితాభిరామ రామయపండితకుమార సహజశైవాచారసంపన్న ధీమదన్నయనామధేయప్రణీతం బైనసుదక్షిణాపరిణయం బను శృంగారకావ్యంబునందుఁ బంచమాశ్వాసము

సంపూర్ణము.

చెన్నపురి: 'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము—1941.